ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 26.10.2026 | సంపుటి :13 సంచిక : 96 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# ఓటు ఉంటేనే ప్రజాస్వామ్యం..
# రక్షణకు పోరాటం

**ఫ్రీ పబ్లిసిటీ ఇస్తున్నందుకు భాజపా మిత్రపక్షాలకు థ్యాంక్స్ : రాహుల్**

- ఓటును, దేశాన్ని కాపాడుకుందాం
- నవంబర్ 1న భారీ ర్యాలీకి దేశప్రజలంతా తరలిరావాలని కాంగ్రెస్ అగ్రనేత పిలుపు
- అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు ఢిల్లీలోనే ఉండాలని పార్టీ ఎంపీలకు సూచన



> 'దేశ ప్రజల ఓట్లను దొంగిలిస్తున్నారు, ఈ అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోము. మౌనంగా ఉండబోము. ఓటర్ల జాబితా నుంచి కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించి, నియమ నిబంధనలను ఉల్లంఘించారు. ప్రశ్నలు అడిగిన వారిపై లాఠీలు ప్రయోగించారు. వాటన్నిటికీ ఇప్పుడు దేశం ప్రతిస్పందిస్తోంది. అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ముందుకు రండి. ఎందుకంటే ఓటు మీదే.. పోరాటం కూడా మీదే'
>
> \- రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలనే డిమాండుతో ఇండియా కూటమి నవంబరు 1న రామ్‌లీలా మైదానం వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించింది. ఈ ర్యాలీకి ప్రతిపక్ష నేతలకంటే ఎక్కువ భాజపా, దాని మిత్రపక్షాల నాయకులే ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఇంత ఉత్సాహంతో పెద్ద ఎత్తులో పబ్లిసిటీ చేస్తున్నందుకు, ప్రోత్సహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే 7 రోజులు

మిగతా 2లో..



## గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను
# రద్దు చేయాలి

- ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీ లక్ష్యంగా ఖర్గే తీవ్ర విమర్శలు
- బంగాల్, హరియాణా, బిహార్, మహారాష్ట్రలో 'ఓట్ల చోరీ' ద్వారా ప్రభుత్వాలను ఏర్పాటు చేశారని ఆరోపణ

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేసి, అన్ని ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కోరారు. గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల ను "రెండో స్వాతంత్ర్య యుద్ధం"గా అభివర్ణించారు. బంగాల్, హరియాణా, బిహార్, మహారాష్ట్రలో 'ఓట్ల చోరీ' ద్వారా

మిగతా 2లో..

## 'సర్' లోపాలు బయటపడతాయనే 'ఈసీఐనెట్' సమాచారాన్ని
# ఈసీ దాస్తోంది
కాంగ్రెస్ పార్టీ ఆరోపణ

2లో..



# ఎల్‌నినోపై అఖిలపక్షం
## ఢిల్లీకి కూడా వెళ్తాం .. రెండో పంట వేయొద్దు!

- సూపర్ ఎల్‌నినోతో నీటి కొరత ముప్పు
- తొలి పంటను కాపాడేందుకు ఎంత ఖర్చుకైనా సిద్ధం
- సంక్షోభ నివారణకు కేంద్రం సహకరించాలి: మంత్రి పొంగులేటి

ఖమ్మం(జనంసాక్షి): రానున్న రోజుల్లో సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై అనిశ్చితి ఏర్పడే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ పరిస్థితులు తెలంగాణకే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.38 కోట్ల వ్యయంతో మద్దులపల్లి నుంచి గొల్లగూడెం రోడ్డు వరకు నిర్మించనున్న నాలుగు లైన్ల రహదారి పనులతో పాటు సెంట్రల్ లైటింగ్, డివైడర్, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా రూ.కోటి వ్యయంతో చేపట్టిన జంక్షన్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వానాకాలంలో రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చుకైనా వెనుకాడదని చెప్పారు. పంటలకు అవసరమైన నీరు, విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రానున్న కాలంలో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రెండో పంట వేయవద్దని విజ్ఞప్తి చేశారు. కరువు పరిస్థితులను గతంలో ఎదుర్కొన్న అనుభవం రైతులకు ఉందని, ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. సంక్షోభ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు త్వరలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా అవసరమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కేంద్రంలో

మిగతా 2లో..

## ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ పోరులో సింధుకు నిరాశే..

## ఆర్థిక వ్యవస్థలపై దాడులే
# ఆధునిక యుద్ధాలు
### బ్యాంకింగ్ రంగానికి సైబర్ ముప్పు: ప్రధాని మోదీ

- భువనేశ్వర్‌లో డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రారంభించిన ప్రధాని మోదీ
- బ్యాంకింగ్ రంగాన్ని సైబర్ ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవాలని సూచన

భువనేశ్వర్(జనంసాక్షి): ఆధునిక కాలంలో యుద్ధాలు కేవలం ఆయుధాలతోనే కాకుండా దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కూడా జరుగుతున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ఒడిశాతోపాటు దేశవ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయని తెలిపారు.'నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జంగవని మనందరికీ తెలుసు. ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడులు చేయడం

మిగతా 2లో..



## 'వోకల్ ఫర్ లోకల్'ను బలోపేతం చేయండి
ప్రజల సహకారంతో మన్‌కీ బాత్ అప్రతిహతంగా కొనసాగుతోంది

139వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ ప్రసంగం

వార్త 2 లో



## సన్నబియ్యం అక్రమాలపై
# సీఐడీ కొరడా
**14 మంది మిల్లర్ల అరెస్ట్**

### నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులపై సీబీసీఐడీ అధికారుల దాడులు

- సివిల్ సప్లైస్ అధికారుల పాత్రపైనా ఆరా
- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతూ దోచుకుంటున్న వైనం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో రైస్ మిల్లర్ల అక్రమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వం ఇచ్చిన నాణ్యమైన సన్న రకం ధాన్యాన్ని పక్కదారి పట్టించి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి దొడ్డు రకం బియ్యం అప్పగిస్తున్న అక్రమార్కులపై సీఐడీ విభాగాన్ని రంగంలోకి దించింది. పౌర సరఫరాల సంస్థ అధికారుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన దర్యాప్తు బృందం, ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి, 14 మంది మిల్లర్లను అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. 202526 ఖరీఫ్ సీజన్‌లో పౌర సరఫరాల శాఖ 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఇందులో భాగంగా ఎఫ్‌సీఐకి 59.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. అయితే,

మిగతా 2లో..

## కొరియా పెట్టుబడులకు తెలంగాణలో
# విస్తృత అవకాశాలు
### కొరియాతో సాంస్కృతిక, ఆర్థిక బంధాలకు తెలంగాణ సర్కారు ప్రాధాన్యం



- ఉద్యోగాల కల్పన, సాంకేతిక పరిజ్ఞాన బదిలీకి ప్రాధాన్యం
- ఐదేళ్లలో పర్యాటక రంగానికి రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యం
- మూడు లక్షల అదనపు ఉద్యోగాల కల్పనకు ప్రణాళిక
- 27 పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కార్యాచరణ
- ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఔషధ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం
- కొరియా సంస్థలతో భాగస్వామ్యాన్ని విస్తరిస్తాం
- కె హార్మనీ ఫెస్టా కొరియా సాంస్కృతిక దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ(జనంసాక్షి): కొరియా సంస్థల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, యువత నైపుణ్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆధునిక తయారీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో కొరియా సంస్థలతో కలిసి పనిచేసేందుకు తెలంగాణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆదివారం నిర్వహించిన కె హార్మనీ ఫెస్టాకొరియా కల్చర్ డే 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. 2024 ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణ కొరియాలో చేపట్టిన పర్యటన సందర్భంగా జరిగిన పెట్టుబడుల చర్చలు రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక భాగస్వామ్యానికి పునాది వేశాయని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ఈ భాగస్వామ్యాన్ని

మిగతా 2లో..



'ఆపరేషన్ సిందూర్'తో..
## మన సైనిక శక్తిని ప్రపంచదేశాలకు చాటిచెప్పాం

- పాక్‌లోని ఉగ్రస్థావరాలపై కచ్చితమైన దాడులు ఈ విషయాన్ని నిరూపించాయి
- భారత బలగాలకు అందని లక్ష్యమంటూ ఏదీలేదు: ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్

2లో..

# ముంచుకొస్తున్న అర్నబ్

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం
- ఏపీలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

విశాఖపట్నం(జనంసాక్షి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం సోమవారం తూర్పు, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశముందని తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ మూర్తి తెలిపారు. ఈనెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా, 28 ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెంది అదే రోజు మధ్యాహ్నానికి బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 140 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. ఈ తుపానుకు బంగ్లాదేశ్ సూచించిన 'అర్నబ్' పేరు పెట్టిన విషయం తెలిసిందే. తుపాను దృష్ట్యా ఈ నెల 27న ఏపీలోని కాకినాడ, కోనసీమ, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, గుంటూరు, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చారు. కడప, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, అనంతపురం జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు

మిగతా 2లో..



## రాష్ట్రానికి తుపాను హెచ్చరికలు!
రానున్న మూడు రోజుల పాటు వానలు

2లో..

## మాతో చర్చలు జరిపేందుకు ఇరాన్‌లో
# నాయకులే లేరు

- మా దాడుల్లో వారి అగ్రనాయకత్వమంతా తుడిచిపెట్టుకుపోయింది
- కనీసం మాతో సంప్రదింపులు జరపడానికి కూడా ఎవరూ దొరకడం లేదు.. ట్రంప్ కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్‌పై మరోసారి సైనిక చర్య చేపడతామని గత కొన్నాళ్లుగా చెప్పుకొస్తున్న డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా దాడుల్లో ఆ దేశానికి చెందిన అగ్రనాయకత్వమంతా తుడిచిపెట్టుకుపోయిందని, కనీసం చర్చలు జరపడానికి కూడా ఎవరూ దొరకడం లేదని వ్యాఖ్యానించారు. మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ర్యాలీలో ఇరాన్‌పై విమర్శలు గుప్పించారు. " వారి దగ్గర యుద్ధ విమానాల్లేవ్.. యుద్ధ నౌకల్లేవ్.. నాయకులు లేరు. అసలు వారి దగ్గర ఏమీ లేదు. అగ్రశ్రేణి నాయకులు పోయారు. ద్వితీయ శ్రేణి నాయకులూ పోయారు.

మిగతా 2లో..



అమెరికా దుందుడుకు చర్యలను
## నిశితంగా గమనిస్తున్నాం
యుద్ధం జరిగినా..

పాత ఫలితమే పునరావృతమవుతుంది : ఇరాన్

2లో..



పొట్టకూటి కోసం ఊరుకాని ఊరొచ్చి..
## నీటికుంటలో పడి ముగ్గురి మృతి
మంచిర్యాల జిల్లాలో విషాదం..

జలమండలి అధికారి కారులో
## అక్రమ నగదు పట్టివేత
స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు

## హెచ్ఎండీఏ భూములకు మరోసారి ఈ-వేలం
కోకాపేటలో ఎకరం ఏరూ.120 కోట్లుగా నిర్ణయం

వివరాలు లోపలి పేజీల్లో..

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
26.10.2026

# ఆర్థిక వ్యవస్థలపై దాడులే ఆధునిక యుద్ధాలు

ద్వారా కూడా ఆ దేశాన్ని బలహీనపరచవచ్చు. భారత్ ఆర్థికంగా బలపడుతున్న తరుణంలో, మన బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ నేరస్థులు, సైబర్ ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవడం కూడా అంతే ముఖ్యం. నేడు, సైబర్ ముప్పుల రూపురేఖలు నిరంతరం మారుతున్నాయి. పాతబడిన వ్యవస్థలు, పాత శిక్షణా పద్ధతులు లేదా కాలం చెల్లిన సాధనాలతో ఈ కొత్త సవాళ్లను మనం ఎదుర్కోలేం. మనకు ఆధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఇక్కడే ఈ కొత్త సైబర్ సెక్యూరిటీ సంస్థ కీలక పాత్ర పోషించనుంది' అని ప్రధాని మోదీ అన్నారు.

# 'వోకల్ ఫర్ లోకల్'ను బలోపేతం చేయండి

- ప్రజల సహకారంతో మన్‌కీ బాత్ అప్రతిహతంగా కొనసాగుతోంది
- 139వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ ప్రసంగం



న్యూఢిల్లీ(జనంసాక్షి):పన్నెండేళ్ల క్రితం విజయదశమి నాడు మొదలుపెట్టిన 'మన్‌కీబాత్' ప్రజల సహకారంతో అప్రతిహతంగా కొనసాగుతోందని ప్రధాని మోదీ అన్నారు. 139వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో ఆయన ప్రసంగించారు. పంజాబ్ సంప్రదాయ వ్యవసాయం, ఉత్తరాఖండ్ మహిళల సాధికారత వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. మన్‌కీబాత్ ప్రారంభం నాటి విషయాలను ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. "12 ఏళ్ల క్రితం విజయదశమి నాడు మొదలైన ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. ప్రజలు ఈ ప్రయాణంలో భాగస్వాములు, మార్గదర్శులుగా మారారు. ప్రజల కఠిన శ్రమ, ధైర్యం, అంకితభావం, సేవా దృక్పథాన్ని కొనియాడేందుకు ఇది ఒక అద్భుతమైన అవకాశం. తీర్థయాత్రలు ఎలానో.. నాకు మన్‌కీ బాత్ అలానే ఉంటుంది. పంజాబ్‌లో చేపట్టిన ఖేతీ విరాసత్ మిషన్ స్ఫూర్తిమంతంగా ఉంది. ఆర్గానిక్, సంప్రదాయ సాగుకు పునరుజ్జీవం కల్పించేందుకు ఇది పనిచేస్తోంది. పంజాబ్ మాల్వా ప్రాంతంలో పత్తి సాగును ఈ బృందం ప్రోత్సహిస్తోంది. ఇక ఉత్తరాఖండ్ గఢ్‌వాల్ ప్రాంతంలో ప్రజలు హెవల్ నదికి ఊపిరిల్లూదారు. కొన్నాళ్ల క్రితం వరకు ఇందులో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో స్థానిక యంత్రాంగం, గ్రామస్థులు వర్షపునీటిని ఒడిసిపట్టేందుకు చర్యలు తీసుకొన్నారు. భారీ సంఖ్యలో మొక్కలను నాటారు. ఈ చర్యల ఫలితంగా నేడు నది తిరిగి కళకళలాడుతోంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ముంచుకొస్తున్న 'అర్నబ్'

జారీ చేశారు. 28వ తేదీన కూడా పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.

**తీవ్ర వాయుగుండంగా మారిన 'అర్నబ్'**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం స్థిరంగా కదులుతోంది. ప్రస్తుతం విశాఖకు 880 కి.మీ, కాకినాడకు 980 కి.మీ, మచిలీపట్నానికి 1,080 కి.మీ, బాపట్లకు 1,150 కి.మీ దూరంలో ఇది కేంద్రీకృతమైంది. గంటకు 5 కి.మీ వేగంతో ముందుకు కదులుతోందని వాతావరణశాఖ (ఎఓఆ) తెలిపింది. తీవ్ర వాయుగుండం.. సోమవారానికి తుపానుగా బలపడుతుందని వెల్లడించింది. ఈనెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా, 28 ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెంది అదే రోజు మధ్యాహ్నానికి బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 140 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ తుపానుకు బంగ్లాదేశ్ సూచించిన 'అర్నబ్' పేరు పెట్టిన విషయం తెలిసిందే.

# రాష్ట్రానికి తుపాను హెచ్చరికలు

**రానున్న మూడు రోజుల పాటు వానలు**

**హైదరాబాద్(జనంసాక్షి):**ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో 27 నుంచి 29 వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఎల్‌నినో ప్రభావం కారణంగా అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోతతో సతమతమవుతున్న సందర్భంలో వాతావరణ శాఖ చల్లని కబురందించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కొద్దిరోజుల్లో తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఈ నెల 28 నాటికి వాయుగుండం తుపానుగా మారి ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోకి చేరుకుంటుందని, ఈ ప్రభావంతో రాష్ట్రంలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. దీంతో ఈ మూడు జిల్లాలకు ఎరుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ తుపాను ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 27 నుంచి 29 వరకు చాలా జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఎల్‌నినోతో కొద్ది రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కాగా, ప్రస్తుతం వాతావరణంలో కొద్దికొద్దిగా మార్పు వస్తోంది. శుక్రవారం నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతూ వస్తున్నాయి. పలు జిల్లాల్లో చలిగాలులు వీస్తున్నాయి. వేకువజామున మంచు దుప్పటి పరచుకుంటోంది. ఈ జిల్లాల్లో అతి భారీ వర్షాలుఇవాళ ఉమ్మడి ఖమ్మం, ములుగు, మహబూబ్‌బాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే భూపాలపల్లి, వరంగల్, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అతి భారీగా వానలు పడొచ్చని తెలిపింది.

# ఓటు ఉంటేనే ప్రజాస్వామ్యం.. రక్షణకు పోరాటం

కూడా ఇదే ఉత్సాహాన్ని, అంకితభావాన్ని కొనసాగించాలని కోరారు. అదే సమయంలో ఈ నిరసనలో పాల్గొనాలని విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, వ్యాపారులకు పిలుపునిచ్చారు.'దేశ ప్రజల ఓట్లను దొంగిలిస్తున్నారు, ఈ అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోము. మౌనంగా ఉండబోము. ఓటర్ల జాబితా నుంచి కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించి, నియమ నిబంధనలను ఉల్లంఘించారు. ప్రశ్నలు అడిగిన వారిపై లాఠీలు ప్రయోగించారు. వాటన్నిటికీ ఇప్పుడు దేశం ప్రతిస్పందిస్తోంది. అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ముందుకు రండి. ఎందుకంటే ఓటు మీదే..పోరాటం కూడా మీదే' అని రాహుల్ సోషల్ మీడియా పోస్టులో ప్రజలకు పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా.. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నిర్వహించనున్న ర్యాలీలో అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు పాల్గొనాలని పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 30నుంచి నవంబర్ 1వరకు (మూడు రోజులు) దిల్లీలోనే ఉండాలని పార్టీ ఎంపీలకు సూచించారు. నవంబర్ 1న దేశరాజధానిలో నిర్వహించనున్న ర్యాలీలో దాదాపునవంబర్ 1న దేశరాజధానిలో నిర్వహించనున్న ర్యాలీలో దాదాపు 10లక్షల మంది పాల్గొనే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎటువంటి అల్లర్లు చోటుచేసుకోకుండా ఉండేందుకు కేంద్రం దిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. దేశ రాజధానిలో శాంతి భద్రతలను పర్యవేక్షించేందుకు శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిల్లీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించారు.

**మూడు రోజులపాటు దిల్లీలోనే ఎంపీలు**

ఇదిలా ఉండగా, ర్యాలీ నేపథ్యంలో పార్టీ ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక సూచనలు చేశారు. అక్టోబర్ 30,31, నవంబర్ 1 తేదీల్లో ఎంపీలంతా దిల్లీలో అందుబాటులో ఉండాలని కోరారు. ఓట్ల చోరీ ఆరోపణలు, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ఎంపీలు పాల్గొనేలా కాంగ్రెస్ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల అక్రమాలు, ఓట్ల తొలగింపును నిరసిస్తూ అక్టోబర్ 30న దిల్లీలోని అశోక్ హోటల్ వేదికగా విపక్షాలు మాక్ పార్లమెంట్ నిర్వహించనున్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అఇఅ తీరును ఎండగడుతూ ప్రతీకాత్మకంగా ఆయనపై ఈ వేదికగా ప్రజా అభిశంసన చేపట్టనున్నారు. ఇండియా కూటమికి చెందిన ఎంపీలు, అగ్రనేతలంతా హాజరయ్యే ఈ సమావేశంలో అఇఅకి వ్యతిరేకంగా ఒక బహిరంగ ప్రజా తీర్పును కూడా వెల్లడించనున్నారు. ఈ మాక్ పార్లమెంట్ ముగిసిన అనంతరం నవంబర్ 1న ఓట్ చోరీకి వ్యతిరేకంగా పదిలక్షల మందితో రాంలీలా మైదానానికి దిల్లీ చలో మార్చ్ నిర్వహించాలని కాంగ్రెస్ తలపెట్టింది.

# ఎల్‌నినోపై అఖిలపక్షం

అధికారంలో ఉన్న పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా తెలంగాణకు వివక్ష లేకుండా సహాయ సహకారాలు అందిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన మద్దతు లభించేలా బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

# ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ పోరులో సింధుకు నిరాశ

పారిస్(జనంసాక్షి): ఫ్రెంచ్ ఓపెన్ మహిళల బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్‌లో భారత్ స్టార్ షట్లర్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. టైటిల్ పోరులో ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సె యంగ్ (కొరియా) చేతిలో పరాజయం పాలైంది. తొలి గేమ్‌ను 21-16 తేడాతో సింధు కైవసం చేసుకోగా.. తర్వాతి గేమ్‌ను ఆన్ సె యంగ్.. 21-11తో దక్కించుకుంది. దీంతో మూడో గేమ్‌పై ఉత్కంఠ ఏర్పడింది. అందుకు తగ్గట్టే ఆట హోరాహోరీగా సాగినప్పటికీ.. చివరికి 21-12 తేడాతో ఆన్ సె యంగ్ గెలుపొంది.. గేమ్‌తోపాటు టైటిల్‌ను దక్కించుకుంది. ఆన్ సె యంగ్ ఫ్రెంచ్ ఓపెన్ టైటిట్ దక్కించుకోవడం వరుసగా ఇది మూడోసారి. మరోవైపు, ఇప్పటిదాకా వీరిద్దరూ 11 సార్లు పోటీపడగా.. అన్ని సార్లూ సింధు ఓడిపోవడం గమనార్హం.

# గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలి'



ప్రభుత్వాలను ఏర్పాటు చేశారని, ఈ దొంగలందరినీ జైలుకు పంపిస్తామని అన్నారు. ప్రజలు వీధుల్లోకి వచ్చి, తమ హక్కుల కోసం పోరాడాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం నుంచి ప్రజలకు పారదర్శకత, జవాబుదారీతనం కావాలని పేర్కొన్నారు. బిహార్ తొలి ముఖ్యమంత్రి డాక్టర్ శ్రీ కృష్ణ సింగ్ 139వ జయంతి ఉత్సవాల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీల భావజాలం దేశంలో విభజనలను మరింత తీవ్రతరం చేస్తోందని ఖర్గే ఆరోపించారు. ఖీూ సిద్ధాంతాన్ని నిర్మూలించే వరకు దేశంలో శాంతి ఉండదని వ్యాఖ్యానించారు. నీతీష్ కుమార్ వంటి సోషలిస్ట్ నాయకులు, ఖీూ సిద్ధాంతాన్ని నమ్మే వ్యక్తులతో చేతులు కలపడం నాకు బాధ కలిగిస్తోందన్నారు. "నేడు మనం ఆర్ఎస్ఎస్ గురించి మాట్లాడితే ప్రజలు దానిని భిన్నంగా అర్థం చేసుకోవచ్చు. ఈ దేశంలో ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నంత కాలం, శాంతి ఉండదు. మేము ఐక్యత, సమానత్వం, రాజ్యాంగాన్ని విశ్వసించే దేశభక్తులం. బీజేపీ నాయకుల్లా రాజకీయ లబ్ధి కోసం మన ప్రజలను విభజించేవాళ్లం కాదు." అని అన్నారు. హల్ద్వానీ 'శుద్ధీకరణ' చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖర్గే డిమాండ్ చేశారు. కుల వివక్ష, వెలివేత వంటివి మానవ గౌరవాన్ని, సమానత్వాన్ని దెబ్బతీస్తాయని ఆయన అన్నారు. దేశంలోని ప్రతి ఆలయంలోకి దళితులు ప్రవేశించేందుకు, అక్కడ పూజలు చేసుకునేందుకు వారికి పూర్తి హక్కు ఉండాలని కాంగ్రెస్ అధ్యక్షుడు స్పష్టం చేశారు. "మా పోరాటం మతానికి వ్యతిరేకం కాదు. మతం పేరుతో జరిగే వివక్షకు వ్యతిరేకం. నా మతం పట్ల నాకు గర్వం ఉంది. నా పేరు కూడా ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకదాని నుంచి ప్రేరణ పొందిందే. మతం ప్రజలను ఏకం చేయాలి, విభజించకూడదు." అని అన్నారు. అయోధ్యలోని రామమందిరానికి అందిన విరాళాల వివాదంపై బీజేపీని లక్ష్యంగా చేసుకున్నారు ఖర్గే. రాముడు తన కళ్లు తెరిచి, తన పేరుతో సంపదను దోచుకున్న వారికి తగిన శిక్ష విధించాలని ఆయనను ప్రార్థిస్తున్నానని అన్నారు.

# హెచ్‌ఎండీఏ భూములకు మరోసారి ఈ-వేలం

**కోకాపేటలో ఎకరం ఏరూ.120 కోట్లుగా నిర్ణయం**

**హైదరాబాద్(జనంసాక్షి):**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని భూములను మరోసారి ఈ-వేలం వేసేందుకు ప్రభుత్వం శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా కోకాపేటలో మరోసారి రికార్డు ధరను ప్రకటించింది. ఈ ప్రాంతంలో నియోపొలిస్ లే అవుట్‌లోని సర్వే నంబర్ 239, 240లోని 4.59 ఎకరాలను విక్రయించడానికి మరోసారి ముందుకొచ్చింది. ఇక్కడ ఎకరా కనీస ధరను రూ.120 కోట్లుగా ప్రకటించింది. గతంలో ఈ భూమి ఈ-వేలం ద్వారా విక్రయానికి పెట్టినా కూడా కేవలం సింగిల్ బిడ్ రావడంతో తిరస్కరించి మళ్లీ ఈ-వేలానికి వెళ్లింది. అలాగే మూసాపేటలోని 3.15 ఎకరాలను అమ్మకం చేయనుంది. ఇక్కడ ఎకరా కనీస ధర రూ.99 కోట్లుగా నిర్ణయించింది.

# 'సర్' లోపాలు బయటపడతాయనే 'ఈసీఐనెట్' సమాచారాన్ని ఈసీ దాస్తోంది

న్యూఢిల్లీ(జనంసాక్షి):వివాదాస్పద 'ఈసీఐనెట్' సాఫ్ట్‌వేర్ వివరాలను ఎన్నికల సంఘం దాస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. సర్ ప్రక్రియలో అవకతవకలు బయటపడతాయనే భయంతోనే ఈ సమాచారాన్ని ఇచ్చేందుకు ఈసీ పదేపదే నిరాకరిస్తోందని విమర్శిం చింది. ఈ మేరకు ఒక మీడియా కథనాన్ని కాంగ్రెస్ ప్ర ధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సర్ ప్రక్రియలో ఓటర్ల జాబితాలో తప్పులు, అవకతవకలను గుర్తించడానికి ఉపయోగించిన సాఫ్ట్‌వేర్ పేరు, దాని వెర్షన్‌ను వెల్లడించడానికి ఈసీ నిరాకరించిందని ఆ కథనం పేర్కొంది. ఈ సమాచారం వాణిజ్యపరమైన గోప్యత, వ్యాపార రహస్యాలు, మేధో సంపత్తికి సంబంధించినదని సమాచార హక్కు చట్టం కింద దీనికి మినహాయింపు ఉందని ఈసీ తెలిపింది. ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్, వినియోగంపై పారదర్శకత లేకపోవడం వల్ల ప్రజల్లో మొత్తం సర్ ప్రక్రియపై నమ్మకం సన్నగిల్లిందని జైరాం రమేశ్ అన్నారు. సర్‌లో స్పష్టంగా ఏ.ఐ.ని ఉపయోగిస్తున్నప్పుడు దాని వాడకాన్ని ఈసీ ఎందుకు పదేపదే ఖండించిందని రమేశ్ నిలదీశారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి లేవనెత్తిన పలు అభ్యంతరాలకు ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్, ఈసీ ఐటీ విభాగమే కేంద్ర బిందువులని రమేశ్? ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలిగించాలని, అలాగే ఎస్ఐఆర్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్‌ను పునరుద్ఘాటించింది.

# మన సైనిక శక్తిని ప్రపంచదేశాలకు చాటిచెప్పాం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

భారత బలగాలకు అందని లక్ష్యమంటూ ఏదీ లేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ పేర్కొన్నారు. గతేడాది పాక్‌లోని ఉగ్రస్థావరాలపై 'ఆపరే షన్ సిందూర్' పేరుతో భారత్ చేపట్టిన కచ్చితమైన దాడులు ఈ విషయాన్ని నిరూపించాయన్నారు. ఆ సమ యంలో వాయుసేన వ్యూహాత్మకంగా ముందడుగు వేసి, ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ కొట్టిందని పేర్కొన్నారు. ప్రస్తుతం సైన్యం వద్ద ఉన్న అణ్వాయుధాలు, కచ్చితత్వంతో ఛేదించగల అధునాతన క్షిపణి వ్యవస్థలు శత్రువుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నాయన్నారు. ఆ ఆపరేషన్‌లో స్వదేశీ ఆయుధాల శక్తిని ప్రపంచ దేశాలు చూశాయని పునరుద్ఘాటించారు. స్వదేశీ ఉత్పత్తుల తయారీ.. రక్షణ రంగం ఆధునికీకరణకే కాకుండా దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి సైతం బాటలు వేస్తోందన్నారు. అక్టోబరు 31న పదవీ విరమణ చేయనున్న ఏపీ సింగ్.. పీటీఐతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దేశాల్లో అస్థిరత కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. దేశ భద్రతను సుస్థిరం చేసేందుకు ఇండో పసిఫిక్ (ఎనిటనీ-ఖజీఇతిటతిఇ) ప్రాంతంలో మన శక్తి సామర్థ్యాల ప్రదర్శన ఎంతో ముఖ్యమని ఐఏఎఫ్ చీఫ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. 'జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకు, ఇండో-పసిఫిక్‌లో నెలకొన్న పరిస్థితిని వైమానిక దళం నిశితంగా పర్యవేక్షిస్తోంది. దేశ భద్రతను కాపాడటానికి ఐఏఎఫ్ ఎప్పుడూ సిద్ధంగా ఉంది. మరింత సంక్లిష్టమైన విన్యాసాలు, కార్యాచరణల ద్వారా మిత్రదేశాల వైమానిక దళాలతో పరస్పర సహకారాన్ని బలోపేతం చేస్తున్నాం. ఇండో-పసిఫిక్‌లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించడానికి అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కూడిన క్వాడ్ సభ్య దేశాలతో కలిసి భారత్ పనిచేస్తోంది. ఆస్ట్రేలియా, మలేషియా, థాయ్‌లాండ్‌లకు ఇటీవల ఐఏఎఫ్ పంపిన దళాలు సుదూర కార్యకలాపాలు, సముద్ర వైమానిక కార్యకలాపాలలో విలువైన అనుభవాన్ని అందించాయి'

# కొరియా పెట్టుబడులకు తెలంగాణలో విస్తృత అవకాశాలు

మరింత ముందుకు తీసుకెళ్లి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొరియా ఆర్థిక ప్రగతి నుంచి తెలంగాణ నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని, విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సాంకేతికతపై నిరంతర పెట్టుబడులు అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు.??పరిశ్రమలతో పాటు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, చిన్న పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. పర్యాటక రంగంలోనూ కొరియా పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025?2030 ద్వారా రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, అదనంగా మూడు లక్షల ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. పర్యాటక మౌలిక సదుపాయాలు, ఆతిథ్య రంగం, చలనచిత్ర పర్యాటకం, వెల్‌నెస్ టూరిజం, సాంస్కృతిక అనుభవాల అభివృద్ధిలో కొరియా సంస్థల భాగస్వామ్యాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. భారత్ కొరియా మధ్య సాంస్కృతిక బంధం కొరియా సంస్కృతి, కళలు, సంగీతం, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుక రెండు దేశాల ప్రజల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. యుద్ధం, పేదరికం వంటి సవాళ్లను అధిగమించి కొరియా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని కొనియాడారు. సాంకేతికత, తయారీ, విద్య, ఆవిష్కరణల్లో ఆ దేశం సాధించిన విజయాలు ప్రశంసనీయమన్నారు. కొరియన్ సంగీతం, సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా యువతను ఆకర్షిస్తున్నాయని, సాంస్కృతిక ప్రభావం కూడా ఒక దేశ అంతర్జాతీయ గుర్తింపును పెంపొందిస్తుందని పేర్కొన్నారు. భారత్, కొరియా ప్రజల మధ్య విద్య, కుటుంబ వ్యవస్థ, సంప్రదాయాలు, పెద్దల పట్ల గౌరవం వంటి అంశాల్లో సారూప్యతలు ఉన్నాయని తెలిపారు. ప్రాచీన భారతదేశం నుంచి కొరియాకు వెళ్లినట్లు విశ్వసించే రాణి హియో హ్వాంగ్-ఓక్ గాథ రెండు దేశాల మధ్య చారిత్రక స్నేహానికి ప్రతీకగా నిలిచిందన్నారు. తెలంగాణ వారసత్వానికి అంతర్జాతీయ గుర్తింపు విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాల కలయికకు హైదరాబాద్ శతాబ్దాలుగా కేంద్రంగా నిలిచిందని చెప్పారు. బతుకమ్మ, బోనాలు, తెలుగు సాంస్కృతిక వారసత్వం, చారిత్రక కట్టడాలు తెలంగాణ ప్రత్యేకతలని వివరించారు. వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం సహా రాష్ట్రంలో అనేక పర్యాటక ఆకర్షణలు ఉన్నాయని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం వంటి బౌద్ధ వారసత్వ ప్రదేశాలు భారత్, తూర్పు ఆసియా దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయగలవని అన్నారు. కొరియా పర్యాటకులు తెలంగాణను సందర్శించాలని, ఇరు ప్రాంతాల యువత చదువు, పరిశోధన, ఉద్యోగాలు, సృజనాత్మక రంగాల్లో పరస్పరం అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య ఒప్పందాలు ముఖ్యమైనప్పటికీ, ప్రజల మధ్య ఆప్యాయత, పరస్పర అవగాహనే సంబంధాలకు శాశ్వత పునాది అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ కొరియా మిత్రులకు మరో ఇల్లు వంటిదని అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు భారతదేశంలోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా రాయబారి హెచ్.ఈ. లీ సియుంగ్-హో స్వాగతం పలికారు.

# చర్చలు జరిపేందుకు ఇరాన్‌లో నాయకులేలేరు

ఇక కనీసం చర్చలు జరపాలన్నా ఎవరూ దొరకడం లేదు. చర్చలు జరపడానికి ఎవరో ఒకరు కావాలి కదా. అందుకే దాడులు ఆపేశా. శాంతి ఒప్పందానికి అంగీకరించకపోతే మాత్రం ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు" అని ట్రంప్ హెచ్చరించారు. అమెరికాతో యుద్ధం మొదలైన తొలినాళ్లలోనే ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ సహా.. ప్రముఖ రాజకీయ, మిలిటరీ నేతలు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సుప్రీం లీడర్‌గా ఎన్నికైన మొజ్తబా ఖమేనీ కూడా తీవ్రంగా గాయపడినట్లు వార్తలు వచ్చాయి. ఆయన పేరిట ప్రకటనలు వస్తున్నా.. ఇప్పటి వరకు ఆయన బాహ్య ప్రపంచంలో కనిపించడం లేదు. తాత్కాలిక ఒప్పందం పేరిట అమె రికా, ఇరాన్‌లు దాడులు నిలిపివేసినా.. హర్మూజ్ కేంద్రంగా.. అడపాదడపా కాల్పులు చోటు చేసుకుం టూనే ఉన్నాయి. అమెరికాలో నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఈ లోగా ఒప్పందం కుదరకపోతే.. అమెరికా మరోసారి దాడులు చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అమెరికా ఎయిర్ ఫోర్స్, నేవీ దళాలు పశ్చిమాసియా వైపు కదులుతుం డటం గల్ఫ్ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది.

# అమెరికా దుందుడుకు చర్యలను నిశితంగా గమనిస్తున్నాం

**టెహ్రాన్(జనంసాక్షి):**

అమెరికా దుందుడుకు చర్యలను నిశితంగా గమనిస్తున్నట్లు ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. మరోసారి యుద్ధం మొదలైనా తమ దేశ వైఖరి మారబోదని ఆదివారం స్పష్టం చేశారు. "ఇటీవల కొత్త యుద్ధం గురించి చర్చ జరుగుతోంది. యుద్ధం వచ్చినా.. రాకపోయినా.. మా విధానాలు మారవు. ఇప్పటికే రెండుసార్లు యుద్ధం చేశారు. ఫలితం ఎలా ఉందో చూశారు. మరోసారి ప్రయత్నించాలనుకుంటే.. గతంలో వచ్చిన ఫలితాలే పునరావృతమవుతాయి. ఆ విషయం వాళ్లకు (అమెరికా)కు కూడా తెలుసు." అని ఓ అంతర్జాతీయ మీడియాతో అరాగ్చీ వ్యాఖ్యానించారు. హర్మూజ్‌లో గత కొన్నాళ్లుగా చోటు చేసుకుంటున్న ఘర్షణలు రవాణా స్వరూపాన్నే మార్చివేశాయని అయన అన్నారు. హర్మూజ్ నౌకా మార్గం ఇకపై మునుపటిలా ఉండబోదని, దాని నిర్వహణ తీరు కూడా మారుతుందన్నారు.

# సన్నబియ్యం అక్రమాలపై సీఐడీ కొరడా

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన సన్నలు రకం ధాన్యాన్ని, మిల్లింగ్ కోసం తీసుకున్న కొందరు మిల్లర్లు, ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముకున్నట్లు అధికారుల దర్యాప్తులో గుర్తించారు. ఆ స్థానంలో బయటి రాష్ట్రాల నుంచి తెప్పించిన నాసిరకం, చౌకైన దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పంపి మోసానికి పాల్పడ్డారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ టాస్క్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో నిర్వహించిన తనిఖీల్లో, ఈ అక్రమాలు వెలుగుచూశాయి. మిల్లుల నుంచి సేకరించిన శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించగా అవి సన్న రకం బియ్యం కాదని తేలినట్లు అధికారులు స్పష్టం చేశారు.

**మూడు జిల్లాలో 14 మంది అరెస్టు**

నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులు సన్న రకం కేటాయింపులకు బదులుగా 3,385.820 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని అప్పగించారని దర్యాప్తులో అధికారులు వెల్లడించారు. దీనివల్ల బోనస్ రూపంలోనే ప్రభుత్వానికి రూ.1.69 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తేల్చారు. మరో 45,414 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మళ్లించేందుకు కుట్ర పన్నగా, పౌర సరఫరాల శాఖ అధికారులు సకాలంలో స్పందించి సరఫరాలను నిలిపివేశారు. దీంతో రూ.242 కోట్ల బోనస్ సొమ్ము దుర్వినియోగం కాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ధాన్యం అక్రమ మళ్లింపు, నమ్మకద్రోహం, కుట్రపూరితంగా ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టడం, వంటి తీవ్రమైన ఆరోపణల ఆధారంగా సీఐడీ అధికారులు రంగంలోకి దిగి మొత్తంగా 14 మందిని అరెస్టు చేశారు. ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్?ను జాకారం జాతీయ రహదారిపై సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్‌లోని జమ్మికుంట సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించి, బియ్యం మళ్లింపు వ్యవహారంలో ముగ్గురు కీలక మిల్లర్లను అరెస్ట్ చేశారు. హుజూరాబాద్ వరలక్ష్మి రైస్ మిల్ యజమానిని అదుపులోకి తీసుకున్నారు.

**సివిల్ సప్లైస్ అధికారుల పాత్రపై ఆరా**

ప్రభుత్వాన్నికి బకాయిలు చెల్లించని డిఫాల్టర్ మిల్లర్ల మిల్లులు, యంత్రాలు, రవాణా వాహనాలు, వ్యక్తిగత ఆస్తులను జప్తు చేసేందుకు చట్టపరమైన ప్రక్రియ ప్రారంభించారు. అక్రమార్కుల బ్యాంకు ఖాతాలను నిలిపివేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గడిచిన పదేళ్లకుపైగా జరిగిన సీఎంఆర్ లావాదేవీలపై సమగ్ర ఆడిట్‌కు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ధాన్యం కేటాయింపులు, కన్వర్షన్ అనుమతుల్లో సివిల్ సప్లైస్ అధికారుల పాత్ర ఉందా అనే కోణంలో సీఐడీ ఆధారాలు సేకరిస్తోంది.

# ఆరు నెలల్లో 23 మరణశిక్షలు..! జడ్జి బదిలీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

ఆరు నెలల వ్యవధిలోనే పలు కేసుల్లో 23 మందికి మరణశిక్ష విధిస్తూ ఓ న్యాయమూర్తి ఇచ్చిన తీర్పులు ఇటీవల చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. తాజాగా ఆ న్యాయమూర్తిని అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు ముజఫర్‌నగర్‌లోని ఫ్యామిలీ కోర్టుకు బదిలీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఫాస్ట్-ట్రాక్ కోర్టులో ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన పదవీకాలంలో హై ప్రొఫైల్ తీర్పులు వెలువడడం, తన కోర్టులో పెండింగులో ఉన్న కేసుల ఉపసంహరణలపై ప్రశ్నలు లేవనెత్తిన సమయంలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ముజఫర్‌నగర్ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తిగా ఉన్న రవి కుమార్ దివాకర్.. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య కాలంలో 11 కేసులకు సంబంధించి 23 మందికి మరణశిక్ష విధించి సంచలనం సృష్టించారు. బరేలీలో పనిచేసిన సమయంలోనూ 13 మరణశిక్షలు విధిస్తూ తీర్పు వెలువరించారు. అయితే, హత్య, తీవ్ర నేరాలకు సంబంధించి విచారణ ప్రక్రియలో ఉన్న 97 కేసులను (ఓ న్యాయమూర్తి ఆదేశాల మేరకు) తన కోర్టు నుంచి ఉపసంహరించుకోవడాన్ని జడ్జీ దివాకర్ తప్పుపట్టారు. పదేళ్లనాటి కేసులో ఓ నిందితుడిని నిర్దోషిగా ప్రకటించిన ఆయన.. విచారణలు ప్రారంభమైన కేసులను, చట్ట ప్రకారం నిబంధనలు పాటించకుండా పరిపాలనా ఉత్తర్వుల ద్వారా ఉపసంహరించుకోవచ్చా? అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆయన బదిలీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఓఆర్‌ఆర్‌పై ఘోర ప్రమాదం..

**కొల్లూరు సమీపంలో జరిగిన దుర్ఘటనలో ఇద్దరి మృతి**

**కొల్లూరు(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కొల్లూరు వద్ద బాహ్య వలయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొల్లూరు సమీపంలో ఓఆర్ఆర్ డివైడర్‌పై ఉన్న మొక్కలకు సీఎంసీ కార్మికుడు శ్రీనివాస్ అలియాస్ వీరు నీళ్లు పోస్తున్నారు. అదే సమయంలో పటాన్‌చెరు వైపు నుంచి వస్తున్న ఆటో ట్రాలీ అతివేగంగా శ్రీనివాస్‌ను ఢీ కొంది. అనంతరం వాటర్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో సీఎంసీ కార్మికుడు శ్రీనివాస్‌తో పాటు, ఆటో ట్రాలీ డ్రైవర్ శ్రీనాథ్ కూడా అక్కడికక్కడే మృతి చెందారు. కొల్లూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సింగరేణి బలోపేతానికి సమగ్ర ప్రణాళిక

- ఉత్పత్తి వ్యయం తగ్గించాలి.. కీలక ఖనిజాల రంగంలోకి విస్తరించాలి
- జనరల్ మేనేజర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిశానిర్దేశం




హైదరాబాద్ (జనంసాక్షి) : సింగరేణి కాలరీస్ సంస్థను బలోపేతం చేసి, భవిష్యత్తు తరాలకు ఉపాధి భద్రత కల్పించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించడం, ఉత్పాదకత పెంచడం, కొత్త గనులను అభివృద్ధి చేయడంతోపాటు కీలక ఖనిజాల అన్వేషణలోకి విస్తరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆదివారం సింగరేణి కాలరీస్‌కు చెందిన 66 మంది జనరల్ మేనేజర్లతో నిర్వహించిన ప్రత్యక్ష ఇంటరాక్షన్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంస్థ పనితీరు, బొగ్గు ఉత్పత్తి, రవాణా, కొత్త గనుల అభివృద్ధి, భవిష్యత్తు విస్తరణ, ఉత్పత్తి వ్యయ నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంస్థ సాధించిన ప్రగతిని అధికారులు వివరించగా, జనరల్ మేనేజర్ల విధులు, బాధ్యతలు, క్షేత్రస్థాయి పనితీరుపై భట్టి విక్రమార్క ఆరా తీశారు. పదేళ్లపాటు సింగరేణి విస్తరణను పట్టించుకోకుండా, కొత్త బొగ్గు బ్లాకులు అందకుండా చేసి సంస్థను నిర్వీర్యం చేయాలని చూసినవారే.. ఇప్పుడు సింగరేణికి నష్టం జరుగుతోందంటూ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గుతోందని, 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని, సంస్థకు భవిష్యత్తు లేదని ప్రచారం చేస్తున్నవారు గతంలో ఏం చేశారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సంస్థను బలహీనపరిచే నిర్ణయాలు తీసుకున్నవారే ఇప్పుడు విమర్శలకు దిగడం వెనుక ఉద్దేశమేంటని నిలదీశారు. సింగరేణిని కాపాడేందుకు తమ ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసి, కొత్త గనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. పదేళ్లలో సంస్థ అభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకోలేదని, విస్తరణకు బదులుగా సంస్థ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. సుమారు 42 వేల మంది శాశ్వత ఉద్యోగులు, మరో 34 వేల నుంచి 36 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆధారపడిన సింగరేణిని కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. ఇప్పటికే కేటాయించిన బ్లాకులను సింగరేణి వినియోగించుకునేలా తన వాదనను వివరించానని చెప్పారు. తెలంగాణ, సింగరేణి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుందని పేర్కొన్నారు.

# నెక్కొండలో గంజాయి కలకలం

- 12 కేజీల గంజాయి పట్టివేత



**నెక్కొండ అక్టోబర్ 25 (జనం సాక్షి):** నెక్కొండ మండల కేంద్రంలోని ఎస్సై శ్రావణ్ కుమార్, పోలీస్ సిబ్బందితో నెక్కొండలో పెట్రోలింగ్ చేస్తుండగా బస్టాండ్ దగ్గర ఒక వ్యక్తి అనుమానాస్పదంగా ఉండి పోలీసు వారిని చూసి పారిపోవుటకు ప్రయత్నించుగా సిబ్బంది, అతని పట్టుకొని విచారించగా తన వద్ద 12 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగింది. మరియు అతని వద్ద నుండి మూడు సెల్ ఫోన్లు సీజ్ చేయడం జరిగింది, అతడు మహారాష్ట్రకు చెందిన నితిన్ న్యాను షిండే ఇతడు మహారాష్ట్రకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఒడిశా రాష్ట్రం నుండి ఇటు గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ రేటుకు అమ్ముటకు తీసుకువెళుచు నా క్రమంలో ఈరోజు నెక్కొండలో పట్టుకోవడం జరిగింది, ఈ కేసులో అతని వద్ద స్వాధీనపరుచుకున్న ఎండు గంజాయి విలువ ఆరు లక్షల రూపాయలు ఉంటుందని నెక్కొండ ఎస్ఐ తెలిపినారు. తనపై కేసు నమోదు చేసి ఇంకా ఈ కేసులు ఎవరైనా పాత్ర ఉందా అనేది దర్యాప్తు చేయడం జరుగుతుంది, నెక్కొండ ఎస్సై తెలియజేశారు.

# ఇఎస్ఐ కాంట్రాక్టుల్లో భారీ కుంభకోణం

- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని నాలుగు ప్రధాన ఇఎస్ఐ ఆస్పత్రుల క్లీనింగ్ కాంట్రాక్టుల పేరుతో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆరోపించింది. ఈ వ్యవహారంపై కేవలం విజిలెన్స్ విచారణతో సరిపెట్టకుండా, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులతో పాటు సంబంధిత ఏజెన్సీపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కుంభకోణంలో దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని కోరారు. ఉపాధి కల్పనా కమిటీ నివేదిక, అధికారుల సిఫార్సులను పక్కనపెట్టి క్లీనింగ్ ఛార్జీలను చదరపు అడుగుకు రూ.10 నుంచి రూ.49.50కు పెంచారని జాన్ వెస్లీ ఆరోపించారు. దీంతో గతంలో నెలకు రూ.61.71 లక్షలుగా ఉన్న ఖర్చు ప్రస్తుతం రూ.3.05 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఛార్జీలను 260 శాతం పెంచినా, కార్మికుల వేతనాలు పెంచకుండా నిధులను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఇఎస్ఐ మందుల కొనుగోళ్లలోనూ కుంభకోణం జరిగిందని గుర్తుచేశారు. కార్మికుల ఆరోగ్యం, రక్షణ కోసం కేటాయించిన నిధులను స్వలాభం కోసం దుర్వినియోగం చేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమ కాంట్రాక్టును తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి అండతోనే ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అరాచకాలు

- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్



**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 25 (జనంసాక్షి) :** మూడు సంవత్సరాలుగా మంచిర్యాల జిల్లాలో ప్రతిపక్ష పార్టీల నాయకుల పై, వ్యాపారస్తుల పై దాడులు జరుగుతున్న, అక్రమ కేసులు పెట్టిన ముఖ్యమంత్రి, పోలీస్ యంత్రాంగం పట్టించుకోలేదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ పేర్కొన్నారు. బిజెపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్ గాజుల ముఖేష్ గౌడ్ తో కలిసి మాట్లాడుతూ హోమ్ మంత్రి గా ఉన్న ముఖ్యమంత్రికి ఎంత సేపు డబ్బులు వసూలు చేసుకోవడంలో ఉన్న శ్రద్ధ శాంతి భద్రతల పై లేదని ఆరోపించారు. మంచిర్యాల జిల్లాలో కొద్ది రోజులుగా మంచిర్యాల ఎమ్మెల్యే వర్గం, మంత్రి వివేక్ వర్గం మధ్య జరుగుతున్న దాడులు మరియు జిల్లాలో శాంతి భద్రతలు విఘాతం కలిగిస్తూ ప్రజలు భయ భ్రాంతులకు గురి చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు యువతను గంజాయి మరియు డ్రగ్స్ కు బానిస చేసి దాడులను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు .గత మూడు సంవత్సరాలుగా ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాలలో భూ కబ్జాలు, దాడులు మరియు వసూళ్లు చేసి ఇప్పుడు వర్గాలు గా విడిపోయి మంచిర్యాల జిల్లాలో అలజడికి సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు గత వారం రోజులుగా ఎన్నడూ లేని విధంగా ఎప్పుడు కూడా ప్రజా ప్రతినిధి కానీ వ్యక్తికి 300 మంది పోలీస్ బలగాల తో రక్షణ.. ఎవరి అండతో బలగాలు మోహరించారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న మంచిర్యాలను కాంగ్రెస్ నాయకులు వర్గాలుగా విడిపోయి దాడులు చేసుకో వడంతో ప్రజలకు భయందోళనకు గురి అవుతున్నారని తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, దాడికి పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకుల పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## గోదావరి జలాలను ఒడిసిపట్టి..

# వేసవి తాగునీటి అవసరాలు తీర్చడమే లక్ష్యం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- దుమ్ముగూడెం ఆనకట్టపై ఒక టీఎంసీ నీటి నిల్వకు చర్యలు
- ఇసుక బస్తాల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలి
- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి పొదుపుపై ప్రజలకు పిలుపు
- నీటి లభ్యతకు అనుగుణంగా రబీ పంటలు సాగు చేయాలి



**అశ్వాపురం అక్టోబర్ 25 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామ పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఆనకట్టపై ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసేందుకు చేపడుతున్న పనులను పరిశీలించిన మంత్రి, పనుల పురోగతి, గోదావరి నీటి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మగారిపల్లి నుంచి దుమ్ముగూడెం వరకు పడవలో ప్రయాణిస్తూ ఆనకట్ట పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దుమ్ముగూడెం వైపు ఆనకట్టపై ఇసుక బస్తాలతో చేపడుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు కార్మికులను నియమించి, పడవలను పెంచి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూలి , ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్న అంచనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులు వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక రంగం, ప్రజారోగ్యం, పశుసంపదపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను భయాందోళనలకు గురిచేయడం తమ ఉద్దేశం కాదని, రానున్న పరిస్థితులను ముందుగానే అర్థం చేసుకుని నష్టాలను నివారించేందుకు ప్రజల్లో అవగాహన, ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ ఏడాది వర్షపాతం లోటు, నదులు, వాగులు, వంకల్లో తగ్గిన నీటి ప్రవాహాలు, రిజర్వాయర్లలో పరిమిత నీటి నిల్వల కారణంగా భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో బోర్ల నుంచి నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చడం ప్రధాన సవాలుగా మారే అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి బొట్టును జాగ్రత్తగా వినియోగించుకోవాలని, నీటి వృథాను నివారించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి గోదావరి నీటిని నిల్వ చేయడం ద్వారా రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకు ఆనకట్టపై సుమారు ఒక మీటర్ ఎత్తున ఇసుక బస్తాల పొరలను ఏర్పాటు చేసి దాదాపు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ నీటి నిల్వ ద్వారా తాగునీటి అవసరాలకు అవసరమైన నీటిని అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సాధారణంగా వేసవిలో గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోయే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే నీటిని నిల్వ చేయడం అవసరమని తెలిపారు. ఆనకట్టపై ఇసుక బస్తాల ఏర్పాటు పనులను వేగవంతం చేసేందుకు రోజుకు 10 వేల నుంచి 15 వేల బస్తాలను ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సుమారు లక్షన్నర ఇసుక బస్తాలు అవసరం అవుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే నీటి నిల్వలను కాపాడుకోవడం అత్యంత అవసరమని మంత్రి స్పష్టం చేశారు. భద్రాచలంతో పాటు ఇతర ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి పంపిణీని సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆనకట్ట వద్ద నీటిని నిల్వ చేస్తూనే అవసరమైన ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఒక టీఎంసీ నీటి నిల్వ లక్ష్యాన్ని సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావం పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రబీ సాగులో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను అంచనా వేసుకుని అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పంటలను సాగు చేయాలని కోరారు. తక్కువ నీటితో పండే కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భూమిలో ఉన్న తేమ, నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని, అధిక నీటి అవసరం ఉండే పంటల సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో అందుబాటులో ఉన్న గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు.




# నవంబర్ 20, 21 తేదీల్లో ఆరో బాలోత్సవం

- హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహణ

**ముషీరాబాద్, అక్టోబర్ 25 (జనం సాక్షి):** తెలంగాణ బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆరో బాలోత్సవాలు (6వ పిల్లల జాతర) నవంబర్ 20, 21 తేదీల్లో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్. సోమయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవాల ఈవెంట్ల వివరాలు, నిర్వహణ విధివిధానాలతో కూడిన బ్రోచర్లు, గోడపత్రిక ను విడుదల చేశారు. బాలోత్సవాల్లో మొత్తం 26 ఈవెంట్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి ఈవెంట్‌కు ముగ్గురు చొప్పున న్యాయనిర్ణేతలు గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈవెంట్లకు జడ్జిలుగా వ్యవహరించేందుకు ముందుకొచ్చిన ప్రముఖులతో ఆదివారం గెట్‌టుగెదర్ సమావేశాన్ని నిర్వహించి, వారి నుంచి విలువైన సలహాలు, సూచనలు స్వీకరించినట్లు పేర్కొన్నారు.

### బాలలే నిర్వాహకులుగా బాలోత్సవాలు

ఈ బాలోత్సవాల్లో ప్రతి ఈవెంట్ వేదికపై పాఠశాల విద్యార్థులే నిర్వాహకులుగా వ్యవహరిస్తూ యాంకరింగ్ చేస్తారని సోమయ్య తెలిపారు. దీనివల్ల పిల్లల్లో భాషా నైపుణ్యాలు, హావభావాలు మెరుగుపడటంతో పాటు వేదికపై మాట్లాడే భయం తొలగిపోతుందని అన్నారు. భవిష్యత్తులో మంచి ఉపన్యాసకులుగా, వివిధ కార్యక్రమాలకు న్యాయనిర్ణేతలుగా ఎదగడానికి ఈ విధానం దోహదపడుతుందని వివరించారు. బాలోత్సవా లను బాలలే నిర్వహించుకునే నూతన ఒరవడికి ఈ కార్యక్రమం పునాది వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన చురుకైన విద్యార్థులను ఎంపిక చేసి నవంబర్ 1న గెట్‌టుగెదర్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల భాగస్వామ్యంతో బాలోత్సవాలను విజయ వంతంగా నిర్వహించేందుకు కమిటీ కృషి చేస్తోంద న్నారు. హైదరాబాద్ నగరంలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు, నిర్వాహకులు తమ విద్యా ర్థులను వెంటనే ఎంపిక చేసి తెలంగాణ బాలోత్సవ కమిటీకి పంపించాలని సోమయ్య కోరారు. బాలోత్సవాల నిర్వహణకు సహకరిస్తున్న న్యాయ నిర్ణేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవ కమిటీ కోశాధికారి జి. బుచ్చిరెడ్డితో పాటు సుజావతి, ఈ. మమత, అంకమ్మ, రూపా రుక్మిణి, ఇందిరా పరాశరం, సాధనాల సుదర్శన్, పద్మావతి, భూదేవి, వి. శైలజ, టంక్ సుష్మ పాల్గొన్నారు.

# దేశ వ్యాప్తంగా వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

- హయత్‌నగర్‌లో 'అల్లాడీస్ డిస్కాన్' జిల్లా సదస్సులో ఉప్పల శ్రీనివాస్ గుప్త






హైదరాబాద్ (జనంసాక్షి) : అల్లాడీస్ జిల్లా కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన "అల్లాడి పరమేశ్వర్ సేవా ప్రశంసల సదస్సు" కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు. హయత్‌నగర్‌లోని ఆల్ ఇండియా రేడియో స్టేషన్ ఎదురుగా ఉన్న నిధీష్ కన్వెన్షన్‌లో ఈ సదస్సు నిర్వహించారు. సేవా కార్యక్రమాలు, సామాజిక బాధ్యత, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో చేపడుతున్న కార్యక్రమాలను ప్రోత్సహించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి అల్లాడీస్ డిస్కన్ జిల్లా గవర్నర్, సద్గురు యోగాచార్య డాక్టర్ అల్లాడి పరమేశ్వర్ నాయకత్వం వహించగా, అంతర్జాతీయ అధ్యక్షుడు కేసీజీఎఫ్ సిద్ధ వెంకట సూర్య ప్రకాశరావు, ముఖ్య అతిథిగా అంతర్జాతీయ కోశాధికారి కేసీజీఎఫ్ వి.ఎస్. సెంథిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి సేవా సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. సమాజంలో సేవాభావాన్ని మరింత విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజోపయోగ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. 'కలిసికట్టుగా పని చేద్దాం – సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగుదాం' అనే సందేశంతో నిర్వహించిన ఈ సదస్సులో బొగ్గారపు దయానంద్, గంప నాగేశ్వర్‌రావు, చంద్రమౌళి, కృష్ణారావు, పలువురు ప్రముఖులు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కొమురం భీం వర్ధంతికి సర్వం సిద్ధం!

- నేడు జోడేఘాట్ లో భీం 86వ వర్ధంతి
- వేలాదిగా తరలిరానున్న ఆదివాసీలు
- హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు
- 600 మంది పోలీసులతో భారీ బందోబస్తు





**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** ఆదివాసుల ఆరాధ్య దైవం, జల్-జంగల్-జమీన్ కోసం పోరాడిన యోధుడు కొమురం భీం 86వ వర్ధంతికి జోడేఘాట్ ముస్తాబైంది. నేడు జరగనున్న వర్ధంతి వేడుకలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. వర్ధంతికి ముందురోజైన ఆదివారం రాత్రి కొమురం భీం వారసులు జోడేఘాట్ కు చేరుకుని ఆదివాసీ సంప్రదాయం ప్రకారం అవ్వాల్ పెన్ (పోచమ్మ తల్లి)కి ప్రత్యేక పూజలు చేశారు. పోరాట సమయంలో భీంకు పోచమ్మ తల్లి అండగా నిలిచిందనే నమ్మకంతో ఏటా వర్ధంతికి ఒకరోజు ముందు గొర్రెను బలిచ్చి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. వారసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ఆదివాసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### వేలాదిగా తరలిరానున్న ఆదివాసులు

భీం వర్ధంతికి తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల నుండి ఆదిమ గిరిజనులు తరలిరానున్నారు. నేడు దారులన్నీ జోడేఘాట్ వైపే మళ్లనున్నాయి. వేలాదిగా వచ్చే ప్రజల కోసం అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. హట్టి నుండి జోడేఘాట్ వరకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, తాగునీరు, భోజనం, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు కల్పించారు. సభా ప్రాంగణంలో భారీ షామియానాలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు భీం వర్ధంతికి నివాళులు అర్పించడానికి రానుండటంతో జోడేఘాట్ లో 600 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ వద్ద బారికేడ్లు, పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు.

జిల్లా కలెక్టర్ హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందు, జిల్లా ఎస్పీ నితికా పంత్ పలుమార్లు జోడేఘాట్ ను సందర్శించి వర్ధంతి ఏర్పాట్లపై అధికార యంత్రాంగానికి సూచనలు చేశారు. ఆదివాసీ సంస్కృతి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి ఏటా వర్ధంతి జరుపుకుంటున్నా తమ ప్రాంత సమస్యలైన రోడ్లు,తాగు,సాగు నీరు, పక్కా ఇళ్లు, విద్య, వైద్యం,విద్యుత్తు వంటి ప్రాథమిక సౌకర్యాలు పరిష్కారం కావడం లేదని, ఈసారైనా ప్రభుత్వం తమ 12 పోరు గ్రామాల సమస్యలను పట్టించుకోవాలని స్థానిక ఆదివాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం
26 అక్టోబర్ 2026

# ఆధునికీకరణే సరైన సమాధానం

సంపాదకీయం

చైనాను సంప్రదాయ యుద్ధ పద్ధతులతో ఎదుర్కోవడం కష్టమన్న ఇండో--టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ సింగ్ కపూర్ ప్రకటన దేశ సరిహద్దు భద్రతపై కీలక చర్చకు తెరలేపింది. అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో భారత, చైనా బలగాల మధ్య ముఖాముఖి పరిస్థితులు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు. సరిహద్దు రక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న దళాధిపతి చేసిన ఈ వ్యాఖ్యలు మారుతున్న యుద్ధ స్వరూపానికి అనుగుణంగా మన రక్షణ సంసిద్ధతను సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి.

2020 గల్వాన్ ఘర్షణ తర్వాత భారత్--చైనా సంబంధాల్లో విశ్వాసం పూర్తిగా పునరుద్ధరించబడిందని చెప్పలేం. సైనిక, దౌత్య చర్చలు కొనసాగుతున్నప్పటికీ సరిహద్దులో ఉద్రిక్తతలు అప్పుడప్పుడు తలెత్తుతున్నాయి. చైనా బలగాలు నిర్దేశిత గస్తీ విధానాలకు భిన్నంగా వ్యవహరించడం వల్ల సరిహద్దు పరిస్థితులు దెబ్బతింటున్నాయని భారత విదేశాంగ శాఖ కూడా పేర్కొంది. ఈ నేపథ్యంలో శాంతి చర్చలు ఒకవైపు కొనసాగుతూనే, మరోవైపు రక్షణ సంసిద్ధతను పెంచుకోవడం అనివార్యం.

ఐటీబీపీ డీజీపీ వ్యాఖ్యల్లో అత్యంత కీలకమైన అంశం యుద్ధ సాంకేతికతలో వచ్చిన మార్పు. డ్రోన్లు, వాటిని అడ్డుకునే వ్యవస్థలు, ప్రత్యేక శిక్షణ, ఆధునిక ఆయుధాలు ఇప్పుడు సరిహద్దు భద్రతలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. చైనా తన సైనిక సామర్థ్యాలను ఆధునికీకరించుకున్న నేపథ్యంలో పాత పద్ధతులపైనే ఆధారపడటం సరిపోదు. అందుకే ఐటీబీపీ సరిహద్దు బెటాలియన్లలో డ్రోన్ విభాగాలను ఏర్పాటు చేయడం, 'శౌర్య' కమాండో బృందాలను విస్తరించడం, గల్వాన్ తరహా పరిస్థితులను ఎదుర్కొనే ప్రత్యేక శిక్షణ అందించడం ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇవి కేవలం పరికరాల కొనుగోలుతో ముగిసే చర్యలు కావు; శిక్షణ, నిఘా, సమాచార వ్యవస్థలు, వేగవంతమైన ప్రతిస్పందన సమన్వయంతో పనిచేయాలి.

ఆధునికీకరణ అంటే సాంకేతిక పరికరాలను సమకూర్చుకోవడం మాత్రమే కాదు. హిమాలయ ప్రాంతాల్లోని క్లిష్ట వాతావరణానికి తగిన మౌలిక సదుపాయాలు, సురక్షిత రక్షణ నిర్మాణాలు, రవాణా సౌకర్యాలు, నిరంతర సమాచార వ్యవస్థలు కూడా అంతే అవసరం. సరిహద్దుల్లో విధులు నిర్వర్తించే జవాన్ల ధైర్యసాహసాలకు కొదవలేదు. వారికి అవసరమైన సాధనాలు, సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, రక్షణ సదుపాయాలను సమయానికి అందించడం ప్రభుత్వ బాధ్యత. సైనికుల త్యాగాలను కీర్తించడంతోపాటు, వారి భద్రతకు అవసరమైన వనరులను సమకూర్చాలి.

సరిహద్దు పరిస్థితులపై ప్రజలకు సమాచారం అందించడంలోనూ బాధ్యతాయుతమైన పారదర్శకత అవసరం. సైనిక కార్యకలాపాలకు సంబంధించిన సున్నితమైన వివరాలను బహిర్గతం చేయడం సాధ్యం కాకపోవచ్చు. అయితే సరిహద్దు భద్రతకు సంబంధించిన విధానాలు, రక్షణ సంస్కరణలు, ఆధునికీకరణ పురోగతి గురించి పార్లమెంటుకు జవాబుదారీతనం ఉండాలి. అధికారిక ప్రకటనల్లోని వాస్తవాలను అతిశయోక్తులతో కలపకుండా ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించడం కూడా అంతే ముఖ్యం.

చైనాతో సరిహద్దు సమస్యకు సైనిక సంసిద్ధత ఒక్కటే పరిష్కారం కాదు; దౌత్య చర్చలు, స్పష్టమైన సరిహద్దు నిర్వహణ, పరస్పర అవగాహన కూడా అవసరమే. అయితే చర్చలు సాగుతున్నాయనే కారణంతో రక్షణ సన్నద్ధతలో అలసత్వానికి తావుండకూడదు. స్వదేశీ రక్షణ తయారీని బలోపేతం చేయడం, ఐటీబీపీ--సైన్యం మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం, ఆధునిక నిఘా వ్యవస్థలను విస్తరించడం, సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను పెంపొందించడం తక్షణ ప్రాధాన్యాలు కావాలి. ఐటీబీపీ డీజీపీ ప్రకటనను భయాందోళనలకు కారణంగా కాకుండా, రక్షణ వ్యవస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దుకోవాల్సిన హెచ్చరికగా చూడాలి. సరిహద్దు భద్రతలో ధైర్యం ఎంత ముఖ్యమో, సాంకేతిక ఆధిక్యం, శిక్షణ, సంసిద్ధత కూడా అంతే ముఖ్యం. మారుతున్న యుద్ధ స్వరూపాన్ని గుర్తించి రక్షణ వ్యవస్థను ఆధునికీకరించడమే దేశ భద్రతకు సరైన సమాధానం.

# సరిహద్దులో చైనా దూకుడు.. కేంద్రం మౌనం ఎందుకు?



దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటం ఏ ప్రభుత్వానికైనా ప్రథమ కర్తవ్యం. ఎన్నికల ప్రచారంలో జాతీయ భద్రతను గొప్పగా చాటుకోవడం ఒకటైతే, సరిహద్దుల్లో ఎదురయ్యే వాస్తవ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడం మరొకటి. అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులో చైనా సైనికుల కదలికలు, భారత సైన్యంతో పలుచోట్ల కొనసాగుతున్న ప్రతిష్టంభన ఇప్పుడు దేశ భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి. దేశాన్ని చుట్టుముట్టే ప్రమాదాల గురించి ప్రశ్నిస్తే జాతీయతను ప్రశ్నించినట్లుగా చిత్రించే పాలకులు, ఇప్పుడు ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోగలరా?

ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ అక్టోబర్ 22న వెల్లడించిన సమాచారం ఈ ఆందోళనలకు మరింత ప్రాధాన్యం కల్పించింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భారత, చైనా సైనికుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోందని ఆయన తెలిపారు. అప్పర్ సుబన్‌సిరి జిల్లాలోని తక్సింగ్ ప్రాంతం సమీపంలోని అసఫిలా సెక్టార్‌లో, భారతదేశం భావిస్తున్న వాస్తవాధీన రేఖకు సంబంధించి సుమారు ఆరు నుంచి ఏడు కిలోమీటర్ల పరిధిలో చైనా సైనికులు గుడారాలు ఏర్పాటు చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. జూలై నుంచి కొనసాగుతున్న ఈ పరిస్థితిని తేలికగా తీసుకోలేం. అయితే, ఈ దూరం వివాదాస్పద వాస్తవాధీన రేఖకు సంబంధించి భారతదేశం భావిస్తున్న స్థితిని సూచిస్తుందని, దానిని నిర్ధారిత అంతర్జాతీయ సరిహద్దు ఉల్లంఘనగా యథాతథంగా పరిగణించరాదని గుర్తించాలి.

అక్టోబర్ 24న వెలువడిన మరో నివేదిక ప్రకారం, అసఫిలా, లాంగ్జు ప్రాంతాల్లో పరిస్థితి సున్నితంగా ఉన్నప్పటికీ, హింసాత్మక ఘర్షణలు జరిగినట్లు సమాచారం లేదని రక్షణ వర్గాలు తెలిపాయి. భారత సైన్యం అక్కడ పోరాడే స్థితిలో లేదని తేల్చిచెప్పడానికి కూడా ప్రస్తుతం బహిరంగ ఆధారాలు లేవు. అయినప్పటికీ, చైనా సైనిక సామర్థ్యం, సరిహద్దు మౌలిక సదుపాయాల విస్తరణ, డ్రోన్లు సహా ఆధునిక యుద్ధ సాంకేతికతలో దాని పెట్టుబడులను దృష్టిలో ఉంచుకుని భారత్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఐటీబీపీ అధిపతి సైతం పాత ఆయుధాలను ఆధునికీకరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించడం రక్షణ సంసిద్ధతపై మరింత సమీక్ష జరగాలని సూచిస్తోంది.

2020లో గాల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో ఇరువైపులా ప్రాణ నష్టం సంభవించింది. ఆ అనుభవం నుంచి భారత్ నేర్చుకోవాల్సిన పాఠాలు ఇంకా ఉన్నాయి. సరిహద్దుల్లో రహదారులు, వంతెనలు, నిఘా వ్యవస్థలు, డ్రోన్లు, ప్రతిఘటన సామర్థ్యాలు, సైనికులకు అవసరమైన ఆధునిక ఆయుధాలు సమకూర్చడం అత్యవసరం. సైనికుల ధైర్యసాహసాలపై సందేహం వ్యక్తం చేయడం సరికాదు; వారికి అవసరమైన పరికరాలు, వ్యూహాత్మక మద్దతు, స్పష్టమైన ఆదేశాలు అందుతున్నాయా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మాత్రం ప్రజాస్వామిక హక్కు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు ఈ అంశంపై దేశానికి స్పష్టమైన వివరణ ఇవ్వాలి. విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా సైనికులు సాధారణ గస్తీ విధానాల నుంచి వైదొలగడం సరిహద్దు పరిస్థితులను అప్పుడప్పుడు ఉద్రిక్తం చేస్తోందని పేర్కొంది. సమస్యలను పరిష్కరించేందుకు దౌత్య, సైనిక మార్గాలు కొనసాగుతున్నాయని తెలిపింది. ఈ ప్రకటన అవసరమైనదే అయినా, ప్రజల ఆందోళనలను పూర్తిగా నివృత్తి చేయడానికి సరిపోదు. సరిహద్దుల్లో భారత గస్తీకి ఎలాంటి ఆటంకాలు ఎదురవుతున్నాయి? గతంలో గస్తీ నిర్వహించిన ప్రాంతాలకు ఇప్పుడు కూడా మన సైన్యం వెళ్లగలుగుతోందా? సైనిక ఆధునికీకరణలో ఎలాంటి లోటుపాట్లు ఉన్నాయి? ఈ ప్రశ్నలకు వాస్తవాధారిత సమాధానాలు అవసరం.

చైనాతో చర్చలు జరపడం బలహీనత కాదు; అదే సమయంలో చైనా చర్యలను ప్రశ్నించకుండా దౌత్య సంబంధాలను సాధారణీకరించడం కూడా వ్యూహం కాదు. సరిహద్దు శాంతి, దేశ ఆర్థికాభివృద్ధి, ప్రాంతీయ స్థిరత్వం పరస్పరం ముడిపడి ఉన్నాయి. అయితే, శాంతి చర్చలు సాగుతున్నాయనే కారణంతో సరిహద్దు భద్రతపై పారదర్శకతను తగ్గించకూడదు. అవసరమైన సైనిక రహస్యాలను కాపాడుతూనే పార్లమెంటుకు, ప్రజలకు పరిస్థితిపై సముచిత సమాచారం అందించాలి. దేశభక్తి అంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఉండటం కాదు; దేశ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వాన్ని బాధ్యతాయుతంగా నిలదీయడం. చైనా సరిహద్దులో పరిస్థితి నియంత్రణలో ఉందని ప్రభుత్వం చెబితే, ఆ భరోసాకు ఆధారాలను కూడా వివరించాలి. సైనికుల త్యాగాలను రాజకీయ ప్రచారానికి ఉపయోగించకుండా, వారి భద్రతకు అవసరమైన వనరులు సమకూర్చాలి. సరిహద్దులో అప్రమత్తత, దౌత్యంలో దృఢత్వం, ప్రజలకు నిజాయితీతో కూడిన సమాచారం–ఈ మూడూ కలిసినప్పుడే జాతీయ భద్రతకు నిజమైన పునాది ఏర్పడుతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# విజయపథం

*"ఎవడి హక్కుల పక్కురా
ఈ నేల?
ఎవడి కాపలా కుక్కరా ఈ చరిత్ర"*





అంటూ కొత్త కోణంలో చరిత్రను పునర్ మూల్యాంకనం చేయాలని నినదించిన కవి బన్న ఆయిలయ్య. తెలంగాణ తేజానికి మారుపేరైన వరంగల్ జిల్లా నర్సంపేటకు దగ్గరలోని రంగంపేటలో ఒక నిరుపేద దళిత కుటుంబంలో2.2.1964లో జన్మించిన అయిలయ్య స్వయంకృషితో ఇంతింతై వటుడింతై అన్నట్లుగా ఎదిగి తను చదువుకున్న విశ్వవిద్యాలయంలోనే తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. చిన్నతనం నుంచి అంబేద్కర్ ప్రబోధించిన చదువు–పోరాడుబిసమీకరించు అనే లక్ష్యాన్ని త్రికరణ శుద్ధితో పాటించిన వ్యక్తి, శక్తి అయిలయ్య. ప్రతికూల పరిస్థితులలోనూ ప్రభావశీలమైన చైతన్యాన్ని కోల్పోకుండా తనదైన ముద్ర వేశారు. 1989లో వచ్చిన రహస్య చిత్రం, 1998లో దీర్ఘ కవితగా ద్విభాషా కవితా సంపుటిగా వెలువరించిన "నిప్పుకణిక" దళిత సాహిత్యోద్యమానికి విలువైన చేర్పు. సాహిత్య రంగంలో కవిగా ప్రవేశించిన అయిలయ్య క్రమంగా అధ్యాపకుడిగా పరిశోధకుడుగా, విమర్శకుడిగా రాణించారు. తెలంగాణ సాహిత్య సంస్థలు అన్నది ఆయన పరిశోధన గ్రంథం కాగా విమర్శకు సంబంధించి ఇప్పటివరకు ఆయన "తెలుగు కవిత– అభినవ దృక్పథం, తెలంగాణ సాహిత్య సాంస్కృతిక చైతన్యం, సాహితీ కిరణాలు, సవ్వడి, నాలుగు ఆధునిక కావ్యాలు–ఒక పరిశీలన, కాలువ మల్లయ్య కథలు–తెలంగాణ జన జీవితం, ప్రజాకవీ కాళోజీ కవిత్వం, సాహితీ వాహిని, తెలంగాణ సాహిత్య పీఠికలు, తెలంగాణ కథ– పరామర్శ, ధార మొదలైనవి ముఖ్యమైనవి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఒకటో తరగతి నుండి డిగ్రీ స్థాయి వరకు తెలుగు పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యులుగా స్నాతకోత్తర స్థాయిలో తెలంగాణ సాహిత్యాన్ని పాఠ్యాంశాలుగా నిర్ణయించడమే కాకుండ, తెలంగాణ సాహిత్యం పై విశేష పరిశోధనలు గావించారు. ముప్పైమూడు సంవత్సరాల పాటు కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా ఎనలేని సేవలు అందించిన బన్న అయిలయ్య 29.2.2024న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మంథని శంకర్ ప్రధాన సంపాదకత్వంలో ఆయన బంధుమిత్రులు, అధికారులు, విద్యార్థులు, అభిమానులు కలిసి"విజయ పథం" పేరుతో ఆయన షష్టిపూర్తి అభినందన సంచికను వెలువరించారు. ఇది అయిలయ్య గారి వ్యక్తిత్వాన్ని, పాలనాపరమైన సామర్థ్యాన్ని, సాహిత్య తత్వాన్ని, అన్నింటికి మించి ఆయన సామాజిక దృక్పథాన్ని చక్కగా విశ్లేషిస్తుంది.

విజయపథం ఒక బృహత్ గ్రంథం. ఇది అయిలయ్య గారి జీవన సర్వస్వంగా చెప్పవచ్చు. సంపాదక మండలి వారు విషయ విశ్లేషణ కోసమై అభినందన, ఆత్మీయం, అక్షర యానంగా వింగడించారు. అయిలయ్య గారి సహధ్యాయి, సన్నిహితులు సీతారాం ఆయన వ్యక్తిత్వాన్ని గూర్చి రాస్తూ"మనం ఏది అయినా కాకపోయినా మనుషులం కావాలి. మనుషులకు హృదయం ఉండాలి. ఆ హృదయానికి స్పందించే గుణం ఉండాలి. ఆ గుణానికి ఒక విలువ ఉండాలి. అయిలయ్య గారు నిలువెల్ల మనిషి. తనువెల్ల పరిశ్రమ. అదిగో ఆ మనిషి తనము, ఆ నిర్విరామ పరిశ్రమ ఆయనను ఉన్నత స్థానంలో నిలబెట్టాయి" అన్న మాటలు అయిలయ్య గారు ఎదిగి వచ్చిన క్రమాన్ని వివరిస్తాయి. అయిలయ్య తను వచ్చిన మూలాలను మర్చిపోకుండా కేవలం బతకడానికే కాకుండా బాధ్యతాయుతమైన అధ్యాపకుడిగా పని చేశారని ప్రముఖ కథా రచయిత కాలువ మల్లయ్య అన్నారు.

"మట్టి చరిత్ర వినా
మలిన చరిత్ర లేని వాణ్ని" అని దళిత స్వరాన్ని వినిపిస్తూ"ఎన్ని హరితవనాలు మావి కాకుండా పోయాయి/ఎన్ని అడవుల మీది గాలులు మమ్మల్ని తాకకుండా వీచాయి"అని ప్రశ్నిస్తారు. తెలుగులో దళిత గీతాలు, జి. లక్ష్మీ నరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్ సంపాదకత్వంలో వచ్చిన చిక్కనవుతున్న పాటలో బన్న అయిలయ్య రాసిన "అమలిన చరిత్ర" చోటుచేసుకుంది. దీర్ఘ కవితగా రాసిన ఆయన నిప్పుకణిక దళిత కవిత్వానికి దిక్సూచిగా నిలిచింది. దళితేతరులు రాసిన సాహిత్యంలో సంస్కరణ దృక్పథం, మానవీయ హృదయం ఉంది కానీ దళితుల రచనల్లో తిరుగుబాటు ధోరణి, హైందవం పై విమర్శ, విద్యా రాజకీయ రంగాలలో అధికారం కావాలనే ప్రాపంచిక దృక్పథం ఉన్నాయన్నారు. పాల్కురికి సోమనాథున రచనల్లో ఉత్పత్తి వర్గాలకు కావ్య గౌరవం కల్పించాడన్నారు. సాహితీ కిరణాలులో కాలువ మల్లయ్య నవలను సమీక్షిస్తూ"సంస్కారాన్ని ఆదర్శాన్ని విజ్ఞానాన్ని వినయాన్ని నేర్పవలసిన చదువు ఆధునిక కాలంలో మనిషిని స్వార్థపూరితునిగా చేసి తాను పుట్టి పెరిగిన పల్లెను కనిపించిన తల్లిదండ్రులను తమ మూలాలను మరిచి ప్రవర్తించేటట్లు చేస్తుందని మాట్లాడే బొమ్మలు లో శ్రీనివాస్ పాత్ర ద్వారా మనకు నిరూపితమవుతుందన్నారు. వ్యక్తిగతంగా కుటుంబ జీవితంలో ఎదురైన విషాదాలను తట్టుకుంటూనే కవిత్వం,విమర్శ బోధన పరిశోధనలలో ప్రామాణికమైన కృషిచేసిన సాహితీవేత్త బన్న అయిలయ్య అని ఈ గ్రంథం వేనోళ్ళ చాటుతుంది."చదవడం అనేది నాకు ఊపిరి. చదవడం అనేది నా దినచర్యలో భాగం. నాది సున్నిత హృదయం, ప్రతి చిన్న దానికి స్పందించే లక్షణం నాకుంది. అదే కవిత్వంగా అభివ్యక్తం అవుతుందని చెప్పారు. స్వయంకృషితో సమున్నత స్థాయికి చేరిన బన్న అయిలయ్య "విజయపథం" మరందరికో స్ఫూర్తిని అందిస్తుంది. అభినందనలు.

డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ 9989148305

# కలేకూరి ప్రసాద్..

నిన్నటి సంచిక తరువాయి

కులం, వర్గం మధ్య ఉన్న సంబంధాలను ఎలా అర్థం చేసుకోవాలి? సామాజిక సమానత్వం కోసం జరిగే పోరాటంలో దళితుల స్వతంత్ర రాజకీయ చైతన్యానికి ఎలాంటి స్థానం ఉండాలి? విప్లవోద్యమాలు కులాధిపత్యాన్ని నిర్మూలించడంలో ఎంతవరకు విజయవంతమవుతున్నాయి? ఇలాంటి ప్రశ్నలు తెలుగు సమాజంలో విస్తృతమైన చర్చకు దారితీశాయి.

కారంచేడు ఘటన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమం కొత్త తీవ్రతను సంతరించుకుంది. 1985లో జరిగిన కారంచేడు దళితులపై దాడి, 1991లో జరిగిన చుండూరు మారణకాండ కులాధిపత్యపు అమానవీయ స్వభావాన్ని మరోసారి దేశం ముందుంచాయి. ఈ సంఘటనలు దళిత ఆత్మగౌరవ ఉద్యమానికి చారిత్రక మలుపులుగా నిలిచాయి. కలేకూరి ప్రసాద్ కూడా ఈ ఉద్యమాల ప్రభావంలో తన రాజకీయ, సాహిత్య ప్రస్థానాన్ని మరింతగా దళిత సమస్యల వైపు మళ్లించారు. వామపక్ష విప్లవ రాజకీయాలతో ఆయనకు ఉన్న సంబంధం తర్వాత మార్పులకు లోనైంది. ఆయన దళిత ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. ఈ పరిణామాన్ని ఒక రాజకీయ శిబిరం నుంచి మరొక శిబిరానికి మారడంగా మాత్రమే చూడకూడదు. కులవివక్ష, దళిత ఆత్మగౌరవం, సామాజిక న్యాయం వంటి ప్రశ్నలపై ఆయన ఆలోచనా ప్రస్థానాన్ని అర్థం చేసుకునే సందర్భంగానూ చూడాలి. అదే సమయంలో ఆయన జీవితాన్ని ఒకే సిద్ధాంతపు చట్రంలో బంధించకూడదు. ఆయనలోని కవిని, విమర్శకుడిని, రాజకీయ కార్యకర్తను, సామాజిక ఆలోచనాపరుడిని సమగ్రంగా పరిశీలించాలి.

### పిడికెడు ఆత్మగౌరవం కోసం.. ఒక కవిత్వ ప్రకటన

కలేకూరి ప్రసాద్ పేరు వినగానే గుర్తుకొచ్చే రచనల్లో " పిడికెడు ఆత్మగౌరవం కోసం" ప్రత్యేకమైనది. ఆత్మగౌరవం అనేది ప్రతి మనిషికి సహజంగా దక్కాల్సిన హక్కు. కానీ కులవ్యవస్థలో కొందరి గౌరవం సామాజికంగా గుర్తించబడుతుండగా, మరికొందరి గౌరవం నిరంతరం నిరాకరించబడుతుంది. ఒక వర్గం మనుషుల జీవితాలను తక్కువగా చూడటం, వారి శ్రమను వినియోగించుకుంటూనే వారిని అంటరానివారిగా చూడటం, వారి ప్రతిభను అంగీకరించడానికి సిద్ధపడకపోవడం, వారి హక్కుల ప్రకటనను ధిక్కారంగా పరిగణించడం.. ఇవన్నీ కులాధిపత్యం ప్రదర్శించే రూపాలు. ఈ నేపథ్యంలో పిడికెడు ఆత్మగౌరవం కోసం అనే భావనకు గొప్ప రాజకీయ, సామాజిక ప్రాధాన్యం ఉంది.

మనిషి తన గౌరవం కోసం అడగాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది? గౌరవాన్ని కొలిచే అధికారం ఒక సామాజిక వర్గానికి మాత్రమే ఎందుకు ఉండాలి? ఇతరుల జీవితాలపై తీర్పులు చెప్పే హక్కును కులవ్యవస్థకు ఎవరిచ్చారు? ఇవి కేవలం సాహిత్య ప్రశ్నలు కావు. మన సమాజపు నిర్మాణాన్ని ప్రశ్నించే ప్రశ్నలు. కలేకూరి ప్రసాద్ ఆత్మగౌరవాన్ని దయతో లభించే వరంగా చూడలేదు. అది పోరాడి సాధించుకోవాల్సిన హక్కు అనే చైతన్యానికి తన రచనల ద్వారా బలాన్నిచ్చారు. ఇక్కడ ఆత్మగౌరవం అంటే వ్యక్తిగత ప్రతిష్ఠ మాత్రమే కాదు. సమాజంలో సమానమైన స్థానం, సమాన హక్కులు, స్వేచ్ఛగా జీవించే అవకాశం, తన జీవితంపై తనకే నిర్ణయాధికారం ఉండటం వంటి అంశాలన్నీ ఇందులో భాగమవుతాయి. దళిత సాహిత్యం గొప్పతనం కూడా ఇక్కడే ఉంది.

అది కేవలం బాధితుల కన్నీళ్లను వర్ణించదు. బాధితులు తమ జీవితాల గురించి తామే మాట్లాడే హక్కును ప్రకటిస్తుంది. ఇతరులు తమకు ఇచ్చిన గుర్తింపును స్వీకరించాల్సిన అవసరం లేదని చెబుతుంది. తమ అనుభవాల నుంచే తమ భాషను, తమ సౌందర్యాన్ని, తమ రాజకీయ చైతన్యాన్ని నిర్మించుకోవాలని సూచిస్తుంది. కలేకూరి ప్రసాద్ కవిత్వాన్ని ఈ దృక్పథంలో చదివినప్పుడే దాని లోతు మనకు అర్థమవుతుంది.

### కర్మభూమిలో పూసిన ఓ పువ్వా..పాటలో పలికిన సామాజిక ఆవేదన



కలేకూరి ప్రసాద్‌ను విస్తృతంగా ప్రజలకు పరిచయం చేసిన రచనల్లో "కర్మభూమిలో పూసిన ఓ పువ్వా" ఒకటి. ఈ పాటలో వినిపించే విషాదం వ్యక్తిగత దుఃఖానికి పరిమితం కాదు. సామాజిక హింసకు గురైన మనిషి జీవితంపై వ్యక్తమయ్యే సమష్టి ఆవేదన దాని వెనుక ఉంటుంది. పాటలోని భావోద్వేగం మనల్ని కదిలిస్తుంది. కానీ ఆ భావోద్వేగానికి కారణమైన సామాజిక వాస్తవికతను కూడా మనం గుర్తించాలి.

ఒక మనిషి జీవితం అకాలంగా ముగియడం వెనుక ఏ పరిస్థితులు ఉన్నాయి? ఒక మహిళపై హింస ఎందుకు జరుగుతోంది? కులం, ఆర్థిక ఆధిపత్యం, పితృస్వామ్యం వంటి వ్యవస్థలు వ్యక్తుల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయి? బాధితుల పట్ల సమాజం చూపించే నిర్లక్ష్యానికి కారణాలేమిటి? ఈ ప్రశ్నలను మన ముందుంచే శక్తి ప్రజా సాహిత్యానికి ఉంటుంది. కవిత్వం, పాట సాధారణ ప్రజల జీవితాల్లోకి ప్రవేశించినప్పుడు వాటి ప్రభావం మరింత విస్తృతమవుతుంది. చదవలేని వ్యక్తికి కూడా పాట వినిపిస్తుంది. పుస్తకం అందుబాటులో లేని వ్యక్తికి కూడా కవితలోని భావం చేరుతుంది. ఒక ఉద్యమంలో పాల్గొనే వేలాది మంది ఒకే పాటను పాడినప్పుడు, వ్యక్తిగత ఆవేదన సమష్టి చైతన్యంగా మారుతుంది. కలేకూరి ప్రసాద్ పాటల ప్రాధాన్యం ఈ సాంస్కృతిక ప్రజాస్వామ్యంలోనూ ఉంది.

ఆయన రచనలు తెలుగు సినిమా, ప్రజా గీతాల రంగాల్లోకి ప్రవేశించాయి. "భూమికి పచ్చని రంగేసినట్టు", "కర్మభూమిలో పూసిన ఓ పువ్వా" వంటి పాటలు ఆయన సాహిత్య ప్రస్థానంలోని గుర్తించదగిన రచనలు. ఈ పాటల ద్వారా ఆయన భావజాలం పుస్తకాలకే పరిమితం కాకుండా విస్తృత ప్రజానీకానికి చేరింది. సాహిత్యానికి ప్రజల జీవితాలతో సంబంధం ఉన్నప్పుడే అది సమాజంలో దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపగలదు. అయితే ప్రజాదరణ ఒక్కటే ఒక రచనకు కొలమానం కాదు. ఆ రచన మనిషి ఆలోచనలను ఎంతగా కదిలించింది? అన్యాయాన్ని గుర్తించడానికి ఎంతవరకు తోడ్పడింది? సామాజిక మార్పు పట్ల ఎలాంటి ఆకాంక్షను రగిలించింది? అన్న ప్రశ్నలు కూడా ముఖ్యమే. కలేకూరి ప్రసాద్ రచనలను ఈ ప్రమాణాలపై పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### దళిత సాహిత్యం.. బాధను దాటి ప్రతిఘటన దాకా

తెలుగు సాహిత్య చరిత్రలో దళిత సాహిత్య ఉద్యమం ఒక ముఖ్యమైన మలుపు. దళితులు సాహిత్యంలో పాత్రలుగా ఉండటం ఒక విషయం. దళితులే తమ అనుభవాలను, తమ ఆలోచనలను, తమ చరిత్రను స్వయంగా రాయడం మరో విషయం. ఈ రెండింటి మధ్య చాలా పెద్ద తేడా ఉంది. మొదటి సందర్భంలో దళిత జీవితాన్ని ఇతరుల దృష్టి నుంచి చిత్రించే అవకాశం ఉంటుంది. రెండో సందర్భంలో దళితులు తమ అనుభవాలకు తామే భాషను అందిస్తారు. తమపై జరిగిన అన్యాయాలను తామే విశ్లేషిస్తారు. తమ జీవితాల గురించి ఇతరులు నిర్మించిన అపోహలను ప్రశ్నిస్తారు. దళిత సాహిత్యం ఈ స్వీయ వ్యక్తీకరణకు మార్గం సుగమం చేసింది.

కలేకూరి ప్రసాద్ ఈ ఉద్యమంలో కవి మాత్రమే కాదు. సాహిత్య విమర్శకుడు, వ్యాసకర్త, అనువాదకుడు, సామాజిక విశ్లేషకుడిగానూ పనిచేశారు. దళిత సాహిత్యం, దళిత సాహిత్యోద్యమం వంటి అంశాలపై ఆయన చేసిన కృషి ఆయన సాహిత్య ప్రస్థానంలో మరో ముఖ్యమైన కోణం. ఒక సమాజపు సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఆ సమాజంలోని ఉత్పత్తి సంబంధాలు, అధికార నిర్మాణాలు, సామాజిక విభజనలు, సాంస్కృతిక ఆధిపత్యాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుంది. దళిత సాహిత్యాన్ని కేవలం ఒక ప్రత్యేక వర్గపు సాహిత్యంగా పరిమితం చేయడం దాని విశాలమైన సామాజిక ప్రాధాన్యాన్ని గుర్తించకపోవడమే అవుతుంది.

అది భారతీయ సమాజంలోని ప్రజాస్వామిక వైరుధ్యాలను బయటపెడు తుంది. సమానత్వం గురించి మాట్లాడే వ్యవస్థలో అసమానతలు ఎలా కొనసాగుతున్నాయో చూపిస్తుంది. మానవత్వాన్ని ప్రకటించే సంస్కృతిలో అమానవీయ ఆచారాలు ఎలా మనుగడ సాగిస్తున్నాయో ప్రశ్నిస్తుంది. అందువల్ల దళిత సాహిత్యం దళితులకే పరిమితమైన సాహిత్యం కాదు. కులవివక్షను నిర్మూలించాలని కోరుకునే ప్రతి ఒక్కరికీ అది అవసరమైన సాహిత్యం. కలేకూరి ప్రసాద్ రచనల ప్రాసంగికతను కూడా ఈ విశాలమైన దృక్పథంలోనే అర్థం చేసుకోవాలి.

### మార్క్సిజం, అంబేద్కరిజం.. సామాజిక విముక్తి ప్రశ్న

కలేకూరి ప్రసాద్ సాహిత్య, రాజకీయ ప్రస్థానాన్ని అర్థం చేసుకోవడంలో మార్క్సిస్టు ఆలోచనలకు, అంబేద్కర్ సామాజిక న్యాయ దృక్పథానికి మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించడం అవసరం. మార్క్సిజం ఉత్పత్తి సంబంధాలు, వర్గ దోపిడీ, శ్రమ దోపిడీ, ఆర్థిక అసమానతలను విశ్లేషిస్తుంది. అంబేద్కర్ ఆలోచన కులవ్యవస్థను, అంటరానితనాన్ని, సామాజిక అసమానత్వాన్ని, మానవ గౌరవాన్ని నిరాకరించే వ్యవస్థలను తీవ్రంగా ప్రశ్నిస్తుంది. భారతీయ సమాజంలో ఈ రెండు దృక్పథాల మధ్య సంభాషణ అవసరం.

కులాన్ని పక్కనపెట్టి వర్గ దోపిడీని మాత్రమే విశ్లేషిస్తే భారతీయ సమాజంలోని అనేక వాస్తవాలు మనకు అర్థం కావు. అలాగే ఆర్థిక దోపిడీని, శ్రమ సంబంధాలను, వర్గ అసమానతలను విస్మరించి కుల సమస్యను మాత్రమే పరిశీలించినా సమాజంలోని అన్ని వైరుధ్యాలనూ అర్థం చేసుకోలేం. కులం, వర్గం పరస్పరం ఎలా ప్రభావితం చేసుకుంటున్నాయి? భూమి, విద్య, ఉద్యోగం, రాజకీయ అధికారం, సామాజిక గౌరవం వంటి అంశాల్లో కుల సంబంధాలు ఎలాంటి పాత్ర పోషిస్తున్నాయి? ఆర్థిక మార్పులు వచ్చినప్పటికీ కుల వివక్ష ఎందుకు కొనసాగుతోంది? కుల నిర్మూలనకు ప్రజాస్వామిక, రాజకీయ, సాంస్కృతిక పోరాటాలు ఎలా దోహదపడాలి? ఇవి సమకాలీన భారతదేశం ముందున్న కీలకమైన ప్రశ్నలు.

కలేకూరి ప్రసాద్ జీవితంలోని రాజకీయ పరిణామాలను ఈ ప్రశ్నలతో అనుసంధానించి పరిశీలించాలి. ఆయన ప్రయాణాన్ని సిద్ధాంతాల మధ్య జరిగిన సాధారణ మార్పుగా కాకుండా, సామాజిక విముక్తి సమస్యలతో జరిగిన నిరంతర సంభాషణగా అర్థం చేసుకోవాలి. సిద్ధాంతాల మధ్య చర్చ, విభేదం, విమర్శ ప్రజా ఉద్యమాలకు సహజమైనవి. అయితే ఆ చర్చలన్నింటినీ దాటి నిలిచే ప్రాథమిక లక్ష్యం మనిషి గౌరవాన్ని కాపాడటం, దోపిడీని అంతం చేయడం, సమానత్వాన్ని స్థాపించడం కావాలి. కలేకూరి ప్రసాద్‌ను స్మరించుకోవడంలో ఈ ప్రశ్నలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఆయన వారసత్వాన్ని నేటి తరానికి మరింత సజీవంగా అందించగలం.

### భాషలో ఆగ్రహం.. భావంలో మానవత్వం

కలేకూరి ప్రసాద్ కవిత్వంలోని ఆగ్రహాన్ని అర్థం చేసుకోవడానికి ఒక విషయం గుర్తుంచుకోవాలి. శతాబ్దాలుగా అవమానించబడిన మనిషి తన బాధను వ్యక్తం చేసినప్పుడు, అతని భాషలో ఆవేదన ఉండవచ్చు. తన హక్కులను నిరాకరించిన వ్యవస్థను ప్రశ్నించినప్పుడు ఆగ్రహం ఉండవచ్చు. తన జీవితాన్ని తక్కువగా చూసిన సమాజానికి ఎదురొడ్డి నిలిచినప్పుడు తిరుగుబాటు స్వరం వినిపించవచ్చు. ఈ భావోద్వేగాలను కేవలం సాహిత్యపరమైన మృదుత్వం అనే ప్రమాణంతో కొలవలేం. అదే సమయంలో ఆగ్రహం వెనుక ఉన్న మానవీయ ఆకాంక్షను గుర్తించాలి.

దళిత కవి ఆగ్రహం ఒక సామాజిక అన్యాయానికి ప్రతిస్పందన. అతని ఆత్మగౌరవ ప్రకటన సమానత్వం కోసం చేసే డిమాండ్. అతని ప్రతిఘటన మనిషిని కులపు సంకెళ్ల నుంచి విముక్తి చేయాలనే ఆకాంక్ష. కలేకూరి ప్రసాద్ రచనల్లోని భావోద్వేగ తీవ్రతను ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. అయితే ఆయన కవిత్వాన్ని కేవలం ఆగ్రహ కవిత్వంగా పరిమితం చేయడం కూడా సరైనది కాదు. ఆయన రచనల్లో విషాదం, మానవీయ స్పందన, సామాజిక విమర్శ, సమానత్వ ఆకాంక్ష, భవిష్యత్తుపై ఆశ వంటి అనేక పార్శ్వాలు ఉన్నాయి. ప్రజల జీవితాల్లోని విషాదాన్ని కవిత్వంగా మలచడం ఒక సృజనాత్మక ప్రక్రియ. ఆ విషాదానికి కారణమైన సామాజిక నిర్మాణాలను ప్రశ్నించడం మరో ప్రక్రియ. ఆ ప్రశ్నల ద్వారా సమాజంలో మార్పు కోసం ఆలోచనలను ప్రేరేపించడం సాహిత్యానికి ఉన్న మరింత విస్తృతమైన సామర్థ్యం. కలేకూరి ప్రసాద్‌ను గుర్తుంచుకోవాల్సింది ఈ మూడు కోణాల సమన్వయంలోనే. కవికి వ్యక్తిగత జీవితం ఉంటుంది.. కానీ, సాహిత్య వారసత్వం సమాజానిది కలేకూరి ప్రసాద్ జీవితాన్ని స్మరించుకునేటప్పుడు ఆయన వ్యక్తిగత జీవితంలోని సంక్లిష్టతలను విస్మరించాల్సిన అవసరం లేదు. అదే సమయంలో వ్యక్తిగత జీవితంలోని అంశాలనే మొత్తం వ్యక్తిత్వానికి కొలమానంగా మార్చకూడదు. ప్రజా మేధావుల జీవితాలు కూడా మనుషుల జీవితాలే. వారికి పరిమితులు ఉంటాయి. బలహీనతలు ఉండవచ్చు. విభేదాలు, వైరుధ్యాలు, వ్యక్తిగత సమస్యలు ఉండవచ్చు. వారి రచనలను విమర్శనాత్మకంగా పరిశీలించాలి. వారి ఆలోచనల్లోని పరిమితులను గుర్తించాలి. వారి రాజకీయ వైఖరులను ప్రశ్నించాలి. అయితే ఇవన్నీ చేస్తూనే వారి సాహిత్య, సామాజిక కృషిని కూడా న్యాయంగా అంచనా వేయాలి. కలేకూరి ప్రసాద్ విషయంలోనూ ఇదే పద్ధతి అవసరం.

ఒక రచయితను దేవుడిగా నిలబెట్టడం వల్ల ఆయన ఆలోచనలు మనకు అందుబాటులో ఉండవు. అలాగే ఆయన జీవితంలోని ఏదో ఒక అంశాన్ని అతిశయించి చూపడం వల్ల ఆయన సృజనాత్మక కృషిని అర్థం చేసుకునే అవకాశం కోల్పోతాం. సమగ్ర పరిశీలన అంటే ప్రశంసించడం మాత్రమే కాదు. విమర్శించడం కూడా. అయితే ఆ విమర్శ వాస్తవాలపై ఆధారపడి ఉండాలి. వదంతులపై కాదు. ఒక వ్యక్తి సామాజిక నేపథ్యాన్ని, ఎదుర్కొన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూనే ఆయన చర్యల ప్రభావాన్ని కూడా పరిశీలించాలి. కలేకూరి ప్రసాద్ రచనలను సేకరించడం, ప్రచురించడం, వాటిపై పరిశోధనలు చేయడం, ఆయన సాహిత్యాన్ని కొత్త తరాలకు పరిచయం చేయడం అత్యవసరం. ఆయన రచనల్లోని ఆలోచనలను విమర్శనాత్మకంగా చర్చించాలి. ఆయన కవిత్వాన్ని సమకాలీన దళిత ఉద్యమాలు, ప్రజాస్వామిక పోరాటాలు, సాహిత్య పరిణామాలతో అనుసంధానించాలి. ఇదే ఒక రచయితకు అందించగల నిజమైన సాహిత్య గౌరవం.

### నేటి భారతదేశంలో కలేకూరి ఎందుకు అవసరం?

కాలం మారుతోంది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతోంది. సమాచార విప్లవం ప్రపంచాన్ని మన అరచేతిలోకి తీసుకొస్తోంది. పట్టణాలు విస్తరిస్తున్నాయి.

మిగితా తరువాయి సంచికలో..



మామిండ్ల రమేష్ రాజా
7893230218

## పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని సమగ్రంగా నిర్వహించాలి



**రాజేంద్రనగర్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** నియోజకవర్గంలోని అర్హులైన పట్టభద్రులందరూ ఓటు హక్కును నమోదు చేసుకునేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ ఇన్‌చార్జి కొలన్ సుభాష్ రెడ్డి పిలుపునిచ్చారు. కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్ ఆధ్వర్యంలో బాబుల్ రెడ్డి నగర్‌లోని వెంకటేష్ కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఓటు నమోదు అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా కాలనీల వారీగా నాయకులను నియమించి, క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పట్టభద్రుల ఓటు నమోదు కోసం కృషి చేస్తున్న కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డి. రమేష్ ముదిరాజ్, జె. చిత్తారి, జీవన్ దాస్, ఏ. సూర్యం, మైసి రెడ్డి, బండ రాజేష్ యాదవ్, చిత్తారి వాసు బాబు, మహిళా నాయకురాలు లక్ష్మి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెల్ టవర్ అనుమతులపై సమగ్ర పరిశీలన జరపాలి

- **సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్**



**కీసర, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** నాగారం ప్రాంతంలో చేపడుతున్న సెల్ టవర్ నిర్మాణానికి సంబంధించి వర్తించే నిబంధనలు, అనుమతులపై మున్సిపల్ అధికారులు సమగ్రంగా పరిశీలించాలని సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్ కోరారు. సెల్ టవర్ నిర్మాణానికి సంబంధించి తాము చేస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో, ఇందుస్ టవర్స్ సంస్థ జోనల్ కమిషనర్‌కు లేఖ సమర్పించినట్లు అక్కల సురేష్ కుమార్ ఆదివారం తెలిపారు. అయితే, ఆ లేఖ ఆధారంగా నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులపై నిర్ధారణకు రాకుండా, సంబంధిత రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని అధికారులను కోరారు. భవన నిర్మాణ అనుమతులు, సెల్లార్‌కు సంబంధించిన అనుమతులు, నిర్మాణ భద్రత, వర్తించే నిబంధనలపై సంబంధిత అధికారులు పరిశీలన జరపాలని సూచించారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు నిర్ధారణ అయితే, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై అధికారుల పరిశీలన పూర్తయ్యే వరకు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని కోరారు. సెల్ టవర్ నిర్మాణానికి సంబంధించి తమ విజ్ఞప్తికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలిపిన వారికి సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## తొండుపల్లి చెరువు కాలుష్యంపై విచారణ చేపట్టాలి

- **ఓబీసీ మోర్చా కార్యదర్శి బైతి శ్రీధర్**



**శంషాబాద్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** తొండుపల్లి చెరువులోకి మురుగునీరు చేరుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, జలవనరుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి బైతి శ్రీధర్ కోరారు. సమీప గ్రామాలు, ప్రైవేటు గోదాముల నుంచి వ్యర్థజలాలు చెరువులోకి చేరుతున్నాయన్న ఆరోపణలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని సూచించారు. అలాగే శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు, గోదాములకు సంబంధించిన అనుమతులు, 111 జీవో నిబంధనల అమలుపై తనిఖీలు నిర్వహించాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, చెరువు కాలుష్యానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

## కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయం



**ముషీరాబాద్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** రైతాంగ హక్కుల సాధన కోసం కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు, ప్రధాన కార్యదర్శి టి. సాగర్ మాట్లాడారు. రైతాంగాన్ని సంఘటితం చేయడంలో, రైతుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, లోటు వర్షపాతం కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఆహార పంటలకు ఎకరాకు రూ.30 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు మద్దతుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కరువు మండలాలను ప్రకటించి కేంద్ర బృందాన్ని ఆహ్వానించి సహాయం పొందాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, నాయకులు పి. జంగారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, కందాల ప్రమీల, ఉడత రవీందర్, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత సమాజంతోనే వికసిత భారత్ సాధ్యం

**ముషీరాబాద్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** మాదకద్రవ్యాల రహిత, ఆరోగ్యకరమైన భారతదేశ నిర్మాణంతోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించిన వికసిత భారత్ సాధ్యమవుతుందని బీజేపీ జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, రాజ్యసభ ఎంపీ డా. కె. లక్ష్మణ్ అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని బాగ్లింగంపల్లి సుందరయ్య పార్క్ నుంచి అశోక్‌నగర్ చౌరస్తా వరకు 'అక్షరస్ఫూర్తి' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నశా ముక్త్ భారత్ సైక్లింగ్ రైడ్' ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. కె. లక్ష్మణ్ సైకిల్ ర్యాలీని ప్రారంభించడంతో పాటు సైక్లిస్టులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని మాదకద్రవ్యాల మాఫియా విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. డ్రగ్స్‌కు బానిసలవుతున్న కారణంగా అనేక పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు.



భావితరాలను మత్తు పదార్థాల బారి నుంచి కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు.

### నార్కో టెర్రరిజంపై కేంద్రం ఉక్కుపాదం

దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసి, అభివృద్ధిని అడ్డుకునేందుకు డ్రగ్స్ స్మగ్లింగ్, నార్కో టెర్రరిజం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డా. లక్ష్మణ్ అన్నారు. మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం ద్వారా సమకూరుతున్న నిధులు ఉగ్రవాద, దేశవ్యతిరేక కార్యకలాపాలకు వినియోగమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నేరపూరిత నెట్‌వర్క్‌లను కూలదోసేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానంతో ముందుకు సాగుతోందని తెలిపారు. 2029 నాటికి దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యూహాలతో పనిచేస్తోందని పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే యువత ఆరోగ్యంగా, బాధ్యతాయుతంగా ఎదగడం అత్యంత అవసరమన్నారు.

### తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

హైదరాబాద్ నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని డా. లక్ష్మణ్ కోరారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సైకిల్ రైడర్స్ మూర్తి శశాంక్ రెడ్డి,మనోజ్ సాయి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తొమ్మిది గంటల నిరంతర కూచిపూడి నృత్య ప్రదర్శన అభినందనీయం



**అమీర్‌పేట్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ఎంతో గొప్పవని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో లాలి నిధి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తొమ్మిది గంటల నిరంతర కూచిపూడి నృత్య ప్రదర్శనకు ఆయన హాజరయ్యారు. లాలి నిధి, ఆమె బృందం ప్రదర్శించిన నృత్యాలను తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. విదేశాల్లోనూ మన సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో గౌరవం లభిస్తుంటే, మన దగ్గర కొందరు వాటిని పాటించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం సైతం సంప్రదాయ కళలను ప్రోత్సహించాలని సూచించారు. చిన్నతనం నుంచే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కూచిపూడి, ఇతర నృత్య కళల్లో రాణిస్తూ లాలి నిధి అనేక అవార్డులు సాధించడం అభినందనీయమన్నారు. ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి చేతుల మీదుగా 'లాలి' బిరుదు అందుకున్న నిధి, అనంతరం లాలి నిధి అకాడమీని స్థాపించి ఎంతోమందికి కూచిపూడి నృత్యంలో శిక్షణ అందించడం ప్రశంసనీయమన్నారు. తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా నృత్య ప్రదర్శన నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ ప్రోత్సహించాలని కోరారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు స్వర్ణ, వెంకటేష్ దంపతులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టి. శ్రీహరి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## పీరం చెరువును కాపాడాలి



**రాజేంద్రనగర్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతుండటంతో జలవనరుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకప్పుడు ప్రజలకు ఉపయోగపడిన చెరువులు నేడు అక్రమ నిర్మాణాలతో కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. చెరువులను సంరక్షించాల్సిన అధికారులు ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుకోళ్ళ నాగరాజు పేర్కొన్నారు.పీరం చెరువులోని పలు సర్వే నంబర్ లలో సుమారు పది ఎకరాల వరకు పదుల సంఖ్యలో బిల్డర్లు ఆక్రమణలకు పాల్పడి, భారీ ఎత్తున భవనాలు నిర్మించి సొమ్ము చేసుకున్నారని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. చెరువు భూములు కబ్జాలకు గురవుతున్నా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు పరిధిని గుర్తించి, వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావడానికి హైడ్రా అధికారులు తక్షణమే రీ సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. చెరువు భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను గుర్తించి, వాటిని తొలగించాలని, చెరువు అసలు విస్తీర్ణాన్ని పరిరక్షించాలని కోరారు. చెరువులను కాపాడితేనే భవిష్యత్తులో నీటి వనరులను సంరక్షించడంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, రీ సర్వే ద్వారా చెరువు హద్దులను నిర్ధారించాలి. ఆక్రమణలు నిర్ధారణ అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుని, పీరం చెరువును సంరక్షించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు.

## బర్త్‌డే పార్టీపై పోలీసుల దాడి



**మొయినాబాద్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** కనకమామిడి గ్రామ శివారులోని మ్యాంగో వుడ్ ఫామ్‌హౌస్ విల్లా నంబరు 13లో శనివారం నిర్వహిస్తున్న బర్త్‌డే పార్టీపై మొయినాబాద్ పోలీసులు దాడి చేశారు. అక్కడ గంజాయి, మద్యం సేవిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై వెంకన్న సిబ్బందితో కలిసి పంచుల సమక్షంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆరుగురు వ్యక్తులు పార్టీ చేసుకుంటున్నట్లు గుర్తించారు. వారిలో ఐదుగురిని విచారించి ప్రాథమిక మూత్ర పరీక్షలు నిర్వహించగా.. బీహార్‌కు చెందిన డ్యాన్స్ టీచర్ బిషు కుమార్ (25)కు గంజాయి వినియోగానికి సంబంధించిన టీహెచ్ సీ పరీక్షలో పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన నలుగురి పరీక్షల్లో నెగిటివ్‌గా వచ్చిందని వెల్లడించారు.

## హైదరాబాద్‌లో ఘనంగా అలయ్ బలయ్ కార్యక్రమం



**హైదరాబాద్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** హైదరాబాద్ జిల్లా పీఈటీఏ-టీఎస్, హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లాలోని వివిధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, ఉన్నతాధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జేడీ సోమిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కే. శ్రీనివాస్ గౌడ్, పీఈటీఏ-టీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కట్ట శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## జలమండలి జేడీ కారులో రూ.2.40 లక్షలు

**ఖైరతాబాద్, అక్టోబరు 25 (జనం సాక్షి) :** జలమండలి జాయింట్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్ ప్రయాణిస్తున్న కారులో లెక్కల్లో చూపని రూ.2.40 లక్షల నగదును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ రోడ్డులో శనివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో ఈ నగదు లభించినట్లు అధికారులు వెల్లడించారు. నగదుకు సంబంధించిన వివరాలపై ఆరా తీసిన అధికారులు, తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపు పన్ను శాఖకు సమాచారం అందించారు.ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి వద్ద అక్రమంగా సంపాదించిన నగదు ఉందన్న సమాచారం అందడంతో సిటీ రేంజ్--2 బృందం నిఘా పెట్టింది. ఈ క్రమంలో శనివారం రాత్రి సుమారు 7 గంటలకు రాజ్‌భవన్ రోడ్డులోని మెట్రో రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా మారుతి స్విఫ్ట్ (టిఎస్08 జీ క్యూ 3699)కారును అధికారులు ఆపి తనిఖీ చేశారు. ఆ వాహనం జాయింట్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్‌కు చెందినదిగా గుర్తించారు. తనిఖీల్లో రూ.2,40,000 నగదు లభించడంతో దాని మూలాలపై అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. నగదుకు సంబంధించి ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని ఏసీబీ వర్గాలు తెలిపాయి. దీంతో నగదును పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తానికి సంబంధించిన లావాదేవీలు, మూలాలపై తదుపరి విచారణ కొనసాగనుంది. అవినీతి నిరోధక శాఖ ఈ వ్యవహారంపై విచారణ చేపట్టడంతో పాటు ఆదాయపు పన్ను శాఖకు సమాచారం అందించినట్లు వెల్లడించింది. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడినట్లు సమాచారం ఉన్నా ఏసీబీకి ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచించారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నంబరు 1064, వాట్సాప్ నంబరు 9440446106 ద్వారా సమాచారం అందించాలని కోరారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

- **నిబంధనలు పాటిద్దాం.. ప్రాణాలు కాపాడుకుందాం**
- **వాహనదారులకు సీపీ వీసీ సజ్జనార్ ఎనిమిది సూచనలు**



**హైదరాబాద్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. 'నియమాలు పాటిద్దాం.. ప్రాణాలు కాపాడుకుందాం' అనే నినాదంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు కమిషనర్ ఎనిమిది కీలక సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించాలని, వాహనం నడుపుతూ చరవాణి ఉపయోగించవద్దని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సంకేతాలను పాటించడంతోపాటు అతివేగం, ప్రమాదకర డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. పాదచారులను గౌరవించి వారికి దారి ఇవ్వాలని సూచించారు. మీ కుటుంబం మీ కోసం ఎదురుచూస్తోందనే విషయాన్ని గుర్తుంచుకుని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు కేవలం ఆంక్షలు కాదని, ప్రాణాలను కాపాడే మార్గాలని పేర్కొన్నారు. సురక్షిత ప్రయాణమే సంతోషకర జీవితానికి ఆధారమని పోలీసులు ప్రజలకు పిలుపునిచ్చారు.

# రాజ్యాధికారంతోనే ముదిరాజుల సర్వతోముఖాభివృద్ధి

- **నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గంట భిక్షపతి, కావలి నరసింహ**
- **ముదిరాజ్ ఉద్యోగుల దసరా అలయ్ బలాయ్**

**రంగారెడ్డి, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** ముదిరాజ్ కులాన్ని బీసీ-'డీ' నుండి బీసీ-'ఏ' జాబితాలోకి మార్చడానికి ఉన్న అడ్డంకులు, వాటిపై వస్తున్న అభ్యంతరాలపై ప్రభుత్వమే స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు గంట భిక్షపతి డిమాండ్ చేశారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని మంగళ్‌పల్లి సమీపంలో ఉన్న శ్రీ హరివిల్లు రిసార్ట్‌లో నిర్వహించిన 'ముదిరాజ్ ఉద్యోగుల దసరా సమ్మేళనం' (అలయ్ బలాయ్) కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు కావలి నరసింహతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివిధ శాఖల్లో ఉద్యోగులుగా సేవలందిస్తున్న 150 మంది ఒకే వేదికపైకి వచ్చి ఈ అలయ్ బలాయ్ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం శుభ పరిణామమన్నారు. ప్రస్తుతం ముదిరాజులు బీసీ-'డీ' వర్గంలో ఉండటం వల్ల తగినంత విద్యా, ఉద్యోగ అవకాశాలు లభించక ఆర్థికంగా, సామాజికంగా తీవ్రంగా వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజులను బీసీ-'ఏ' లోకి చేర్చడం ద్వారానే రాష్ట్రంలోని ప్రతి ముదిరాజ్ కుటుంబం ఆర్థికంగా, రాజకీయంగా ముందడుగు వేయడానికి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాజ్యాధికార సాధనతోనే ముదిరాజుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు జిలమోని సత్తయ్య, కావలి వెంకటేష్,



ఉద్యోగ సంఘాల నాయకులు యార కృష్ణ, యాచారం మండల ముదిరాజ్ నాయకులు వెంకటేష్, రామచంద్రయ్యలతో పాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, సంఘ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల మహా పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే



**రామచంద్రాపురం, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** బీహెచ్ఈఎల్‌లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి శబరిమలలోని శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధానం వరకు అయ్యప్ప స్వాములు చేపట్టిన మహా పాదయాత్రను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు ఈ మహా పాదయాత్రను చేపట్టారు. బీహెచ్ఈఎల్ అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి శబరిమల సన్నిధానం వరకు సాగనున్న ఈ యాత్రలో స్వాములు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి మాలధారణ భక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మనిగ్రహాన్ని అలవర్చుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. స్వామివారిపై అచంచలమైన భక్తివిశ్వాసాలతో చేపట్టే పాదయాత్ర భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుందని తెలిపారు. కఠిన నియమ నిష్ఠలతో సాగే అయ్యప్ప దీక్ష భక్తుల్లో సాత్విక భావాలను పెంపొందిస్తుందని అన్నారు. అయ్యప్ప స్వాముల మహా పాదయాత్ర విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. స్వాములు యాత్రను భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో కొనసాగిస్తూ స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, అయ్యప్ప స్వామి మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోదీ సర్కారు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- నవంబర్ 1న ఢిల్లీలో మహాధర్నా..
- కాంగ్రెస్ శ్రేణులకు డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి పిలుపు
- కరువుపై బీఆర్ఎస్ ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని, ప్రభుత్వ విధానాలు, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల సాధన కోసం ఏఐసీసీ ఆధ్వర్యంలో నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం నిర్వహించిన వనపర్తి జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాధర్నాకు వనపర్తి జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

### పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని శివసేన రెడ్డి సూచించారు. ప్రతి మండలం నుంచి 500 మంది పట్టభద్రులను, ప్రతి మున్సిపాలిటీ నుంచి 800 నుంచి 1,000 మంది వరకు ఓటర్లుగా నమోదు చేయించేలా లక్ష్యాలను




నిర్దేశించుకోవాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామాలు, మండలాల్లో పూర్తిస్థాయి కమిటీల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల్లోని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లా కమిటీకి నివేదికలు సమర్పించాలని మండల అధ్యక్షులకు సూచించారు. గ్రామ, మండల స్థాయి సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించడంతోపాటు సమావేశాల్లో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలు, వాటి పురోగతిని ఫొటోలతో సహా జిల్లా కార్యాలయానికి పంపాలని స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాల నివేదికలను టీపీసీసీకి సమర్పించాలని తెలిపారు. వచ్చే నెలలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### కరువుపై బీఆర్ఎస్ ప్రచారం హాస్యాస్పదం

స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల వైఖరిపై విమర్శలు చేశారు. గత 12 ఏళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలను కాంగ్రెస్ నాయకులు ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో చర్చ జరగాలని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ప్రజల ముందుంచాలని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కరువు పరిస్థితులపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం హాస్యాస్పదంగా ఉందని మేఘారెడ్డి విమర్శించారు. ప్రపంచంలోని పలు ప్రాంతాలు కరువు, నీటి కొరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో తెలంగాణలోనే కరువు పరిస్థితులు ఉన్నట్లు చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కరువు పరిస్థితుల్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, తాగునీటిని పొదుపుగా వినియోగించడం, పశు సంపదను, ప్రకృతిని కాపాడుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రజా సమస్యలపై రాజకీయాలు చేయడం కంటే ప్రజలకు అండగా నిలవడమే ముఖ్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ప్రతిపక్షాల ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని ఎమ్మెల్యే అన్నారు. గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించాలని, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తూ రానున్న రాజకీయ కార్యక్రమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అయూబ్ ఖాన్, వనపర్తి మండల అధ్యక్షుడు నక్క రవికిరణ్, జిల్లా అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, జిల్లా నాయకులు బోయజ్, నరహరి, విష్ణు ముదిరాజ్, శ్రీలత రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# విధులు నిర్వహిస్తున్నా..వేతనాలు రావట్లేదు..!

- ప్రీ ప్రైమరీ పాఠశాలల టీచర్లకు ఆర్థిక ఇబ్బందులు
- నిధులు విడుదలైనా ఖాతాల్లో జమకాని నెలసరి వేతనాలు..
- ఆందోళనలో ప్రీ ప్రైమరీ,స్కూల్ టీచర్లు, ఆయాలు
- ప్రతినెల మొదటి తేదీన ఖాతాలో వేతనాలు జమచేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

**మహమ్మదాబాద్,అక్టోబర్ 25 (జనంసాక్షి) :** ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ఎల్ కేజీ,యూకేజీ,నర్సరీ,చిన్నారులకు విద్యబోధనలు విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలకు, ఆయాలకు, నెలసరి వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అరకొర వేతనాలతో కుటుంబాలను పోషించుకోవాల్సిన ఉపాధ్యాయురాలకు నెలల తరబడి జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఆరు నెలలకోసారి వేతనాలు చెల్లిస్తే నిత్యావసర ఖర్చులు,ఇంటి అవసరాలు ఎలా తీర్చుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహమ్మదాబాద్ మండల పరిధిలో మొత్తం




08,ప్రీప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు నెలసరి వేతనాలు సకాలంలో అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ,సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో.. ఉపాధ్యాయుల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ కావడం లేదని తెలుస్తోంది. దీంతో విధులు నిర్వహిస్తున్నా,వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ప్రీ ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులకు జీతాల జాప్యం మరింత భారంగా మారింది.

### ప్రీ ప్రైమరీలో బోధిస్తున్న వారి వేతనాలు చెల్లించండి..



ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న, ఉపాధ్యాయురాలకు, ఆయాలకు పెండింగ్ ఉన్న వేతనాలను వెంటనే వారి ఖాతాల్లో జమచేయాలి అధికారులను కోరారు. నెలకు రూ. 8,వేలు,ఆయాలకు రూ. 6వేల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు బకాయిలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తిచేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ వేతనాలు కూడా నెలల తరబడి అందకపోతే కుటుంబాలను ఎలా పోషించాలని,ఆవేదన చెందుతున్నారు. ప్రతినెల మొదటి తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని,విధులకు ఆటంకం కలగకుండా తమ ఆర్థిక,ఇబ్బందులను పరిష్కరించాలని,ప్రభుత్వాన్ని కోరారు.

**మౌనిక, గాధిర్యాల్ ఫ్రీ ప్రైమరీ స్కూల్ టీచర్**

## సంగారెడ్డిలో 'స్వేచ్ఛారథం' ప్రచార వాహనం ప్రారంభించిన అదనపు కలెక్టర్



**సంగారెడ్డి, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కులు, బాధితులకు అందుబాటులో ఉన్న రక్షణ, పునరావాస సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛారథం' ప్రచార వాహనాన్ని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వెట్టిచాకిరీని నిషేధిస్తూ చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ, అక్కడక్కడా ఇటువంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. బాధితులను గుర్తించి రక్షించడం, పునరావాసం కల్పించడం, వారికి న్యాయం జరిగేలా చూడటంలో జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. ప్రచార వాహనం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ వ్యవసాయం, ఇటుక బట్టీలు, గనులు, క్వారీలు, చేపల పెంపకం తదితర రంగాల్లో పనిచేసే కార్మికులకు వెట్టిచాకిరీ గుర్తింపు, ఫిర్యాదు విధానాలు, కార్మిక హక్కులపై అవగాహన కల్పించనుంది. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదుల కోసం 080-69434343 టోల్‌ఫ్రీ సహాయవాణి నంబరును సంప్రదించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఉప కార్మిక కమిషనర్ ఎం. యాదయ్య, సహాయ కార్మిక కమిషనర్ డి. సాహితి, కార్మిక శాఖ అధికారులు, డీఎస్పీ సత్తయ్య, పోలీసు శాఖ, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, బాలల సంక్షేమ కమిటీ, అంతర్జాతీయ న్యాయ సంస్థ ప్రతినిధులు, ఇతర స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## అభివృద్ధి జీర్ణించుకోలేక సంఘవిద్రోహ శక్తులతో కలిసి కాంగ్రెస్ కుట్రలు

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** భారత దేశం ప్రపంచ దేశాలను అధిగమించే అభివృద్ధిని జీర్ణించుకోలేని కాంగ్రెస్ దేశ విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలిపి కుట్రలు చేస్తున్నదని పాల మూరు పార్లమెంట్ ఎంపి డి కే అరుణ అన్నారు. ఆదివారంకొండంగల్ నియో జకవర్గంలో దౌల్తాబాద్ మండలం గోకఫసాల్ వాద గ్రామంలో ప్రధాన మంత్రి 139వ మాన్ కీ బాత్ కార్య క్రమం స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, రతంగ్ పాండు రెడ్డి, పగడాకుల శ్రీనివాస్, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్, ప్రతాప్ రెడ్డి, పూనంచంద్ లహుటి, కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షులు అశోక్, సతీష్, బస్వరాజు, కేశవ రెడ్డి, శంకర్,బుగ్గప్ప,మురళీధర్,రాజశేఖర్, మహబూబ్ అలీ, కేశవ్ రెడ్డి,రాఘవేంద్ర, భాస్కర్, వివిధ మండలాల ముఖ్య నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ త్వరలో గ్రామ గ్రామాన పర్యటించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నా నన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఉత్పత్తి అవు తున్న ఉత్పత్తులు, వస్త్రా ల,వస్తువుల విశేషాల గురించి దేశం మొత్తానికి మన్ కీ బాత్ లో తెలియ జేస్తున్నారన్నారు. భారతదేశం వైపు ప్రపంచ దేశాలు



చూసేలా పరిపాలన నరేంద్ర మోదీ గారు చేస్తున్నారు. దీనిని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక పోతుంద నారు. ప్రధాన మంత్రి గా నరేంద్ర మోదీ భారతదేశ ఆర్థిక వ్యవస్థను 4వ స్థానంలో నిలబెట్టారన్నారు. విదేశీ వేదికల పై భారతదే శాన్ని కించపరిచేవిధంగా రాహుల్ గాంధీ మాట్లాడు తున్నారనీ విమర్శించారు. వికాసిత్ భారత్ లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ గారు పని చేస్తున్నారు. దేశ విచ్ఛిన్నం కోరుకునే వారితో కలసి రాహుల్ గాంధీ నడుస్తున్నారన్నారు. సర్ ప్రక్రియ మొదటి సారి జరుగుతుంది కాదనీ ఇప్ప టికి 8 సార్లు జరిగింద న్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఓటు చోరీ చేసి వచ్చిందా.? రాహుల్ గాంధీ చెప్పాలనీ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ చేసే అబ ద్ధపు ప్రచారం ప్రజలు గమనిస్తున్నారని ఆపార్టీకి మరింత బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

## దళితులపై దాడులు చేసిన వారిని అరెస్ట్ చేయాలి

**శివ్వంపేట, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** దళితులపై దాడులు చేసి, కులవివక్షత పాటించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని లేదంటే తుప్రాన్ డీఎస్పీ కార్యాలయం ముట్టడిస్తామని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు యం. అడివయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం లు హెచ్చరించారు. బతుకమ్మ పండగ సందర్బంగా శివ్వంపేట మండలం నవాబ్ పేట గ్రామంలో దాడికి గురైన దళితులను కేవీపీఎస్, సీఐటీయూ ప్రతినిధి బృందం కలిసి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా అడివయ్య, మల్లేశం మాట్లాడుతూ అక్టోబర్ 18 న బతుకమ్మ ఉత్సవాల సందర్బంగా మనోహరాబాద్ మండలం కొనయిపల్లి, కుచారం, తుప్రాన్ మండలం కిష్టాపూర్, శివ్వంపేట మండలం నవాబ్ పేట గ్రామాలలో దళితులపై దాడులు జరిగాయని, అందులో కులవివక్షత పాటించారని ఆవేదన వ్యక్తం చేశారు. నవాబ్ పేట్ గ్రామంలో బతుకమ్మ రోజు చంది సాయిలు, చంది సన్నీ కుమార్ లపై విష్ణు వర్ధన్ రెడ్డి, హరిగౌడ్, రవిగౌడ్ లు దాడి చేసి 7 రోజులు అవుతున్న పోలీసులు ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని వారు ప్రశ్నించారు. కేసు నమోదు చేసి నిందితులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని, శివ్వంపేట్ ఎస్ఐ నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నవాబ్ పేట్ గ్రామంలో దళితులైన డప్పు కళాకారునికి గొంతుపై గాయాలు అయ్యాయని, గొంతుపిసికి దాడి



చేసిన గాని చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకువడం లేదని, దళితుల ప్రాణాలు అంటే లెక్కలేదా అని ప్రశ్నించారు. నవాబ్ పేటలో జరిగిన దాడిపై వెంటనే ఎస్సీ, ఎస్ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 18 న పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయలేదని అన్నారు. దళితులపై దాడులు జరుగుతున్న దళిత మంత్రి దామోదర్ రాజనరసింహ, జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి ఎందుకు స్పందించడం లేదని వారు మండిపడ్డారు. తుప్రాన్ సబ్ డివిజన్ పరిధిలో జరిగిన దాడులపై జిల్లా ఎస్పీ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నిందితులను అరెస్ట్ చేయడంలో జాప్యం జరిగితే తుప్రాన్ డీఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు చంది సాయిలు, చంది సన్నీ కుమార్, గ్రామస్థులు కిషన్, శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు జరపాలి

- పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటిన ఐజి చంద్రశేఖర్

**తూప్రాన్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని మల్టీ జోన్1 ఐ జి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తూప్రాన్ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని మల్టీ జోన్--1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐజీకి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఐజీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం కార్యాలయ రికార్డులు, క్రైమ్ రిజిస్టర్లు, పెండింగ్, దర్యాప్తు, ట్రయల్ దశలో ఉన్న కేసుల వివరాలను సమీక్షించారు. గ్రేవ్, పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి కేసులో నిర్దేశిత ఎస్ఓపీని పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఐసీజేఎస్



వ్యవస్థ పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని, ఈ-సాక్ష్య ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని, నిర్ణీత గడువులోగా ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని స్పష్టం చేశారు. దొంగతనాల నివారణకు రాత్రి గస్తీ, వాహన తనిఖీలు ముమ్మరం చేసి, అనుమానితులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ అయిన నిందితులను త్వరగా గుర్తించి కోర్టులో హాజరుపరచాలన్నారు. డీఎస్పీలు ప్రతి నెల కనీసం రెండు పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసి, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారాన్ని సమీక్షించాలని సూచించారు. కార్యాలయాల్లో 5ఎస్ విధానాన్ని అమలు చేస్తూ రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఐజీ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ , డిఎస్పి నరేందర్ గౌడ్, సీఐ లు వెంకట రాజా గౌడ్, సైదా నాయక్ , ఎసై లు గంగరాజు, సుభాష్ గౌడ్, శివనందం, మధుకర్, రాజేష్,కరుణాకర్ రెడ్డి, సృజన,యాదగిరి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను సహించేది లేదు



**తూప్రాన్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** మండలంలోని రావెల్లి గ్రామ పరిధిలో గల సర్వే నంబర్ 235, ప్రభుత్వ భూమి(గీత రెడ్డి కాలనీ ప్రభుత్వ పాఠశాల పక్కన)లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ ఆదేశాల మేరకు తొలగించడం అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూప్రాన్ మండల పరిధిలోని ఏ గ్రామంలోనూ ప్రభుత్వ భూములను ఆక్రమించడం లేదా వాటిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలకు ఎవరూ పాల్పడరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ శాఖ నిరంతరం చర్యలు చేపడుతుందని తెలిపారు. ఇట్టి అక్రమ నిర్మాణం తొలగించడంలో గిర్ధవర్ తూప్రాన్ తో పాటు జిపిఓ లు నాగరాజు, బాబు మరియు రమేష్ లు పాల్గొన్నారు.

# వరంగల్- ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకం

- ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు ప్రక్రియలో ముందుండి పనిచేయాలి
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరవేయాలి
- కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ఆత్మకూర్, అక్టోబర్ 25 (జనం సాక్షి):** ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ లోని శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద గల జి ఎస్ ఆర్ గార్డెన్ లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, ఎండి ఆయూబ్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కక్కిరేని శ్రీనివాస్, పరకాల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకమని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని పరకాల నియోజకవర్గం నుండి అత్యధిక మెజారిటీ అందించి గెలిపించుకుందాం అన్నారు. అందుకు ప్రతి కార్యకర్త గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు ప్రక్రియలో ముందుండి పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల కోసం విద్యావంతుల కోసం తీసుకుంటున్న విప్లవత్మక నిర్ణయాలను రికార్డు స్థాయి ఉద్యోగ నియామకాలను గ్రాడ్యుయేట్స్ లోకి బలంగా తీసుకెళ్లాలి అన్నారు. సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని, ప్రత్యర్థుల అబద్దాలను తిప్పి కొట్టాలన్నారు. పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బూతు స్థాయి నుండి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. గ్రాడ్యుయేట్స్ కు ఓటర్ నమోదు కేంద్రం హెల్ప్ డెస్కను మండలాల వారిగా ఏర్పాటు చేసామని అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగింపుకు వ్యతిరేకంగా నవంబర్ 1న తెలంగాణ కాంగ్రెస్ చేపట్టిన చలో ఢిల్లీ నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇల్లు, రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం, సన్న బియ్యం, తదితర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో గల ఫ్రంట్ ఆర్గనైజేషన్ కమిటీలను త్వరలో పూర్తిస్థాయిలో నియమిస్తా మన్నారు. ఎల్ నినో వల్ల వచ్చే పరిణామాలు, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

# కరువుపై బీఆర్ఎస్‌ది రాజకీయ డ్రామా

- కాళేశ్వరం నిర్మాణ లోపాలకు బాధ్యత వహించాల్సింది కేసీఆర్ కుటుంబమే..
- కరువు నివారణకు ఉపాధి హామీ ద్వారా రూ.50 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు సిద్ధం..
- రైతుల పంటలను కాపాడేందుకు అదనపు విద్యుత్ సరఫరాకు చర్యలు..



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** కరువు పరిస్థితులను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటూ బీఆర్ఎస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమంటూ ఆ పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజల్లో అపోహలు సృష్టించి తిరిగి అధికారంలోకి రావాలన్నదే బీఆర్ఎస్ లక్ష్యమని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ లోపాలకు కేసీఆర్ కుటుంబం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా వర్షాలు సకాలంలో కురవకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా, రాష్ట్రంలో కరువుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమంటూ బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

### రైతుల పంటల పరిరక్షణకు చర్యలు..

కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. కరువు నివారణ పనుల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.50 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పంటలు ఎండిపోకుండా రైతులకు అవసరమైన అదనపు విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రాధాన్యమని, కష్టకాలంలో వారికి అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

### కాళేశ్వరం వైఫల్యాలకు బాధ్యత ఎవరిది?

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, వ్యయంపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో వెలుగుచూసిన నిర్మాణ లోపాలకు బాధ్యత వహించాల్సిన అవసరం కేసీఆర్ కుటుంబంపై ఉందని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణానికి వెచ్చించిన నిధులు, అంచనాలు, పనుల నాణ్యతపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని అన్నారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని, అదే సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల సమస్యలను వాడుకోవడం సరికాదని గండ్ర సత్యనారాయణరావు పేర్కొన్నారు. రైతులకు భరోసా కల్పించడం, పంటలను కాపాడటం, కరువు ప్రభావాన్ని తగ్గించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంకెన పాఠశాలకు కూతవేటు దూరంలోనే
# విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

- పట్టించుకోని ఎక్సైజ్, విద్యాశాఖ అధికారులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు



**పలిమెల, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన విద్యాలయాలు సాక్షిగా మత్తు మహమ్మారి కోరలు చాస్తోంది. చదువుకోవాల్సిన బడికి కూతవేటు దూరంలోనే అక్రమ బెల్ట్ షాపులు పుట్టగొడుగులా వెలిశాయి. నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా సాగుతున్న ఈ మద్యం అమ్మకాలపై ఏ ఒక్క అధికారికీ చీమ కుట్టినట్టయినా లేకపోవడం గమనార్హం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం పంకెన గ్రామ పరిధిలోని పాఠశాలకు అతి సమీపంలో రెండు బెల్ట్ షాపులు నిత్యం దర్జాగా వ్యాపారం సాగిస్తున్నాయి. పాఠశాల ప్రారంభ వేళల్లోనూ, విద్యార్థులు రాకపోకలు సాగించే ప్రధాన దారుల పక్కనే ఈ దుకాణాలు నడుస్తుండటంతో చిన్నారులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యాసంస్థలు, ప్రార్థనా మందిరాలు, ఆసుపత్రులకు నిర్దిష్ట దూరంలో మాత్రమే మద్యం విక్రయాలు జరగాలి. ఏ ప్రాంతంలోనూ అనధికారిక బెల్ట్ షాపులకు అస్సలు తావులేదని చట్టాలు చెబుతున్నాయి. కానీ, పంకెనలో మాత్రం ఈ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. పాఠశాలకు అత్యంత సమీపంలోనే బెల్ట్ షాపులు వెలవడం పట్ల స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రహరీకి చేరువలో వాతావరణం ఇలా ఉంటే, విద్యార్థులు ఎలాంటి నైతిక విలువలు నేర్చుకుంటారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల మౌనం వెనుక మర్మమేంటి?

గ్రామాల్లో బెల్ట్ షాపుల మూతకు సంబంధించి ప్రభుత్వాలు, ఉన్నతాధి కారులు కఠిన ఆదేశాలు జారీ చేస్తున్నప్ప టికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పర్యవేక్షణ శూన్యంగా మారింది. ఎక్సైజ్ శాఖ అధికారుల ఉదాసీన వైఖరి కారణంగానే నిర్వాహకులు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. కళ్లముందే చదువుల గుడికి సమీపంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నా, అటువైపు కన్నెత్తి చూసేందుకు కూడా అధికారులు సాహసించకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ అదేవిదంగా సంబంధిత ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు స్పందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల సమీపంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న ఆ రెండు బెల్ట్ షాపులను తక్షణమే సీజ్ చేసి, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



## నంద పహాడ్ శివారులో గంజాయి కొమ్మలు లభ్యం

**కుబీర్, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** కుబీర్ మండలంలోని నంద పహాడ్ గ్రామ శివారులో గంజాయి కొమ్మలు లభించడం కలకలం రేపింది. ఆదివారం ఓ షెడ్‌పై గంజాయి కొమ్మలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో గాలిసింగ్ తండాకు చెందిన వ్యక్తికి సంబంధం ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఏఎస్పీ సాయికిరణ్, భైంసా రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, కుబీర్ ఎస్సై కృష్ణారెడ్డి ఈ వివరాలు తెలిపారు.

## నేత్ర, అవయవదానానికి ముందుకు రావాలి



**బెల్లంపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** అపోహలు వీడి నేత్రదానానికి ముందుకు రావాలని జనహిత సేవాసమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ పిలుపునిచ్చారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణం అశోక్ నగర్ కు చెందిన ఇరుముల్ల శ్రీనివాస్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరుముల్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా నేత్ర దానం చేయడం అభినందనీయం అన్నారు. నేత్రదాత ఇరుముల్ల శ్రీనివాస్ కుమారులు ఇరుముల్ల జోషువా, సురేష్ సోదరుడు ఇరుముల శేఖర్, కుటుంబ సభ్యులని అభినందించి ప్రశాంస పత్రం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఇప్ప రవి, ఉపాధ్యక్షుడు కందుల రాజన్న, ప్రచార కార్యదర్శి, నేత్రదాన కమిటీ బాధ్యుడు డోలి సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులు పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 25 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన పీఎం రహత్ పథకాన్ని అర్హులైన బాధితులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో మొత్తం 63 ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత నిబంధనలకు అనుగుణంగా రూ. 1.5 లక్షల వరకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు సీపీ తగు సూచనలు చేశారు రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు కాల్ చేయాలి. క్షతగాత్రులను వీలైనంత త్వరగా సమీపంలోని ఎంప్యానెల్డ్ ఆసుపత్రికి తరలించేలా సహకరించాలి. పథకం కింద వైద్య సేవలు పొందేందుకు ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించి, అవసరమైన వివరాలను అందించాలి. ప్రమాద బాధితులకు సహాయం చేయడంలో మానవతా దృక్పథంతో వ్యవహరించి, పోలీసులకు మరియు వైద్య సిబ్బందికి సహకరించాలి. రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, ప్రజలు పీ.ఎం.రహత్ పథకంపై అవగాహన పెంపొందించుకుని అర్హులైన బాధితులకు ఈ పథకం ప్రయోజనాలు అందేలా సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

# దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- స్వేరోస్ సర్కిల్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మంద శ్యామ్
- బాధితులను ఫోన్లో పరామర్శించిన స్వేరోస్ రాష్ట్ర ఫౌండర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**చెన్నారావుపేట, అక్టోబర్ 25( జనం సాక్షి):** దళితులను కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన అగ్రకులాల వారిని కఠినంగా శిక్షించాలని స్వేరోస్ సర్కిల్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మంద శ్యామ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో దాడికి గురైన దళితులను పరామర్శించారు. అలాగే స్వేరోస్ ఫౌండర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫోన్లో బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దసరా వేడుకల సందర్భంగా అగ్ర కులాలకు చెందిన దొనకొండ కర్ణాకర్ రెడ్డి, రెండెడ్ల భరత్ రెడ్డి, శరత్ రెడ్డి, చింతకింది దినేష్, తాటికొండ రాకేష్ లు దళితులైన బొమ్మెర కొమ్మాలు, నవిండ్ల మల్లయ్య, ఎల్దొండ మల్లయ్య, పులి సాంబయ్యలను కులం పేరుతో దూషిస్తూ దాడి చేయడం న్యాయం కాదన్నారు. దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అగ్రకులాలకు చెందిన కొంత మంది కావాలని ఎస్సీ, ఎస్టీ కేసును నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దళితులకు స్వేరోస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని అభయమి చ్చారు. దళిత బాధితులకు న్యాయం జరగకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా ఇన్చార్జి మారపల్లి మనోజ్ కుమార్, స్వేరోస్ సమ్మేళనం నర్సంపేట నియోజకవర్గ కో కన్వీనర్లు జెరిపోతుల వెంకటేశ్వర్లు, కొడారి రవి, స్వేరోస్ నర్సంపేట కన్వీనర్ కల్లెపెల్లి సురేష్, చిరంజీవి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# చెరువుకు కన్నం



**పెద్దవంగర అక్టోబర్ 25(జనం సాక్షి) :** రైతులు పంటలు పండించడానికి భూగర్భ జలాల వృద్ధికి సాధారణంగా చెరువులు, కుంటలు అవసరం. ఎన్నో ఏళ్ల క్రితం రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి నిలువ ప్రాంతం మరియు సామర్థ్యాన్ని చూసుకొని చెరువులను నిర్మించారు. ప్రజల అవసరాలు భూగర్భ జలాల వృద్ధికి ప్రణాళికబద్ధంగా కాకతీయుల కాలంలో గొలుసు విధానంలో చెరువులు తోడించారు. చెరువులు కొన్ని వందల వేల ఎకరాల పంటలకు గాను సాగునీరు అందించే జీవాధారం. అటువంటి జీవాధారమైన పెద్దవంగర మండల కేంద్రంలోని పెద్ద చెరువుకు గండి పడి నీరు వృధాగా పోతోంది. పదుల ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పెద్ద చెరువు కింద దాదాపు వందల ఎకరాల్లో వరి పంట సాగుతోంది. ఎల్నీఓ ప్రభావంతో వర్షాలు లేక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు దానికి తోడు ఎస్సారెస్పీ నీరు కూడా విడుదల కాకపోవడం, అప్పుడో ఇప్పుడో కురిసిన వర్షాలకు చెరువులో నీరు చేరింది. అందువల్ల భూగర్భ జలాల వృద్ధి చెంది ప్రస్తుతం రైతులకు వరి పంట చేతికందే దశలో ఉంది. యాసంగి పంట సాగుకు ఎస్సారెస్పీ నీరు విడుదల కాదన్న తరుణంలో.. చెరువులో ఉన్న నీరు వృధాగా పోవడం వల్ల భూగర్భ జలాల కొరత ఏర్పడుతుందని చెరువుకు కన్నం పడ్డ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా కూడా పట్టించుకోవడంలేదని పలువురు రైతులు వాపోతున్నారు. కన్నం కాస్త పెద్దదిగా మారి తెగిపోయే ప్రమాదం రాకముందే తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి చెరువులో నీటి వృధా పై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు

# ఎల్‌నినోతో తీవ్ర నీటి సంక్షోభం

**పరకాల, అక్టోబర్ 25,(జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తీవ్ర నీటి సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని, నీటి పొదుపు, మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని గందె వెంకటేశ్వర్లు కోరారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, భూగర్భ జలాల విచ్చలవిడిగా వినియోగం వంటి పరిణామాలు భవిష్యత్తులో మానవ మనుగడకు సవాలుగా మారే ప్రమాదం ఉందని పరకాల శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్, పరకాల ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సీడ్స్ అసోసియేషన్ వెల్ఫేర్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిస్థితులు ఏర్పడితే నీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. తాగునీటి కోసం అల్లాడే పరిస్థితులు రాకుండా ఇప్పుడే చర్యలు తీసుకోవాలని సూచించారు.

# బాదం ప్రవీణ్ అరెస్టు..

- ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ ఎన్నికల్లో సంచలనం
- ములుగు జిల్లాలో ఉత్కంఠ రేపిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నికలు



**ములుగు ప్రతినిధి, అక్టోబర్25 (జనం సాక్షి):** ములుగు జిల్లాలో ఆదివారం రోజున జరిగిన రైస్ మిల్లర్స్ ఎన్నిక సాధారణ ఎన్నికలా కనిపించడం లేదు. ఇది ఒక అసోసియేషన్ ఎన్నిక కాదు, రాజకీయ ప్రతిష్టంభనగా మారింది. ఉదయం నుండి జిల్లా కేంద్రంలోనే కాదు. మండలాల్లో కూడా ఇదే చర్చ. రైస్ మిల్లర్ల ఎన్నికల్లో రాజకీయ జోక్యం చోటు చేసుకుందని జిల్లా వ్యాప్తంగా ప్రజలు అనుకుంటున్నారు.

### అసలు తెరవెనుక ఏం జరిగింది..?

ఈ ఎన్నికలో ప్రధానంగా రెండు వర్గాలు పోటీ పడుతున్నాయి. అందులోఒకటి ప్రస్తుత అధ్యక్షుడు బాదం ప్రవీణ్ వర్గం. గత కొన్నేళ్లుగా అధ్యక్షుడిగా ఉన్న బాదం ప్రవీణ్, మిల్లర్ల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముందున్నారు. ధాన్యం సేకరణలో జాప్యం, కస్టమ్ మిల్లింగ్ బిల్లుల పెండింగ్, హమాలీ కూలీల కొరత, ఇలా ప్రతి సమస్యపై ప్రభుత్వానికి లేఖలు రాశారు. వినతిపత్రాలు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోయినా, ఆయన వెనక్కి తగ్గలేదు. అదే ఆయనకు శత్రువులను పెంచింది.

### జాకారం వద్ద ట్విస్ట్... సిఐడినా? టాస్క్ ఫోర్సా?

ఎన్నికలకు ముందు రోజు రాత్రి నుండే వాతావరణం వేడెక్కింది. ఆదివారం ఉదయం జాకారం ప్రాంతంలో లో కాపు కాసి బాదం ప్రవీణ్ తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉండే నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇక్కడే అసలు మిస్టరీ మొదలైంది. వారిని అరెస్ట్ చేసింది ఎవరు? కొందరు సిఐడి పోలీసులు అంటున్నారు. మరికొందరు టాస్క్ ఫోర్స్ పోలీసులు అంటున్నారు. అధికారికంగా మాత్రం ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు. ఒక చిన్న అసోసియేషన్ ఎన్నికకు రాష్ట్రస్థాయి దర్యాప్తు సంస్థలు ఎందుకు రావాలి? ఇది సహజంగానే ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒక రైస్ మిల్లర్ ఎన్నికకు పోలీసులు ఎందుకు? అది కూడా సిఐడి, టాస్క్ ఫోర్స్? ఇది భయపెట్టే కుట్ర. బాదం ప్రవీణ్ మళ్లీ గెలిస్తే తమ అక్రమాలను బయటపెడతాడని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడని కొందరు నాయకులు భయపడుతున్నారు. అందుకే ముందే ఆయన బలాన్ని తగ్గించాలని చూస్తున్నారు. అనే చర్చ జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతోంది.

### ప్రభుత్వానికి ప్రశ్నల వర్షం తప్పదా?

గతంలో బాదం ప్రవీణ్ ప్రభుత్వానికి ఇచ్చిన వినతిపత్రంలో అనేక కీలక అంశాలు ఉన్నాయి. అవి బయటకు వస్తే ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని, అందుకే ఈసారి ఆయనను ఎలాగైనా ఓడించాలని, ఒకవేళ గెలిచే పరిస్థితి ఉంటే ఎన్నికల్లోనే పాల్గొనకుండా చేయాలనే పథకం ప్రకారం ఈ అరెస్టులు జరిగాయని జిల్లా వ్యాప్తంగా ప్రజలు బలంగా నమ్ముతున్నారు. ఈ అరెస్టులతో మిల్లర్లలో భయం నెలకొన్నప్పటికీ, అదే సమయంలో బాదం ప్రవీణ్ పై సానుభూతి కూడా పెరుగుతోంది. అధికార బలంతో ఒక సామాన్య మిల్లర్ నాయకుడిని అణగదొక్కాలని చూస్తున్నారనే భావన ప్రజల్లోకి వెళ్తోంది.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
26 అక్టోబర్ 2026

# డిండి ప్రాజెక్టుకు 0.6 టీఎంసీల నీటి కేటాయింపు హర్షణీయం

- డీకే అరుణ డిండి ప్రాజెక్టు రద్దు వ్యాఖ్యలు సరికాదు
- పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించేందుకు కృషి చేయాలి
- తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** డిండి ఎత్తిపోతల పథకానికి 0.6 టీఎంసీల నీటిని కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. డిండి ప్రాజెక్టును రద్దు చేయాలంటూ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ చేసిన వ్యాఖ్యలు సరికావని పేర్కొన్నారు. ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించకుండా, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా సాధించేందుకు ఆమె కృషి చేయాలని సూచించారు. ఆదివారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో గుత్తా సుఖేందర్ రెడ్డి రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, కృష్ణా జలాల వినియోగం, డిండి, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టులపై మాట్లాడారు. డిండి ప్రాజెక్టుకు నీటి కేటాయింపుతో ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షల నెరవేర్పునకు ముందడుగు పడిందని చెప్పారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి డిండి కీలకం

డిండి ఎత్తిపోతల పథకం కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, దశాబ్దాలుగా ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేవరకొండ, మునుగోడు ప్రాంతాల ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఉద్దేశించిన కీలకమైన ప్రాజెక్టు అని గుత్తా పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు సురక్షితమైన నీటిని అందించడంలో ప్రాజెక్టు ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. నీటి వనరులను ప్రాంతాలవారీగా విభజించి వివాదాలు సృష్టించడం సరైన విధానం కాదన్నారు. ఏ జిల్లా నీరు ఆ జిల్లాలోనే వినియోగించుకోవాలనే వాదనను అన్ని రాష్ట్రాలు అనుసరిస్తే, కర్ణాటక నుంచి తెలంగాణకు చుక్క నీరు కూడా వచ్చే పరిస్థితి ఉండదని వ్యాఖ్యానించారు. ఏఎంఆర్పీ ద్వారా హైదరాబాద్ నగరానికి 30 టీఎంసీల నీటిని అందిస్తున్న విషయాన్ని గుర్తుచేస్తూ, నీటి వినియోగంలో ప్రాంతీయ విభేదాలకు తావివ్వకుండా సమగ్ర రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.

### పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రతిపాదిత సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సుమారు 10 లక్షల ఎకరాలకు నీరందించాలనే లక్ష్యం ఉండగా, 7.78 లక్షల ఎకరాలకు సంబంధించిన సాగునీటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, ఉదయసముద్రం, డిండి, దేవాదుల వంటి ప్రాజెక్టుల ద్వారా 7.58 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, పనులు పూర్తిస్థాయిలో పూర్తి కాలేదన్నారు. గత ప్రభుత్వాలు కృష్ణా బేసిన్‌లోని సాగునీటి ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఖర్చు చేసిన నిధుల్లో సగం కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు కేటాయించి ఉంటే అనేక ప్రాజెక్టులు పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కు ప్రత్యేక ఆయకట్టు లేదని, టన్నెల్ నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా లిఫ్ట్ ద్వారా నీటిని అందించే ప్రతిపాదన ఉందని వివరించారు. ప్రజలకు వీలైనంత త్వరగా సాగునీరు అందించేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను పరిశీలించాలని కోరారు.

### పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా తేవాలి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం ఉండగా, 8.50 లక్షల ఎకరాలకు సంబంధించిన సాగునీటి సదుపాయాలు ఉన్నాయని గుత్తా తెలిపారు. పాలమూరు ప్రాంతంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న వలసలను నివారించాలంటే రైతులకు సాగునీరు అందించడం అత్యంత అవసరమన్నారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే ఆ ప్రాంత రైతాంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎంపీ డీకే అరుణ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలని సూచించారు. తద్వారా అవసరమైన నిధులు సమకూరి, పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### రైతాంగ ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం

నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజలు నీటి కోసం పరస్పరం వివాదాలకు దిగడం వల్ల రెండు ప్రాంతాలకూ నష్టం జరుగుతుందని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఇరు జిల్లాల రైతాంగ ప్రయోజనాలను కాపాడటమే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. రాష్ట్రాల మధ్య జలవనరులకు సంబంధించిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం జరుపుతున్న చర్చలు సఫలమై రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలమైన ఫలితాలు రావాలని ఆకాంక్షించారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతి కోసం నిరంతరం కృషి చేసిన సీపీఐ, సీపీఎం నాయకులతో పాటు వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులను ఆయన అభినందించారు. పార్టీలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల వల్ల నీటి లభ్యతపై ఏర్పడే పరిస్థితులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు అర్థమయ్యేలా వివరించారని తెలిపారు. రాష్ట్రంలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ముఖ్యంగా కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# అనుమానంతో భార్యను హతమార్చిన భర్త అరెస్ట్

- శివన్నగూడెం హత్య కేసులో నిందితుడికి రిమాండ్



**మర్రిగూడ, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెం గ్రామంలో భార్యను హత్య చేసిన కేసులో నిందితుడైన భర్త సుంకరి ఇంద్రయ్య (40)ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భార్య సుంకరి రజిత అలియాస్ అనిత (35)పై అక్రమ సంబంధం ఉందనే అనుమానంతోనే ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసుల సమాచారం. గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నాంపల్లి సీఐ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం న్యాయపరమైన ప్రక్రియలో భాగంగా రిమాండ్‌కు తరలించారు.

### పోలీసు బృందానికి అభినందనలు

కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మర్రిగూడ ఎస్ఐ బి. రాంబాబు, సిబ్బంది జాంప్లా, కిరణ్, ప్రశాంత్, వహీద్, యాదయ్యలను నాంపల్లి సీఐ అభినందించారు.

# ఐటీసీ ప్రస్థానంలో చెరగని ముద్ర..

- హేమంత్, సువర్ణకు ఆత్మీయ వీడ్కోలు
- వీడ్కోలు పలికిన ఐటీసీ ఎలక్ట్రికల్ విభాగం ఉద్యోగులు



**బూర్గంపాడు, అక్టోబరు 25 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక ఐటీసీ పరిశ్రమలో విశేష సేవలందించి బదిలీపై వెళ్తున్న ఎస్ఆర్‌పీ ఎలక్ట్రికల్ మేనేజర్ హేమంత్, సువర్ణలకు ఆదివారం ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. బూర్గంపహాడ్ మండలం సారపాకలోని పుష్కరవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ విభాగం మేనేజర్లు, ఉద్యోగులు, సహచర సిబ్బంది పాల్గొని వారికి ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హేమంత్, సువర్ణలను శాలువాలతో సత్కరించి, పూలగుచ్ఛాలు అందజేసి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఐటీసీ పరిశ్రమలో వారు అందించిన సేవలను సహచరులు కొనియాడారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ అందరితో స్నేహపూర్వకంగా మెలిగారని గుర్తుచేసుకున్నారు. బదిలీపై వెళ్తున్న వారు కొత్త ప్రదేశంలోనూ మరిన్ని విజయాలు సాధించాలని, ఉన్నత పదోన్నతులు పొందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ ఎలక్ట్రికల్ విభాగం మేనేజర్లు, ఉద్యోగులు, సిబ్బంది, జేఈఈ ఇంజినీరింగ్ సర్వీస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో పాలన అస్తవ్యస్తం!

- సర్పంచ్‌ల చేతుల్లో కీలుబొమ్మలుగా కార్యదర్శులు
- పనులు గోరంత.. బిల్లులు కొండంత
- పాత తీర్మానాలతో నిధుల డ్రా.. పర్సంటేజీలతో చెల్లింపులు




**మిర్యాలగూడ, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల అభివృద్ధిని పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌ల చేతుల్లో కీలుబొమ్మలుగా మారుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో నివాసం ఉండాల్సిన కార్యదర్శులు పట్టణాల్లో ఉంటూ, గ్రామాలకు వచ్చి వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండి, పారిశుధ్యం, నీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

### పాత బిల్లులకు కొత్త నిధులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి నిధులు విడుదల చేస్తున్నా, పనులు మాత్రం ఆశించిన స్థాయిలో జరగడం లేదనే ఆరోపణలున్నాయి. కొద్దిపాటి పనులు చేసి భారీగా బిల్లులు పెట్టడం, చేయని పనులకు సైతం బిల్లులు సమర్పించి నిధులు డ్రా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిధుల విడుదలకు పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేసి, అధికారులకు సమర్పించాల్సి ఉన్నా పాత తీర్మానాలతోనే నిధులు డ్రా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

మిర్యాలగూడ మండల పరిధిలోని ఓ గ్రామంలో నూతన పాలకవర్గం ఏర్పడిన పది నెలల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.5.60 లక్షలు వచ్చాయి. ఇందులో 90 శాతం నిధులను గత పాలకవర్గం, ప్రత్యేకాధికారి పాలనలో చేసిన పనుల బిల్లులకే చెల్లించినట్లు సమాచారం. దీంతో ప్రస్తుత పాలకవర్గానికి గ్రామాల్లో కనీస అవసరాలైన నీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్య పనులు చేపట్టేందుకు నిధులు మిగలడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

నిధుల వినియోగాన్ని పరిశీలించాల్సిన ఎంపీడీఓలు, మండల పంచాయతీ అధికారులు, పనుల కొలతలు నమోదు చేయాల్సిన పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పర్సంటేజీలు తీసుకుని బిల్లులకు అనుమతులు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారుల పర్యవేక్షణ లోపం, నిధుల వినియోగంలో అక్రమాలకు అడ్డుకట్ట పడకపోతే పల్లెల్లో అభివృద్ధి ఎలా సాధ్యమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ నిధులు విడుదలవుతున్నా గ్రామాల్లో అభివృద్ధి కనిపించకపోవడం, ప్రజల కనీస అవసరాలు తీరకపోవడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# గిరిజన భాషల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి

- కోయ, గోండి భాషలకు ఎనిమిదో షెడ్యూల్‌లో గుర్తింపు కల్పించాలి
- ఆంధ్ర విశ్వవిద్యాలయ సదస్సులో కోయ భాషా బృందం డిమాండ్.

**భద్రాచలం, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** గిరిజన భాషల అభివృద్ధితో పాటు వాటి పరిరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోయ భాషా బృందం ప్రతినిధి మడివి నెహ్రూ కోరారు. కోయ, గోండి భాషలకు భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 23, 24 తేదీల్లో నిర్వహించిన 'గిరిజన భాషలు--భారతీయ భాషలే' సదస్సులో భద్రాచలం, చింతూరు ప్రాంతాలకు చెందిన కోయ భాషా బృందం పాల్గొంది. ఈ సందర్భంగా గిరిజన భాషల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి కుటుంబంలో పిల్లలకు మాతృభాష నేర్పించాలని, కుటుంబ సభ్యులతో పాటు సామాజిక కార్యక్రమాల్లోనూ కోయ భాషను విస్తృతంగా ఉపయోగించాలని మడివి నెహ్రూ పిలుపునిచ్చారు. జాతీయ విద్యా విధానం--2020 ప్రకారం ప్రాథమిక విద్యను మాతృభాష ఆధారంగా అందించే విధానాన్ని ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు. గిరిజన భాషలకు సంబంధించిన మౌఖిక సాహిత్యం, జానపద కథలు, సంప్రదాయాలను సేకరించి, రికార్డు చేసి గ్రంథస్థం చేయాలని సూచించారు. భాషలు కనుమరుగుకాకుండా వాటి



పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందిం చాలని పేర్కొన్నారు. సుమారు 12 రాష్ట్రాల్లో విస్తరించి, కోటిన్నర మందికిపైగా మాట్లాడుతున్న కోయ, గోండి భాషలకు రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో గుర్తింపు కల్పించాలని బృందం డిమాండ్ చేసింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరింది.

ఈ సదస్సులో ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కుంజాం నాగేశ్వరరావు, మడివి మీనాక్షి, వేట్ల నీలిమ, బీరబోయిన జంపన్న, గొంది శైలజ, సారపు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట మీదుగానే బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని కొనసాగించాలి

**సూర్యాపేట, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని మొదటి సర్వే ప్రకారం జాతీయ రహదారి 65కు సమాంతరంగా సూర్యాపేట మీదుగానే కొనసాగించాలని కోరుతూ సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ సాధన పోరాట కమిటీ నాయకులు రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యసభ ఎంపీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డితో ఆయన నివాసంలో సమావేశమై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు బుల్లెట్ ట్రైన్ కారిడార్ అలైన్మెంట్ మారుస్తూ రాష్ట్ర క్యాబినెట్ చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. రాష్ట్ర విభజన చట్టంలో హైదరాబాదు నుండి విజయవాడ స్పీడ్ రైల్ కారిడార్ హామీ ఉందని, దానికి అనుగుణంగా బుల్లెట్ ట్రైన్ కారిడార్ ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సర్వేలన్ని కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టిలో ఉన్నాయని ఇంకా ఏది ఫైనల్ కాలేదని



సూర్యాపేట ప్రాంత ప్రజల అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ ఆరుట్ల జానకి రాంరెడ్డి, పెద్దిరెడ్డి రాజా, తండు శ్రీనివాస్ యాదవ్, ధర్మార్జున్, రమణాచారి, డేవిడ్ కుమార్, చలమల్ల నరసింహ, బూర వెంకటేశ్వర్లు, దారవత్ వెంకన్న, వెలుగు వనిత, భూపతి రాములు, అనంతుల మధు, ఎర్ర అఖిల్, పెద్దిరెడ్డి కళ్యాణ్, నేరెళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండలో భారీగా నల్ల బెల్లం పట్టివేత

- 1,830 కిలోల నల్ల బెల్లం, 160 కిలోల పటిక స్వాధీనం..
- ముగ్గురు అరెస్ట్

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** దేవరకొండ సమీపంలోని డిండి మార్గంలో అక్రమ మద్యం తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అధికారులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 1,830 కిలోల నల్ల బెల్లం, 160 కిలోల పటికతో పాటు ఐదు లీటర్ల దేశీయ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో అక్రమ రవాణాకు ఉపయోగించిన రెండు వాహనాలు, రెండు చరవాణులను కూడా స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన పి అండ్ ఈ, ప్రత్యేక దళాల బృందం ఏ. గణపతి రెడ్డి నేతృత్వంలో మైనంపల్లి గేటు వద్ద తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో రహదారికి కుడివైపున కొన్ని వాహనాలు నిలిపి ఉండటాన్ని అధికారులు గమనించారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా, అశోక్ లేలాండ్ వాహనం నుంచి మారుతి స్విఫ్ట్ డిజైర్ కారులోకి సంచులను మారుస్తున్న ముగ్గురు వ్యక్తులు కనిపించారు. అధికారులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించడంతో వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు.

పట్టుబడిన వారి నుంచి 1,830 కిలోల నల్ల బెల్లం, 160 కిలోల పటిక, ఐదు లీటర్ల దేశీయ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను డిండి మండలం



బొల్లనపల్లి పెద్ద తండాకు చెందిన కత్రావత్ రాజా, గుండ్లపల్లి మండలం దాక్య తండాకు చెందిన వడ్త్యా అశోక్, హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఇనాయతుల్లాగా గుర్తించారు.

అలాగే, టీఎస్ 05 ఈఎం 8611 నంబరు గల మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు, టీజీ 12 యూ 2890 నంబరు గల అశోక్ లేలాండ్ వాహనంతో పాటు వివో వీ40ఈ, వివో వీ30 చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అక్రమ మద్యం తయారీకి వినియోగించే ముడి పదార్థాల సరఫరా వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 74 ఏళ్ల వయస్సులోనూ పతకాల వేట..

- భద్రాచలం పవర్లిఫ్టర్‌కు ఘన స్వాగతం
- అమెరికాలో ప్రపంచ పవర్లిఫ్టింగ్ పోటీల్లో రజతం, కాంస్యం సాధించిన డి.వి. శంకర్రావు
- శంషాబాద్ విమానాశ్రయంలో పూలమాలలు, శాలువాలతో సత్కారం

**భద్రాచలం, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** అమెరికాలో జరిగిన ప్రపంచ పవర్లిఫ్టింగ్ పోటీల్లో రెండు పతకాలు సాధించి స్వదేశానికి తిరిగి వచ్చిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన ప్రముఖ క్రీడాకారుడు డి.వి. శంకర్రావుకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. 74 ఏళ్ల వయస్సులోనూ అసాధారణ ప్రతిభ కనబరిచి ప్రపంచ స్థాయిలో రజత, కాంస్య పతకాలు సాధించడం ద్వారా ఆయన భద్రాచలం ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. అమెరికాలో జరిగిన ప్రపంచ క్లాసిక్ పవర్లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని,




ప్రపంచ ఎక్విప్డ్ పవర్లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకాన్ని శంకర్రావు సాధించారు. వయస్సును సైతం లెక్కచేయకుండా కఠోర సాధన, క్రమశిక్షణతో అంతర్జాతీయ వేదికపై సత్తా చాటడం ఆయన క్రీడా నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. అమెరికా నుంచి స్వదేశానికి చేరుకున్న శంకర్రావుకు ఆయన కోచ్ జి.వి. రామిరెడ్డి, కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు శంషాబాద్ విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన సాధించిన పతకాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. శంకర్రావు విజయాల వెనుక ఆయన వ్యక్తిగత శ్రమతో పాటు కోచ్ జి.వి. రామిరెడ్డి శిక్షణ, మార్గదర్శకత్వం కూడా కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. అమెరికాలో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పి రెండు పతకాలతో స్వదేశానికి చేరుకున్న శంకర్రావుకు సిటీ స్టైల్ జిమ్ సభ్యులు, కుటుంబ సభ్యులు, క్రీడాభిమానులు, మిత్రులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి భద్రాచలం ప్రాంతానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను తీర్చండి



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యాలయంలో ఈరోజు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జిల్లా కార్యవర్గం సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంలో, అకాల మరణం చెందిన, తోటి సహచరులకు, సంసాప సూచకంగా, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు కే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో కొన్ని చోట్ల వాహనాల కొరత ఉందని, ఆయా స్థానాలలో వాహనాల సౌకర్యం కల్పించాలని, కొత్త వాహనాలు కొనుగోలు చేయాలని , ఉద్యోగులకు రావలసిన ఈ ఆర్ సి , డి ఏ బకాయిలను క్లియర్ చేయాలని, తమ విన్నపాన్ని టి జి జేఏసి ద్వారా అధికారులకు తెలియజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌస్ సొసైటీ చైర్మన్ ఎండి సలీం, బిల్డింగ్ సొసైటీ ముఖ్య సలహాదారులు కె కోటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడు బి రామారావు జిల్లా కోశాధికారి ఎస్వీ ప్రసాద్ డివిజన్ అధ్యక్షులు లింగంపల్లిగంగ గౌరవ సలహాదారులు నరసింహారావు , కొత్తగూడెం జిల్లా కన్వీనర్ వనమా శ్రీనివాసరావు భద్రాచలం డివిజన్ అధ్యక్షులు కే రాఘవులు, కో కన్వీనర్ నాగరాజు, కొత్తగూడెం జిల్లా ముఖ్య సలహాదారులు ఆదినారాయణ మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




# చైనాపై ఆధారపడడం పెరుగుతోంది

- డ్రాగన్ ఆంక్షలు.. మన కంపెనీలకు తిప్పలు
- అక్కడ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న వాహన సంస్థలు
- సరఫరాకు ఇబ్బంది లేకుండా చేసుకునేందుకే..



జనంసాక్షి:భారత వాహన, వాహన విడిభాగాల కంపెనీలు తమ చైనా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలనుకుంటున్నాయి. అయితే వాణిజ్యపరంగా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చైనా తన ఎగుమతులపై విధిస్తున్న ఆంక్షల వల్ల అంతర్జాతీయ ఆటోమోటివ్ సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో మన కంపెనీలు కొత్త వ్యూహాన్ని ఎంచుకున్నాయి. ఇప్పటిదాకా చైనా నుంచి సరఫరా అవుతున్న వాహన విడిభాగాలకు ఉన్నట్లుండి ఆంక్షల మూలంగా దిగుమతులు క్లిష్టతరమయ్యాయి. ఇందుకోసం పలు ఆలోచనలు చేస్తున్నాయి. ముఖ్యంగా చైనాలో ఒక కేంద్రం ఏర్పాటు చేయడం, ప్రొక్యూర్‌మెంట్ కార్యకలాపాల ద్వారా చైనా సరఫరాదార్లతో సన్నిహితంగా మెలగడం వంటివి చేయడంపై దృష్టి పెట్టాయి. ఇందులో ఏథర్ ఎనర్జీ, సియట్, ల్యుమాక్స్ ఆటో టెక్నాలజీస్ వంటివి ఉన్నాయి. అరుదైన భూ అయస్కాంత సరఫరాలపై గతేడాది ఏప్రిల్‌లో చైనా ఎగుమతి లైసెన్సింగ్ విధానాన్ని తీసుకురావడం ఇందుకు నేపథ్యం. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో సరఫరా వ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి, కీలక ప్రొక్యూర్‌మెంట్ నిమిత్తం ఏథర్ ఎనర్జీ హాంకాంగ్‌లో ఒక పూర్తి స్థాయి అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసింది. అలాగే భారీ భూ అయస్కాంత లోహాలతో పనిలేకుండా ఉండే ఒక మోటార్‌ను ఏథర్ అభివృద్ధి చేసింది. తద్వారా దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకుంటోంది. ఇక టైర్ల తయారీ కంపెనీ సియట్.. చైనాలో తన ఉనికిని పెంచుకుంటోంది. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో సోర్సింగ్ సామర్థ్యాలను మెరుగుపరచుకోవడానికి, ప్రత్యామ్నాయ సరఫరాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తోంది. ఇక ల్యుమాక్స్ ఆటో టెక్నాలజీస్ చైనాలో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుంది. సోర్సింగ్, టూలింగ్ సామర్థ్యాలను పెంచుకోవడానికి, సాంకేతిక భాగస్వామ్యాలు పెంచుకోవడానికి, కొత్త వ్యాపారావకాశాలను ఒడిసిపట్టుకోవడానికి దీనిని ఉపయోగించుకోనుంది. భారత వాహన విడిభాగాల సరఫరాలో చైనా అంతకంతకూ బలాన్ని పుంజుకుంటోంది. 2025-26లో భారత వాహన విడిభాగాల దిగుమతుల్లో ఈ దేశం వాటా 36 శాతానికి చేరింది. అంతక్రితం ఏడాది 32 శాతంగానే ఉంది. కీలక విద్యుత్ వాహన విడిభాగాల సరఫరాల్లో అడ్డంకులు, అల్యూమినియం, రాగి ధరలు పెరగడంతో సరఫరాదార్లను అందుబాటు ధరలో దక్కించుకోవడంపై తయారీదారులపై ఒత్తిడి ఉంటోంది. దీంతో చైనాపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. భారత సరఫరాదార్లు ఇప్పటికే పలు దేశాల నుంచి దిగుమతికి యత్నాలు మొదలుపెట్టాయి కూడా. ఉదాహరణకు సుప్రజిత్ ఇంజినీరింగ్ తన ప్లాంట్లను భారత్, చైనా, మెక్సికో, హంగేరీ, మొరాకోలకు విస్తరించింది. ఇదే బాటలో హైవే రూప్ ప్రెసిషన్ టెక్నాలజీస్, ఎస్‌పీఆర్ ఆటో టెక్నాలజీస్, టెన్నెకో వంటివి తమ అంతర్జాతీయ తయారీ, ఇంజినీరింగ్‌ను విస్తరించుకుంటున్నాయి. ఒకే దేశం నుంచి బదులు పలు దేశాల నుంచి సరఫరాకు వీలు కల్పించుకుంటు న్నాయి. చైనాలో ఉనికిని విస్తరించుకోవడం వల్ల కంపెనీలు మెరుగైన ఒప్పందాలు చేసుకోవడానికి వీలు కల్పిస్తున్నా, దేశీయంగా కూడా విడిభాగాల ఉత్పత్తిలో పెట్టుబడులు పెరగాల్సిన అవసరాన్ని తాజా పరిణామాలు గుర్తు చేస్తున్నాయి.




## అక్టోబర్‌లో రూ.48,056 కోట్ల

# నిధులు వెనక్కి

### ఎఫ్‌పీఐల విక్రయాలు..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశీయ ఈక్విటీ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరగడం, కార్పొరేట్ కంపెనీల రెండో త్రైమాసిక ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోడం, ద్రవ్యోల్బణ భయాలు.. ఇవన్నీ ఎఫ్‌పీఐలను ప్రభావితం చేశాయి. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున నిధులను దేశీయ మార్కెట్‌ల నుంచి ఉపసంహరించుకున్నారు. అక్టోబర్ 23 నాటికి రూ.48,056 కోట్ల నిధులను వెనక్కి తీసుకున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ రూ.3.08 లక్షల కోట్ల నిధులను దేశీయ ఈక్విటీల నుంచి విదేశీ మదుపర్లు మళ్లించారు. గతేడాది మొత్తంగా జరిపిన ఎఫ్‌పీఐల విక్రయాలు రూ.1.66 లక్షల కోట్లతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. అయితే, అక్టోబర్ 23తో ముగిసిన వారంలో రెండు రోజులు ఎఫ్‌పీఐలు నికర కొనుగోలుదారులుగా మారడం కాస్త ఊరటనిచ్చే అంశంగా మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు దేశీయ మదుపర్ల కొనుగోళ్లు, సిప్‌లలో పెట్టుబడులు మార్కెట్‌కు కలిసొచ్చే అంశమని తెలిపారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఓపెన్ మార్కెట్ కమిటీ నిర్ణయాలు, బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీ రేట్ల నిర్ణయాలు, అమెరికా జీడీపీ (ఉఆఖ)డేటా, చమురు ధరలు ఇవన్నీ మున్ముందు విదేశీ మదుపర్లను ప్రభావితం చేసే అంశాలుగా పేర్కొన్నారు.



## 21.5% తగ్గిన బీపీసీఎల్ లాభం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రభుత్వ రంగ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సెప్టెంబరు త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.4,863 కోట్ల నికర లాభం పొందింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.6191 కోట్లతో పోలిస్తే 21.5 శాతం తగ్గినట్లయింది. ఆదాయం మాత్రం 29.8 శాతం పెరిగి రూ.1.58 లక్షల కోట్లకు చేరింది. ఎబిటా లాభం 13.4 శాతం తగ్గి రూ.9,647 కోట్లకు పరిమితమైంది. ప్రతి బ్యారెల్ ముడి చమురును పెట్రోల్, డీజిల్‌గా మార్చడం ద్వారా 32.53 డాలర్లను సంస్థ ఆర్జించింది. 2025-26 ఇదే త్రైమాసికంలో స్థూల రిఫైనింగ్ మార్జిన్ 10.78 డాలర్లుగా నమోదైంది. 5 నెలలు రిటెయిల్ ధరలను స్థిరంగా ఉంచడంతో ఆర్జించిన లాభాలు తుడిచిపెట్టుకుపోయాయి. మార్కెటింగ్ ఇన్వెంటరీ నష్టం రూ.330 కోట్లు, ఫారెక్స్ ఒడుదొడుకుల నష్టం రూ.397 కోట్లుగా నమోదైంది.ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నంలో ఏడాదికి 10 మి.టన్నుల సామర్థ్యం కలిగిన కొత్త రిఫైనరీ, పెట్రో రసాయనాల కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు బీపీసీఎల్ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా ఒక అనుబంధ సంస్థను ఏర్పాటు చేసేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.30 | ₹ 5.32 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,50,776 (22 క్యారెట్లు) | ₹ 1,64,480 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,20,000

## జర్మనీ సంస్థలకు వ్యూహాత్మక కేంద్రంగా భారత్

### మంత్రి పీయూష్ గోయల్

**బెర్లిన్(జనంసాక్షి):** భారత్‌ను కీలక వినియోగదారుల విపణిగానే కాకుండా తయారీ, పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ఆవిష్కరణలకు ఒక వ్యూహాత్మక కేంద్రంగా జర్మనీ కంపెనీలు పరిగణిస్తున్నాయని భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. జర్మనీలో రెండు రోజుల పర్యటన ముగించుకున్న అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. సీమెన్స్ హెల్త్‌కేర్, బెర్టెల్స్‌మాన్ ఇన్వెస్ట్‌మెంట్, ఫోక్స్‌వ్యాగన్, స్కోడా వంటి కంపెనీల ప్రతినిధులతో పలు ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో సుమారు 2000 జర్మనీ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను పెంచే మార్గాలపై చర్చించేందుకు మంత్రి ఇక్కడికి వచ్చారు. రెండు దేశాల మధ్య సంబంధాలు కేవలం వస్తు, సేవల వాణిజ్యానికే కాకుండా.. నైపుణ్యం, ఆవిష్కరణలు, అభివృద్ధి, తయారీలో పరస్పర సహకారానికి మార్గం చూపుతాయని అన్నారు. మరిన్ని పెట్టుబడులు, పారిశ్రామిక సహకారం, పరిశోధన, అభివృద్ధి దిశగా ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మార్చడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమన్నారు. 'ప్రపంచ మార్కెట్లలో ఖర్చులను తగ్గించుకుని, మరింత పోటీతత్వాన్ని సాధించడం అనేది నేడు జర్మన్ పరిశ్రమ ముందున్న అతిపెద్ద సవాలు.. అందువల్ల వాళ్లు భారత్‌లో తయారీపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. భారత్‌లో ఇప్పటికే పెద్ద యెత్తున ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీలు)లో లక్షలాది మంది ప్రతిభావంతులైన యువతీ యువకులకు ఉపాధి కల్పిస్తామని దాదాపు ప్రతి కంపెనీ చెబుతోంద'ని ఆయన వివరించారు. జర్మనీ కంపెనీలు గణనీయమైన విస్తరణకు ప్రణాళికలు రచిస్తున్నాయని, దాదాపు 2-5 ఏళ్లలో తమ కార్యకలాపాలను రెట్టింపు లేదా మూడింతలు చేయాలని చాలా కంపెనీలు లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో కొత్త వ్యాపారాలు, కొత్త ఆర్డర్లు, అధిక పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలపై భారత్-ఐరోపా కూటమి మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద విజయం ఆధారపడి ఉంటుందని తెలిపారు. భారత్-ఐరోపా కూటమి వాణిజ్య ఒప్పందంపై ఈ ఏడాది చివరి నాటికి సంతకాలు జరగనున్నాయి. వచ్చే ఏడాది ఇది అమల్లోకి రావచ్చు.

## ఫీల్డ్ రిపోర్టర్లపై దాడులు, ఆన్‌లైన్ వేధింపులకు

# అడ్డుకట్ట వేయాలి

### హైదరాబాద్‌లో మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు దిగ్విజయం

**వివిధ రాష్ట్రాల నుంచి 135 మంది మహిళ జర్నలిస్టు ప్రతినిధులు హాజరు • పలు తీర్మానాలు ఏకగ్రీవ ఆమోదం**




**దేశవ్యాప్తంగా మహిళా జర్నలిస్టుల వృత్తిపరమైన స్వేచ్ఛ, భద్రత, గౌరవానికి భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మీడియా యాజమాన్యాలు కఠిన చర్యలు తీసుకోవాలని 'జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సు' డిమాండ్ చేసింది.**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐ జె యు ), మెఫీ, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీ యూ డబ్ల్యు జె) సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 24, 25 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ రెండు రోజుల సదస్సు ఆదివారం ముగిసింది.దేశంలోని వివిధ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 65 మంది ప్రతినిధులతో పాటు తెలంగాణ నుంచి 70 మంది, మొత్తం 135 మందికి పైగా మహిళా జర్నలిస్టులు ఈ సదస్సులో పాల్గొన్నారు. తాము ఎదుర్కొంటున్న వ్యవస్థాగత, క్షేత్రస్థాయి సవాళ్లపై వారు చర్చించారు.దేశవ్యాప్తంగా మహిళా జర్నలిస్టుల స్వేచ్ఛ, భౌతిక దాడుల నుంచి భద్రత , ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా పెరుగుతున్న దాడులు, ప్రతికూల పరిణామాలను మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగబద్ధమైన స్వేచ్ఛ, పని ప్రదేశాల్లో భద్రత ప్రాముఖ్యతను గుర్తిస్తూ, మహిళా జర్నలిస్టుల భద్రతను పటిష్టం చేయాలని, వారి వృత్తిపరమైన సమానత్వం, గౌరవం, స్వేచ్ఛను పరిరక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, చట్టాల అమలుతీరును పర్యవేక్షించే సంస్థలు, మీడియా సంస్థలను డిమాండ్ చేసింది.

### వాస్తవాలను నియంత్రిస్తున్న ప్రభుత్వం

**- సీనియర్ జర్నలిస్ట్ ఉమా సుధీర్**

"గతంలో అభిప్రాయాలు, వాస్తవలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే అవాకాశం ఉండేది. కానీ నేడు ప్రభుత్వమే వాస్తవాలను నియంత్రిస్తోంది" అని సీనియర్ జర్నలిస్టు, ఎన్ టి టీవీ సౌత్ మాజీ ఎగ్జిక్యూటివ్ ఉమా సుధీర్ వ్యాఖ్యానించారు. ఒకప్పుడు జర్నలిస్టులు అధికారిక దృక్పథాన్నే ప్రామాణికంగా భావించేవారని, కానీ ఇప్పుడు సామాజిక కార్యకర్తలు, నిపుణుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవా లన్నారు. హైదరాబాదులో జరుగుతున్న మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు లో భాగంగా శనివారం నాడు"మారుతున్న జర్నలిజం: డిజిటల్ నైపుణ్యత, విశ్వసనీయత, విలేకరుల ఐక్యత" అనే అంశంపై ఆమె మాట్లాడారు.డిజిటల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో జర్నలిజంలో వస్తున్న మార్పులు, ఫ్యాక్ట్-చెకింగ్ ప్రాముఖ్యత, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవా ళ్ళ గురించి ఎన్ డి టీవీ సౌత్ మాజీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమా సుధీర్ మాట్లాడారు.ఏఐ రాకముందు ఫ్యాక్ట్-చెకింగ్ కోసం జరిగే నిశితమైన పరిశోధన, పరిశీలనల గురించి ఆమె ప్రస్తావిస్తూ, మానవ ప్రమేయం ఇప్పటికీ ఎంతో కీలకమని స్పష్టం చేశారు. ఎడిటర్లకు గతంలో ఉన్నట్లుగా తుది నిర్ణయాధికారం లేకుండా న్యూస్‌రూమ్‌లు వికేంద్రీకరణ చెందాయని, ఎడిటోరియల్ నిర్ణయాల్లో మానవ ప్రమేయం తగ్గిపోయింద న్నారు.

### పాత్రికేయ సూత్రాలతో రాజీ లేకుండా ఏఐ వినియోగం

**- న్యూస్ మీటర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఖనీజా గరారి**

ఏఐని బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, మానవ విచక్షణకు, క్షేత్రస్థాయి రిపోర్టింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని జర్నలిస్టులకు న్యూస్ మీటర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఖనిజా గరారి సూచించారు. హైదరాబాద్లో జరుగుతున్న మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు లో భాగంగా రెండో రోజు ఆదివారం నాడు " జర్నలిజంలో మరింత మెరుగ్గా, బాధ్యతయుతంగా ఏ ఐ వినియోగం" అనే అంశంపై ఆమె మాట్లాడారు. జర్నలిస్టులు ఏఐపై పూర్తిగా ఆధారపడకుండా, తమ పనికి సహాయపడే ఒక సాధనంగా మాత్రమే ఉపయోగించుకోవాలని నొక్కి చెప్పారు. ఒక ప్రెస్ నోట్‌ను అర్థం చేసుకోవడానికి లేదా సమాచారాన్ని గ్రహించడానికి ఏఐని ఉపయోగించేటప్పుడు, వారు ముందుగా తమ పాత్రికేయ పరిజ్ఞానాన్ని ఉపయోగించి దానిని అధ్యయనం చేసి, అర్థం చేసుకోవాలని యువ జర్నలిస్టులకు సూచించారు. "సామాన్యులు అర్థం చేసుకోగలిగే సరళమైన భాషలో సమాచారాన్ని అందించేలా జర్నలిస్టులు ఏఐకి ప్రాంప్ట్ ఇవ్వాలి.యువ ఫ్రీలాన్సర్లకు, ఏఐ ఒక అభ్యాస సాధనంగా మారింది, ఇది అనువాదం వంటి పనులను సులభతరం చేస్తోంది. అయితే, ఏఐ రూపొందించిన అనువాదాలలో ఉండే తప్పులను జర్నలిస్టులు గుర్తించగలగాలి" అని ఆమె వివరించారు.

### టీఆర్పీల వేటలో నైతిక విలువలు పతనం

**- ప్రొఫెసర్ పద్మజా షా**

నేటి జర్నలిజం ప్రజాస్వామ్య విలువల కంటే టీఆర్పీలు, క్లిక్‌లు, లైకులు, వైరల్ న్యూస్ పైనే ఎక్కువగా ఆధారపడి నడుస్తోందని ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విశ్రాంత హెడ్ ప్రొఫెసర్ పద్మజా షా ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు), మెఫీ,టి యు డబ్ల్యు సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న రెండు రోజుల 'జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సు'లో భాగంగా "జర్నలిజంలో నైతికత బాధ్యతాయుతమైన భాషా వినియోగం" అనే అంశంపై ఆమె కీలక ప్రసంగం చేశారు. సమాజంలోని వివిధ వర్గాలపై ముఖ్యంగా ప్రాంతీయ మీడియాలో వస్తున్న అసభ్యకరమైన భాష, దిగజారుతున్న నైతిక ప్రమాణాలు తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని పద్మజా షా పేర్కొన్నారు. వార్తా కథనాల్లో దేనిని ప్రసారం చేయాలి, వేటిని నివారిం చాలనే నిర్ణయాల్లో నైతికత ప్రధాన పాత్ర పోషిస్తుందని, ఇది భాషతో పాటు విజువల్స్‌కూ సమానంగా వర్తిస్తుందని స్పష్టం చేశారు. బాధితులైన బాలికలు, మహిళల వివరాలు లేదా ఫొటోలను బహిర్గతం చేయకూడదనే స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, ప్రముఖ మీడియా సంస్థలు సైతం వాటిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు.

**దిశా ఘటనను ఉదాహరణగా ప్రస్తావిస్తూ...**

ఆ సమయంలో అనేక ఎలక్ట్రానిక్ మీడియా ఛానెళ్లు చట్టాన్ని, నైతిక పరిమితులను అతిక్రమించి బాధితురాలి వివరాలను ప్రసారం చేసినా, కేవలం ఒక్క ఛానెల్‌పైనే జరిమానా విధించడం నిబంధనల అమలులోని లోపాలను, అస్థిరతను స్పష్టం చేస్తోందన్నారు. ప్రస్తుతం మీడియాకు ఏకరీతి నియంత్రణ యంత్రాంగం లేదని ఎత్తిచూపిన ఆమె, మీడియా సంస్థలన్నింటికీ తప్పనిసరి సభ్యత్వం ఉండేలా, ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకునే పూర్తి అధికారం కలిగిన స్వతంత్ర నియంత్రణ సంస్థను తక్షణమే ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.నేటి జర్నలిజం విద్యార్థులను మీడియా యాజమాన్యాలు తమ స్వప్రయోజనాలకు సాధనాలుగా వాడుకునేలా సంస్థాగత శిక్షణా కేంద్రాలు తీర్చి దిద్దుతున్నాయని, రాజ్యాంగ సూత్రాలు, ప్రజాస్వామ్య స్పృహ లేని పాఠ్యాంశాలను మార్చాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.ఈ సదస్సులో పాల్గొన్న కర్ణాటక మీడియా అకాడమీ ఛైర్‌పర్సన్ అయేషా ఖానుమ్ మాట్లాడుతూ, "నైతిక విలువలే జర్నలిజానికి ఆత్మ లాంటివి, అవి లోపిస్తే జర్నలిజం అంతరించినట్లే" అని హెచ్చరించారు. ప్రైవేట్ న్యూస్ ఛానెళ్లు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు పెరిగిన ప్రస్తుత తరుణంలో సంచలనాల కోసం ప్రాకులాడకుండా, జర్నలిస్టులు ఆత్మపరిశీలన చేసుకుంటూ వృత్తిపరమైన విశ్వస నీయతను కాపాడుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు.

### సదస్సులో ఆమోదించిన ప్రధాన తీర్మానాలు

**పోష్ చట్టం కఠిన అమలు:** ప్రతి మీడియా సంస్థలో 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013'ను తప్పనిసరిగా అమలు చేయాలి. అన్ని సంస్థల్లో ఐ సి సి ఏర్పాటు చేయడం తో పాటు వేధింపులు, కక్షసాధింపు చర్యల నివారణకు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో స్వతంత్ర భద్రతా విభాగాలను నెలకొల్పాలి.

**దాడులు, పోలీసుల దురుసు ప్రవర్తనపై రక్షణ:** ఫీల్డ్‌లో వార్తా సేకరణకు వెళ్లే మహిళా జర్నలిస్టులపై జరిగే భౌతిక దాడులు, పోలీసుల దురుసు ప్రవర్తనను సదస్సు తీవ్రంగా ఖండించింది. బాధ్యులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, జర్నలిస్టుల రక్షణకు సమగ్ర చట్టంతో పాటు ప్రభుత్వ నిధులతో ఉచిత న్యాయ సహాయం అందించాలని డిమాండ్ చేసింది.

**ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ దాడుల నిరోధం:** మహిళా జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న సైబర్‌స్టాకింగ్, డాక్సింగ్, డీప్‌ఫేక్స్ వంటి దాడులపై చట్టపరమైన సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు బాధ్యతాయుతంగా స్పందించాలి. ఐటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ బాధితుల వ్యక్తిగత గోప్యతను కాపాడాలి.

**సమాన వేతనం ప్రాధాన్య హోదాలు:** మీడియా సంస్థల్లో వేతన అసమానతలను రూపుమాపేందుకు 'సమాన వేతన చట్టం-1976'ను పక్కాగా అమలు చేయాలి. మహిళా జర్నలిస్టులకు కీలకమైన రిపోర్టింగ్ బీట్లను కేటాయించడంతో పాటు సంపాదకీయ నాయకత్వ స్థానాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి.

**ప్రసూతి ప్రయోజనాలు -రుతుక్రమ సెలవులు:** ప్రసూతి ప్రయోజనాల చట్టం-1961ని అమలు చేయడంతో పాటు నెలకు ఒకరోజు వేతనంతో కూడిన ప్రత్యేక రుతుక్రమ సెలవు మంజూరు చేయాలి. ఆఫీసుల్లో శిశు సంరక్షణ కేంద్రాలు (క్రెచ్‌లు), హెల్త్ కార్డులు అందించాలి.

**సామాజిక భద్రత -పెన్షన్లు:** రిటైర్డ్, రెగ్యులర్, ఫ్రీలాన్స్ మహిళా జర్నలిస్టులందరికీ వర్తించేలా దేశవ్యాప్తంగా ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలి. ప్రమాదవశాత్తు లేదా అకాల మరణం చెందిన మీడియా ప్రతినిధుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలి.

**ఉద్యోగ భద్రత - అక్రిడిటేషన్, ఇళ్ల స్థలాలు:** ఉద్యోగ ఒప్పందాల పరిరక్షణకు 'వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టం-1955'ను కచ్చితంగా అమలు చేయాలి. వివక్ష లేకుండా అర్హులైన మహిళా జర్నలిస్టులందరికీ ప్రభుత్వ అక్రిడిటేషన్ కార్డులు, జర్నలిస్టుల సంక్షేమ పథకాల ద్వారా ప్రత్యేక హౌసింగ్ లేదా ఇళ్ల స్థలాల కేటాయింపులు చేపట్టాలి.

ఈ తీర్మానాలను తక్షణమే పరిగణనలోకి తీసుకుని చట్టపరమైన, రక్షణాత్మక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సదస్సు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది.







జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
26 అక్టోబర్ 2026



# ఖజానా ఖాళీ!

## పంచాయతీల్లో ఆర్థిక సంక్షోభం

- నిధులు లేక ముందుకు సాగని పనులు
- నిధుల కొరత.. సర్పంచ్లు డీలా! జాడలేని ఎస్ఎఫ్సీ నిధులు
- అరకొరగా ఆర్థిక సంఘం నిధులు వాటి ఖర్చులకు సవాలక్ష ఆంక్షలు
- గ్రామాల్లో సమస్యల సావాసం.. నిధుల కోసం అధికారులపై ఒత్తిడి



కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కోహీర్ మండలంలోని 23 గ్రామ పంచాయతీలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్ బిల్లులు, కార్మికుల వేతనాలు చెల్లించేందుకు నిధులు లేక సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు పెండింగ్ బిల్లుల చెల్లింపులకే సరిపోవడంతో కొత్త అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది. 16వ ఆర్థిక సంఘం నిధులతోపాటు రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్సీ) గ్రాంట్ల విడుదలలో జాప్యం గ్రామీణ పాలనపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

**కోహిర్ అక్టోబర్25 జనం సాక్షి:**
సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలో 23గ్రామ పంచాయతీలకు గత ఏడాది ఎన్నికలు పూర్తి చేశారు. ఎన్నికలు నిర్వహించే నాటికి గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. సకాలంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించని కారణంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రాంట్లు ఆగిపోయాయి. గత ఏడాది చివరిలో ఎన్నికలు నిర్వహించి డిసెంబర్లో పాలకవర్గాలు కొలువుదీర డంతో గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం కింద విడుదల చేయాల్సిన ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు విడుదల చేసింది. 15వ ఆర్థిక సంఘం కింద ఈ ఏడాది ఫిబ్రవరిలో మొదటి సారి.. మార్చిలో రెండోసారి గ్రామపంచాయి పంచాయతీలకు నిధులను విడుదల చేశారు. ఆ తరువా త 16వ ఆర్థిక సంఘం కొలువుదీరింది. దీని కింద రాష్ట్రవ్యాప్తం గా గ్రామ పంచాయతీలకు వచ్చే నిధుల లెక్కలను తేల్చారు. నిధుల విడుదలకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ అయ్యాయి. అయితే 16వ ఆర్థిక సంఘం నుంచి ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు నిధులు మాత్రం విడుదల కాలేదు.

**పెండింగ్ బిల్లులకు చెల్లింపులు..**
కేంద్రప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద రెండు దఫాలుగా నిధులను విడుదల చేయగా.. అప్పటికే ఖర్చు చేసిన పనులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ ఎస్ఎఫ్సీ నిధులు ఎక్కడ?**
గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా క్రమం తప్పకుండా గ్రాంట్లను మంజూరు చేస్తుంది. గ్రామ పంచాయతీలోని జనాభాను బట్టి ఈ నిధుల కేటాయింపు ఉంటుంది. తలసరిగా రూ.750 కేటాయిస్తారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం కింద నిధులను విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్సీ) కింద నిధులను పంచాయతీలకు కేటాయిస్తుంది. గత ఏడాది కాలంలో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఎస్ఎఫ్సీ కింద గ్రామ పంచాయతీ లకు నిధుల కేటాయింపు జరగలేదు. ఎస్ఎఫ్సీ నిధుల విడుదలలో జాప్యం కారణంగా పంచాయతీలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. రోజువారి ఖర్చు లకు కూడా పంచాయతీలలో నిధులు లేకపోవడంతో గ్రామ సర్పంచ్లు పాలనలో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొం టున్నారు. ప్రతినెలా గ్రామ పంచాయతీలలో పెద్ద ఎత్తున ఖర్చులు ఉంటున్నాయి. కార్మికులకు వేతనాలు.. తాగునీటి సరఫరా.. విద్యుత్ సమస్యలు.. వాహనాలకు డీజిల్ లాంటి వాటికి నిధులను కేటాయించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీలకు అటు 16వ ఆర్థిక సంఘం.. ఇటు రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి నిధుల విడుదల లేకపోవడంతో గ్రామీణ పాలన అస్తవ్యస్తంగా మారింది. నిధుల కొరతతో గ్రామ సర్పంచ్లలో " గెలిచిన నాటి ఉత్సాహం తాజాగా కరువైంది. దీంతో నిధులకోసం గ్రామ సర్పంచ్లు ఆయా నియోజకవర్గాల అధికారులపై ఒత్తిడి తీసుకవస్తున్నారు.
పంచాయతీ కార్యదర్శులు పెద్ద మొత్తంలో తమ జేబులో నుంచి



ఖర్చు చేశారు. కొందరు మాజీ సర్పంచ్ లు వివిధ అభివృద్ధి పనులనుకూడా చేపట్టారు. వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్లకు చెల్లింపులు చేశారు. ఈ మొత్తంను కొత్తగా బాధ్యతలు చేపట్టిన నూతన సర్పంచ్లు చెల్లించడం గమనార్హం. వచ్చిన నిధుల వ్యయంకు సంబంధించి తాజా.. మాజీ సర్పంచ్ల మధ్య వివాదం రేగడంతో ప్రభుత్వం జోక్యం చేసుకొని పెండింగ్ బిల్లులకు 15వ ఆర్థిక సంఘం నిధులను వాడుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 15వ ఆర్థిక సంఘం కింద వచ్చిన రెండు దఫాల నిధులు అభివృద్ధిపనులకు కేటాయించలేని పరిస్థితి ఏర్పడింది.

# అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ.. 20 కి.మీ. సైకిల్ ర్యాలీ

- పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహణ
- జెండా ఊపి ప్రారంభించిన సీపీ గౌష్ ఆలం.. ఈ నెల 31 వరకు పలు కార్యక్రమాలు



**కరీంనగర్ బ్యూరో, అక్టోబరు 25 (జనంసాక్షి):** పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఆదివారం 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్లో సీపీ గౌష్ ఆలం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోట, శివ థియేటర్ సర్కిల్, కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, నాఖా, బోట్, కమాన్ చౌరస్తాల మీదుగా సాగి తిరిగి పరేడ్ గ్రౌండ్కు చేరుకుంది. అనంతరం పాల్గొన్న వారికి అమరవీరుల సంస్మరణ దినోత్సవ ప్రాముఖ్యతను సీపీ వివరించారు. ఈ నెల 31 వరకు వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు వీటిలో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, ఇన్స్పెక్టర్లు, సైక్లిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేశ్ పాసుల, డాక్టర్ కిరణ్, న్యాయవాది తిరుపతితోపాటు పలువురు పాల్గొన్నారు.

# మంథనిలో లారీ ప్రమాదం..యువకుడు మృతి

**లారీ చక్రాల కింద పడి మల్లేపల్లి యువకుడి దుర్మరణం**

**మంథని, అక్టోబర్ 25, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పట్టణంలోని పాత పెట్రోల్ పంప్ సమీపంలో లారీ ఢీకొనడంతో మల్లేపల్లి గ్రామానికి చెందిన చింతల నవీన్ (28) లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద తీవ్రతకు యువకుడు తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. యువకుడి ఆకస్మిక మృతితో మల్లేపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హమాలీ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు

- ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాల కల్పనకు కృషి
- కనీస వేతనాల పెంపునకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది
- హమాలీ వర్కర్స్ సంఘం దశాబ్ది వేడుకల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి



**పెద్దపల్లి, అక్టోబరు 25 (జనంసాక్షి):** హమాలీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. పెద్దపల్లిలోని ఎం.బి. గార్డెన్లో ఆదివారం నిర్వహించిన హమాలీ వర్కర్స్ అసోసియేషన్ దశాబ్ది వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ఈఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కనీస వేతనాల పెంపుపై ప్రభుత్వం బాధ్యతతో పనిచేస్తుందని పేర్కొన్నారు.
కార్మికుల సేవే తమ కుటుంబానికి ప్రాధాన్యమని, కాకా వెంకటస్వామి కుటుంబంపై పెద్దపల్లి ప్రజలు చూపిస్తున్న ఆదరణను ఎప్పటికీ మరచిపోలేమని మంత్రి అన్నారు. గతంలో ప్రమాదానికి గురైన హమాలీ కార్మికుడికి తమ విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్మికులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం కూడా తమ బాధ్యతలో భాగమని పేర్కొన్నారు. ఎఫ్సీఐ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంటులో గళమెత్తాలని మంత్రి కోరారు. సింగరేణి కార్మికుల పెన్షన్ల కోసం పోరాడి రూ.120 కోట్లు సాధించడంలో ఆయన కృషిని ప్రస్తావించారు. ఎఫ్సీఐ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం కూడా అదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. గిగ్ వర్కర్ల సంక్షేమానికి తెలంగాణలో బోర్డు ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, కార్మికుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ పి. కోదండరాం తదితరులు పాల్గొన్నారు. వైద్యులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి వృత్తిపరమైన సంఘీభావాన్ని పెంపొందించాలని టీడీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ అన్నారు. వైద్యుల సమస్యలు, ఆందోళనలను సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు వారి హక్కులు, సంక్షేమానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్ వజ్జ ప్రదీప్, డాక్టర్ చైతన్య పేర్కొన్నారు. వైద్యులు, రోగుల మధ్య పరస్పర గౌరవం, అవగాహన పెంపొందిస్తూ బాధ్యతాయుతమైన వైద్యసేవలను బలోపేతం చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ ఛైర్మన్ మల్లికార్జున్, తెలంగాణ యువత అధ్యక్షుడు ఇమ్మడి సతీష్ అన్నారు. వైద్య వృత్తి గౌరవాన్ని కాపాడుతూ రోగుల శ్రేయస్సుకు ప్రాధాన్యమివ్వాలని డాక్టర్ కళ్యాణ్కుమార్, డాక్టర్ మహేష్ నేత, డాక్టర్ రాంప్రదీప్, డాక్టర్ అనన్యారెడ్డి, డాక్టర్ సుమారెడ్డి, డాక్టర్ అభినవ్ శర్మతోపాటు పలువురు వైద్యులు, సామాజికవేత్తలు అభిప్రాయపడ్డారు.

# రాజన్న ఆలయం.. పట్టణ అభివృద్ధి రెండు కళ్లలాంటివి

- వేములవాడను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- తుది దశకు చేరిన 80 అడుగుల రహదారి పనులు
- రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లకు పైగా నిధులు
- పనుల్లో నాణ్యత పాటించాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, అక్టోబరు 25 (జనంసాక్షి):** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడను ఆధ్యాత్మిక కేంద్రంగా, టెంపుల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధి, పట్టణ ప్రగతి రెండు కళ్లలాంటివని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న 80 అడుగుల రహదారి విస్తరణ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో ఆదివారం ఆయన మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు, కాంట్రాక్టర్తో కలిసి పనులను పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, రహదారి దీర్ఘకాలం మన్నికగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చొరవతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.250 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయని, ఆలయ పనులు 55 శాతం, అన్నదాన సత్రం పనులు 50 శాతం పూర్తయ్యాయని వివరించారు. అదనంగా రూ.99.40 కోట్ల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి, అన్నదాన సత్రం కోసం నిధులు విడుదల చేసి భక్తులకు మెరుగైన దర్శనం, వసతి, అన్నదాన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.
పట్టణ ప్రజలు, భక్తుల రాకపోకలకు కీలకమైన 80 అడుగుల రహదారి నిర్మాణానికి సుమారు రూ.6.5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాలు, లైటింగ్ సదుపాయాలనూ మెరుగుపరుస్తామన్నారు. రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న నిర్వాసితుల సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న మూడో వంతెన నిర్మాణ పనులను కూడా వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు రాష్ట్రంలోని వివిధ ఆలయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆధ్యాత్మిక అభివృద్ధితోపాటు పట్టణంలో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగేలా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు, వైస్ ఛైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రొండి రాజు, వైస్ ఛైర్మన్ కనికరపు రాకేశ్, ఆత్మ కమిటీ ఛైర్మన్ ముసుకు ముకుందరెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ వకులాభరణం శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# సేంద్రీయ ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

**జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి**



**ఎడపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** సేంద్రియ ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టిసారించి ప్రతి ఒక్కరి ఆరోగ్యాలను కాపాడాలని జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి కోరారు. మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన రైతు కరటూరి పాపారావుకు చెందిన శ్రీ సూర్యోదయ సేంద్రియ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల సాగు, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం, భూసారాన్ని కాపాడుకోవడం, పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను అందించే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఆచరణలో పెట్టడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించవచ్చని వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకొని సేంద్రియ పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్క్రాస్ జిల్లా అధ్యక్షుడు పోతాన్కర్ లక్ష్మీనారాయణ, సహకార సంఘం చైర్మన్ కరుటూరి సత్యనారాయణ, కరటూరి సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

# "ఓట్ బచావో - దేశ్ బచావో చౌపాల్"పై డిసిసిలో అత్యవసర భేటీ

- డీసీసీ సమావేశానికి హాజరైన ఏఐసీసీ పరిశీలకులు శరత్, పీసీసీ పరిశీలకులు కూన శ్రీశైలం గౌడ్
- రాహుల్ గాంధీ ఓటు చోరీ పోరాటానికి మద్దతు ఇవ్వండి
- నవంబర్ 1న ఢిల్లీ రామ్ లీలా మైదాన్ భారీ సభకు కరీంనగర్ నుంచి భారీగా తరలిరండి
- కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు డా. అంజన్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 25 ( జనం సాక్షి) :**
ఏఐసీసీ/టీపీసీసీ పిలుపు మేరకు "ఓట్ బచావో - దేశ్ బచావో చౌపాల్" కార్యక్రమంపై అవగాహన ఒ భవిష్యత్ కార్యాచరణపై డిసిసి కార్యాలయంలో జిల్లా పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోటీ చేసిన అభ్యర్థులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్, విభాగాలు, సెల్స్ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు, ఏఐసీసీ/టీపీసీసీ/డీసీసీ నాయకులు, మండల/పట్టణ డివిజన్ అధ్యక్షులతో అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు, వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇట్టి సమావేశానికి, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా.మేడిపల్లి సత్యం సభాధ్యక్షతన వహించగా, కరీంనగర్ ఉమ్మడి జిల్లా క్లస్టర్ ఇంచార్జ్ లు ఏఐసీసీ పరిశీలకులు శరత్, పిసిసి పరిశీలకులు కూన శ్రీశైలం గౌడ్, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణలు ముఖ్య అతిథులుగా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సత్తు మల్లేశం, ఒడితల ప్రణవ్, ఊట్కూరు నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆరేపల్లి మోహన్, పురుమళ్ళ శ్రీనివాస్, హాజరై పార్టీ శ్రేణులకు కార్యక్రమాన్ని ఉద్దేశించి దిశా నిర్దేశం చేసినారు.
ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి దేశ పౌరులతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మద్దతు ఇవ్వాలని, ఓటు చోరీకి బాధ్యత వహిస్తూ రాజీనామాకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సిద్ధమైనప్పటికీ ప్రధాని మోడీ హోం మంత్రి అమిత్ షా అడ్డుపడుతున్నారని, నవంబర్ 1న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గ నుండి కనీసం వందమంది కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.
హుజురాబాద్ మునిసిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని, ఏఎంసి చైర్మన్ ఆకుల నరసయ్య, సిరాజు హుస్సేన్,ఎండి తాజ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, ముత్యం శంకర్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అహమ్మద్ అలీ, అబ్దుల్ రహమాన్, తదితరుల తోపాటు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, డివిజన్ ప్రెసిడెంట్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేవెళ్ల మార్కెట్ యార్డులో గంజాయి సేవిస్తూ ముగ్గురు మైనర్లు పట్టివేత

**చేవెళ్ల, అక్టోబర్ 24 (జనంసాక్షి) :**
చేవెళ్ల మార్కెట్ యార్డు వద్ద గంజాయి సేవిస్తున్న ముగ్గురు మైనర్లను చేవెళ్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం మధ్యాహ్నం 1:45 గంటల సమయంలో పోలీసులు మార్కెట్ యార్డు వద్దకు చేరుకుని ముగ్గురిని విచారించారు. ఈ సందర్భంగా వారు గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, వారిలో ఒకరి వద్ద 12.55 గ్రాముల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు, నంబర్ ప్లేట్ లేని టీవీఎస్ ఎన్టార్క్ స్కూటర్ను స్వాధీనం చేసుకున్నారు. నిర్వహించిన డ్రగ్ పరీక్షల్లో ముగ్గురికీ గంజాయి (టిహెచ్ సి) పాజిటివ్గా నిర్ధారణ అయినట్లు తెలిపారు. పట్టుబడిన ముగ్గురూ 17 ఏళ్ల వయస్సు గల మైనర్లు కావడంతో, చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టేందుకు సంబంధిత అధికారుల ముందు హాజరుపరిచే ప్రక్రియను పోలీసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చేవెళ్ల సీఐ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వినియోగం, విక్రయాలు,ఇతర అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# వాటర్ హీటర్ను తాకి విద్యుత్ షాక్తో మహిళ మృతి

**బోరబండ భారత్నగర్లో విషాద ఘటన**

**అమీర్పేట్ /బోరబండ, (జనం సాక్షి):**
విద్యుత్ షాక్కు గురై ఓ మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్లోని బోరబండ భారత్నగర్కు చెందిన ఆయేషా బేగం (26), భర్త అబ్దుల్ రౌఫ్, గృహిణి. ఆమె అనుకోకుండా వాటర్ హీటర్ను చేతితో తాకడంతో విద్యుత్ షాక్కు గురై మృతి చెందారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్లు బోరబండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రవికుమార్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ జి. సైదులు, ఎస్ఐ వై. కాశయ్య వివరాలు వెల్లడించారు

# శేరిలింగంపల్లిలో వరద ముంపునకు శాశ్వత పరిష్కారం

- రూ.79.58 కోట్లతో నాలాల విస్తరణ పనులు
- నల్లగండ్ల చెరువు నుంచి తారానగర్ వరకు రూ.24 కోట్లతో డ్రెయిన్ నిర్మాణం
- పాపిరెడ్డి కాలనీలో రూ.98 లక్షలతో నీటి నిల్వ సంపు
- పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి: పీఏసీ ఛైర్మన్ అరికెపూడి



**శేరిలింగంపల్లి, అక్టోబరు 25 (జనంసాక్షి):** శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధితోపాటు వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ తెలిపారు. ఎస్ఎన్డీపీ ఫేజ్-2లో భాగంగా నియోజకవర్గంలో రూ.79.58 కోట్లతో చేపట్టిన నాలాల విస్తరణ పనులను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల చెరువు అలుగు నుంచి తారానగర్ వరకు రూ.24 కోట్లతో చేపడుతున్న ఆర్సీసీ బాక్స్ డ్రెయిన్, బెడ్, సైడ్వాల్ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. అనంతరం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ రైల్వే అండర్పాస్ వద్ద రూ.98 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 2.25 లక్షల లీటర్ల సామర్థ్యం గల నీటి నిల్వ సంపు పనులను పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని కాంట్రాక్టర్లకు సూచించారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ, మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తానని గాంధీ తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల ఆరోగ్యమే ప్రాధాన్యం

- మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం
- మూడు ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ
- ఆరోగ్య పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఛైర్మన్ పుల్కం రాజు

వేములవాడ, అక్టోబరు 25 (జనంసాక్షి): పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు అన్నారు. వేములవాడలో మాతృశ్రీ, అశ్విని, వర్ష ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ ఎండా, వానా లెక్కచేయకుండా విధులు నిర్వహించే కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి శిబిరాలతో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, తగిన వైద్య సలహాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఉచిత వైద్యసేవలు అందించేందుకు ముందుకొచ్చిన ఆసుపత్రుల యాజమాన్యాలను అభినందించారు. శిబిరంలో కార్మికులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై సూచనలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైద్యులు చీకోటి సంతోష్కుమార్, సత్యనారాయణస్వామి, సాయికుమార్, పరమేశ్వర్, ప్రవీణ్వర్మ, హారిక, అనిల్, శ్రీదేవి, మున్సిపల్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



## నీరు లేక ఎండుతున్న పంటలు

గోపాల్‌పూర్‌కు చెందిన రైతు కనకయ్య మూడు ఎకరాల్లో వరి సాగు చేయగా, నీటి కొరతతో కొంత విస్తీర్ణానికే నీరు అందుతోందని వాపోతున్నారు. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. దుర్షేడ్‌కు చెందిన రైతు గట్టయ్య ఆరు ఎకరాల్లో సాగు చేపట్టినా, నీటి సమస్యతో మూడు ఎకరాలకు మాత్రమే నీరు అందుతోందని పేర్కొన్నారు. లో వోల్టేజ్ కారణంగా వ్యవసాయ మోటార్లు సరిగా పనిచేయడం లేదని రైతులు చెబుతున్నారు. గోపాల్‌పూర్ పరిధిలోని డీ-94 కాల్వను పునరుద్ధరించి సాగునీరు అందించాలని కోరుతున్నారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. కరీంనగర్ రైతులకు కష్టాలు!

## సాగునీటి కొరతతో ఎండుతున్న వరి పాలాలు

- అక్టోబరు తొలి 21 రోజుల్లో జిల్లాలో చినుకు కరవు
- పెట్టుబడులు చేతికందేనా? పరిహారం కోసం రైతుల డిమాండ్
- డీ-94 కాల్వ పునరుద్ధరణ, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి



**కరీంనగర్ టౌన్, అక్టోబరు 25 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు కరీంనగర్ జిల్లా రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. సాగునీటి కొరతకు తోడు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు పంటలపై ప్రభావం చూపుతున్నాయి. అక్టోబరు 1 నుంచి 21 వరకు జిల్లాలో వర్షం నమోదు కాకపోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. గోపాల్‌పూర్, దుర్షేడ్ గ్రామాల్లో వరి పంటలకు నీరందక ఎండిపోతున్నా యని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పరిహారం అందించాలని కోరుతున్నారు.

**జిల్లాలో సాగు పరిస్థితి ఏమిటి?**

సెప్టెంబరు 19న ప్రచురితమైన నివేదిక ప్రకారం, కరీంనగర్ జిల్లాలో వానాకాలం సాధారణ సాగు విస్తీర్ణం 3,31,417 ఎకరాలు కాగా, 3,23,606 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో 2,65,734 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు ఆ నివేదిక పేర్కొంది. అయితే ప్రస్తుతం జిల్లాలో ఎంత విస్తీర్ణంలో పంటలు ఎండుతున్నాయి, ఎంత మేర నష్టం వాటిల్లే అవకాశం ఉందనే అంశాలపై తాజా అధికారిక గణాంకాలు అందుబాటులో లేవు. క్షేత్రస్థాయి సర్వే తర్వాతే నష్టంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**అధికారులు, ప్రభుత్వం ఏమంటున్నారు?**

ఈ ఏడాది వర్షపాత లోటు, పరిమిత నీటి లభ్యత నేపథ్యంలో వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ గతంలో రైతులకు సూచించింది.

సాగునీటి లభ్యతపై నీటిపారుదల శాఖ నివేదిక ఆధారంగా పంటల ప్రణాళిక రూపొందించాలని కూడా అధికారులు సూచించినట్లు జులైలో ప్రచురితమైన వార్తలో పేర్కొన్నారు. అయితే గోపాల్‌పూర్, దుర్షేడ్ గ్రామాల్లో ప్రస్తుత పంట నష్టం, డీ-94 కాల్వ పునరుద్ధరణ, విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారుల తాజా స్పందన తెలియాల్సి ఉంది.

**పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు**

పంటలు ఎండిపోతుండటంతో అప్పులు చేసి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటల పరిస్థితిని అంచనా వేయాలని, నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించాలని కోరుతున్నారు. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. నాలుగో డివిజన్ కార్పొరేటర్ భూపతి రవీందర్ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారులు స్పందించకపోతే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళా మృతి

**మొయినాబాద్,అక్టోబర్25, జనంసాక్షి:** రోడ్డు ప్రమాదంలో మహిళా మృతి చెందింది. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన గౌడుగు నాగమణి వయస్సు (50) గృహిణి, అజీజ్ నగర్ ను డి చిలుకూరు వచ్చేందుకు బస్ స్టాప్ నిలబడింది. అదే సమయంలో హైదరాబాద్ నుండి చేవెళ్ల వైపు వెళ్తున్న టీఎస్ 15 యూడీ 0427 నంబర్ గల డీసీఎం అతివేగంగా, నిర్లక్ష్యంగా ఆమెను ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోవడంతో తలకు, ఛాతీ భాగంలో బలమైన గాయాలతో అక్కడిక్కడే ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## డంపింగ్ యార్డు కాలుష్యంపై ఈటల సమరశంఖం!

- అక్టోబర్ 27 నుంచి పాదయాత్ర.. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం
- చెత్త నుంచి విద్యుత్, బయోగ్యాస్ ఉత్పత్తికి ఆధునిక ప్లాంట్లు
- సీఎస్ఆర్ నిధులతో స్థానికంగా మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్



**జవహర్‌నగర్, అక్టోబరు 25 (జనంసాక్షి):** జవహర్‌నగర్ డంపింగ్ యార్డు కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించడమే లక్ష్యంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఈ నెల 27 నుంచి పాదయాత్ర చేపట్టనున్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ మురళీ మనోహర్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పర్యావరణవేత్తలు, మేధావులు, డంపింగ్ యార్డు బాధితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. యార్డు నుంచి వెలువడుతున్న కాలుష్యంతో సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మహిళలు, పిల్లల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

డంపింగ్ యార్డు నిర్వహణలో రాంకీ సంస్థ సామాజిక బాధ్యతను విస్మరిస్తోందని ఆరోపించారు. సంస్థ సీఎస్ఆర్ నిధులను స్థానికుల తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. యార్డుకు కొత్తగా చెత్త రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ఇప్పటికే పేరుకుపోయిన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేసి విద్యుత్, బయోగ్యాస్, సేంద్రియ ఎరువులుగా మార్చే ఆధునిక ప్లాంట్లను ఏర్పాటు చేయాలని కోరారు. వీటి ఏర్పాటుకు అవసరమైన నిధులను కేంద్రం నుంచి తీసుకువచ్చే బాధ్యత తాను స్వీకరిస్తానని తెలిపారు.

ఈ సమస్యను రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల దృష్టితో పరిష్కరించాలని ఈటల పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టనున్న పాదయాత్ర ద్వారా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న జవహర్‌నగర్, పరిసర ప్రాంతాల ప్రజలు శాశ్వత పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు.



## సేవా దృక్పథంతో మెలగాలి

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనం సాక్షి:** ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు వెళ్లాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. శ్రీధన్పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కిసాన్ ఫ్యాషన్ మాల్‌లో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్, ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ... సేవా కార్యక్రమాలు చేయడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంతమేర సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలన్నారు. పేదలను ఆదుకొని అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. యువత వారాంతంలో హంగు ఆర్భాటాలకు పోకుండా తోచిన విధంగా సేవ చేయాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో పేరు ప్రతిష్టల తో పాటు నలుగురికి సాయం చేశామన్న తృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ధన్ పాల్ ప్రణయ్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రూ.600కే వారం రోజుల పాటు అపరిమిత బస్ ప్రయాణం

**టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి**

**ముషీరాబాద్ అక్టోబర్ 25 (జనం సాక్షి):** నగర ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) శుభవార్త అందించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రూ.600కే ఏడు రోజుల పాటు అపరిమితంగా సిటీ బస్సుల్లో ప్రయాణించేలా 'వీక్లీ బస్ పాస్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పాస్ కొనుగోలు చేసిన రోజు నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది. ఏసీ బస్సులతో సహా అన్ని రకాల సిటీ బస్సుల్లో ప్రయాణించవచ్చు. అయితే పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ బస్సులకు ఈ పాస్ వర్తించదు. నగరానికి వచ్చే పర్యాటకులు, వ్యాపారవేత్తలు, వారంపాటు ప్రయాణించే వారికి ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుంది. నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో వీక్లీ పాసులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ తెలిపింది. ప్రజా రవాణాను ప్రోత్సహిస్తూ ప్రయాణికులకు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ పథకం లక్ష్యమని టీజీఎస్ ఆర్టీసీ వీసీ, ఎండీ వై. నాగిరెడ్డి తెలిపారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కోరిన రవి నాయక్



**మహేశ్వరం,అక్టోబర్25(జనంసాక్షి):** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ,మంఖాల్ లో తాగునీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,తాగునీటి సమస్యలను పరిష్కరించాలని మాజీ కౌన్సిలర్ రవి నాయక్, పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం మాజీ మంత్రి,ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఈ విషయంపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంషాబాద్ జోనల్ కమిషనర్ కు ఫోన్ చేశారు.తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు.అవసరమైతే బోర్లు వేసి ప్రజల అవసరాలను తీర్చాలని కమిషనర్ కు సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు శ్రీనివాస్ గుప్తా,కుమార్ సాగర్, సుధాకర్ గౌడ్,దానయ్య,సుధాకర్,కప్పల ప్రవీణ్ పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పూల వ్యర్థాలతో అగరబత్తీలు!

- ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి
- పక్కా ఆర్గానిక్స్‌తో ఎంఎంసీ వినూత్న కార్యక్రమం..
- 7 వేల మెట్రిక్ టన్నుల పూల సేకరణ



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** వ్యర్థాలను సమస్యగా కాకుండా విలువైన వనరులుగా మార్చుతూ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నామని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. పండుగల సందర్భంగా సేకరించిన పూల వ్యర్థాలతో అగరబత్తీలు, ధూప్ స్టిక్స్ తయారు చేయడం ద్వారా పునర్వినియోగాన్ని ప్రోత్సహించడంతోపాటు మున్సిపల్ వ్యర్థాల నిర్వహణపై భారాన్ని తగ్గిస్తున్నామని పేర్కొన్నారు. గణేష్ చతుర్థి, బతుకమ్మ పండుగల సందర్భంగా ఎంఎంసీ పరిధిలో సుమారు 7 వేల మెట్రిక్ టన్నుల పూల వ్యర్థాలను సేకరించినట్లు వినయ్ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఇందులో గణేష్ నిమజ్జనాల సందర్భంగా 6,400 మెట్రిక్ టన్నులకు పైగా, బతుకమ్మ వేడుకల్లో సుమారు 400 మెట్రిక్ టన్నుల పూల వ్యర్థాలు ఉన్నాయని శానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ తెలిపారు. పక్కా ఆర్గానిక్స్ సంస్థతో కలిసి సఫిల్‌గూడ చెరువుతో పాటు ప్రధాన నిమజ్జన కేంద్రాల వద్ద ప్రత్యేక కియోస్క్‌లను ఏర్పాటు చేసి పూల వ్యర్థాలను సేకరించారు. సేకరించిన పూలను ఎండబెట్టి పొడిగా మార్చి, వివిధ మూలికలు, సహజ రెసిన్లు, కలప పొడులు, మొక్కల ఆధారిత బైండర్లతో కలిపి అగరబత్తీలు, ధూప్ స్టిక్స్ తయారు చేస్తున్నారు. పూల వ్యర్థాలను సాధారణ చెత్తలో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి పునర్వినియోగించడం ద్వారా పర్యావరణహిత వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో వ్యర్థాల విభజన, వనరుల పునరుద్ధరణను ప్రోత్సహిస్తూ పరిశుభ్రమైన, సుస్థిర నగర నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి రూ.95 కోట్లతో కాలువల మరమ్మతులు

- ముదిరాజ్ బిడ్డలంతా ఐక్యంగా ఉండాలి
- అర్హులకు నిధులు అందేలా కృషి
- మత్స్యశాఖ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్



**కోట్‌పల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లాలోని కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో రూ.95 కోట్లతో కాలువల మరమ్మతు పనులు చేపట్టినట్లు జిల్లా మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే కోట్‌పల్లి ప్రాజెక్టు పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటని, గతంలో నిధులు వచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే చొరవతో ప్రాజెక్టు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. మత్స్యకారులు, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారంతా చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ఉండాలని శ్రీధర్ పిలుపునిచ్చారు. పరస్పర గొడవలకు దూరంగా ఉంటూ సంఘం, గ్రామ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, నిధులు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని తెలిపారు.

**అతి త్వరలో రూ.8 లక్షల నిధుల పంపిణీకి చర్యలు**

సొసైటీ డబులు రూ.8 లక్షల నిధులు ప్రస్తుతం ఏడి ఆధీనంలో ఉన్నాయని శ్రీధర్ వెల్లడించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో చర్చించి అతి త్వరలో సంబంధిత లబ్ధిదారులకు చెక్కుల ద్వారా లేదా బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ వారి వాటా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**మత్స్యకారుల సంక్షేమానికి పలు పథకాలు**

గతంలో నక్కల బందప్ప మత్స్యకారుల సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో ప్రభుత్వం 12 పథకాలను ప్రవేశపెట్టిందని శ్రీధర్ గుర్తుచేశారు. అనంతరం 119 మంది కొత్త సభ్యులను సొసైటీలో చేర్చినట్లు తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారికి 36 టీవీఎస్ ఎక్సెల్ బైక్‌లు, మూడు ఆటోలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కోట్‌పల్లిలో మత్స్యశాఖ భవనాన్ని నిర్మించినట్లు వివరించారు. ప్రాజెక్టులో మృతి చెందిన ఇద్దరు మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సొసైటీ చైర్మన్‌గా పనిచేసిన ఆనంద్ సమయంలో రూ.41.36 లక్షల నిధులకు సంబంధించి లెక్కలు స్పష్టంగా లేవని శ్రీధర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో కేసు కొనసాగుతోందని తెలిపారు. చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతున్నందున నిధులు ఇప్పటివరకు తిరిగి అందలేదని పేర్కొన్నారు. సదరు నిధులను తిరిగి రాబట్టేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు శ్రీధర్ తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధి లక్ష్యంగా అందరూ ఐక్యంగా పనిచేయాలని ఆయన కోరారు.

## నైతిక వైద్యసేవలే లక్ష్యంగా టీడీఎఫ్

- హైదరాబాద్ చాప్టర్ కార్యవర్గం నియామకం
- అధ్యక్షుడిగా డాక్టర్ బాల గణేశ్ బాధ్యతల స్వీకరణ
- నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేసిన ఎంపీ రఘునందన్‌రావు
- వైద్యుల ఐక్యత, సంక్షేమానికి సమష్టి కృషి



**హైదరాబాద్, అక్టోబరు 25 (జనంసాక్షి):** వైద్యుల ఐక్యత, సంక్షేమం, వృత్తిపరమైన గౌరవంతోపాటు సమాజానికి నైతికమైన, నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ (టీడీఎఫ్) పనిచేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బంజారాహిల్స్‌లోని టీఎక్స్ ఆసుపత్రిలో టీడీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో హైదరాబాద్ చాప్టర్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన చాప్టర్ అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ బాల గణేశ్‌తోపాటు కార్యవర్గ సభ్యులకు ఎంపీ నియామక పత్రాలు అందజేశారు.

వైద్యులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి వృత్తిపరమైన సంఘీభావాన్ని పెంపొందించాలని టీడీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ అన్నారు. వైద్యుల సమస్యలు, ఆందోళనలను సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు వారి హక్కులు, సంక్షేమానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్ వజ్జ ప్రదీప్, డాక్టర్ చైతన్య పేర్కొన్నారు. వైద్యులు, రోగుల మధ్య పరస్పర గౌరవం, అవగాహన పెంపొందిస్తూ బాధ్యతాయుతమైన వైద్యసేవలను బలోపేతం చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ ఛైర్మన్ మల్లికార్జున్, తెలంగాణ యువత అధ్యక్షుడు ఇమ్మడి సతీష్ అన్నారు. వైద్య వృత్తి గౌరవాన్ని కాపాడుతూ రోగుల శ్రేయస్సుకు ప్రాధాన్యమివ్వాలని డాక్టర్ కళ్యాణ్‌కుమార్, డాక్టర్ మహేష్ నేత, డాక్టర్ రాంప్రదీప్, డాక్టర్ అనన్యారెడ్డి, డాక్టర్ సుమారెడ్డి, డాక్టర్ అభినవ్ శర్మతోపాటు పలువురు వైద్యులు, సామాజికవేత్తలు అభిప్రాయపడ్డారు.



**జీఓకు తూట్లు**

అధికారులు విధుల నిర్వహణలో విఫలమైతే ఇలాంటి సంఘటనలు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతాయనడానికి ఈ వ్యవహారం సజీవ సాక్ష్యంగా నిలుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. భార్య ఉద్యోగం చేస్తుంటే భర్త అదే శాఖలో కాంట్రాక్టర్ అవతారం ఎత్తడం, ప్రభుత్వ ఉద్యోగులు కూడా కాంట్రాక్టులు చేసుకోవడం వెనుక డీఈ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జీఓకు పూర్తి విరుద్ధంగా పనులు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.



# మిర్యాలగూడ డీఈ మాయాజాలం..?

## ఒకే లైసెన్స్‌కు పెద్దఎత్తున అగ్రిమెంట్లు

### కోట్లలో పనుల అప్పగింత.. విద్యుత్ శాఖలో కలకలం

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** రాజు తలుచుకుంటే కొరడా దెబ్బలకు కొదవ అన్నట్లు ఉంది విద్యుత్ శాఖ అధికారుల పనితీరు. ప్రభుత్వ సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేస్తున్న కొందరు ఘనులు ఎక్కడో కాదండోయ్.. నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడలోనే ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లాస్య ఎలక్ట్రికల్స్ పేరున 314902 నంబర్ లైసెన్స్‌పై అనుజ 2016 నుంచి పనులు చేస్తూ ఉన్నారు. ఆ తర్వాత 2025 ఆగస్టు 20న ల్యాండ్ లూజర్ కింద జెన్‌కోలో ప్రభుత్వ ఉద్యోగం పొందినట్లు సమాచారం. సదరు లైసెన్స్ యజమానికి ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా రూ.40 లక్షలకు పైగా అగ్రిమెంట్లు ఇచ్చినట్లు బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తతంగం మొత్తానికి డీఈ కారణమనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత డీఈతో పాటు గత ఎస్సీ కూడా కుమ్మక్కై ఈ చట్టవిరుద్ధ పనులు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉద్యోగం వచ్చిందని తెలిసినా లైసెన్స్ యజమానిని పక్కన పెట్టకుండా కాంట్రాక్టులు కొనసాగించడం చట్టవిరుద్ధమని తెలిసినా అలాగే వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని వెనుక పెద్దఎత్తున డబ్బులు చేతులు మారినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**మరో తతంగానికి తెర**

లాస్య ఎలక్ట్రికల్స్ పేరున నాగు 316659 లైసెన్స్ నంబర్‌పై 2025 నవంబర్‌లో లైసెన్స్ తీసుకుని ఇప్పటివరకు 200 అగ్రిమెంట్లు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొత్తగా లైసెన్స్ తీసుకున్న వ్యక్తికి ఇన్ని అగ్రిమెంట్లు ఇవ్వడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాటి విలువ సుమారు రూ.1.14 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. ఇప్పటికే రూ.27 లక్షల వరకు బిల్లులు కూడా ముట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత పెద్దఎత్తున సాగుతున్న వ్యవహారంలో డీఈదే కీలకపాత్ర అని ఆరోపణలు వస్తున్నాయి.

**కోట్ల రూపాయల్లో పనులు చేసిన ఘనులు**

లాస్య ఎలక్ట్రికల్స్ 314902 లైసెన్స్ ద్వారా 2024 ఏప్రిల్ 25 నుంచి 2026 జూన్ 3 వరకు 260 అగ్రిమెంట్లు చేసినట్లు సమాచారం. వీటి విలువ రూ.1,84,07,061గా ఉంది. ఇందులో 215 అగ్రిమెంట్లకు సంబంధించి రూ.1,27,40,172 బిల్లులు ముట్టినట్లు సమాచారం. అలాగే లాస్య ఎలక్ట్రికల్స్ 316659 నంబర్ లైసెన్స్‌పై 2025 నవంబర్ 11 నుంచి 2026 సెప్టెంబర్ 11 వరకు 186 అగ్రిమెంట్లు చేసినట్లు సమాచారం. వీటి విలువ రూ.1,14,64,625గా ఉంది. ఇందులో బిల్లుల కోసం పెట్టిన 49 అగ్రిమెంట్లకు సంబంధించి రూ.27,05,671 బిల్లులు చెల్లించినట్లు సమాచారం.

**విచారణ జరిగేనా.. చర్యలు తీసుకునేనా?**

డీఈపై మరిన్ని ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్రస్థాయి విజిలెన్స్ విచారణ జరిగితే అసలు విషయాలు బయటకు వస్తాయని తెలుస్తోంది. జిల్లా స్థాయి విజిలెన్స్ అధికారులు తమకు అనుకూలంగా నివేదిక తయారు చేస్తారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. చట్టవిరుద్ధంగా అగ్రిమెంట్లు చేసిన వారిపై ఉన్నతస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్రస్థాయి అధికారులకు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# చేవెళ్లలో 47 ఫామ్‌హౌజుల్లో పోలీసుల సోదాలు

- ఎలైట్ ఫామ్‌హౌస్‌లో హుక్కా సెటప్ గుర్తింపు.. కేసు నమోదు



**చేవెళ్ల, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** అక్రమ కార్యకలాపాలను అరికట్టడం, ప్రజల భద్రతను నిర్ధారించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం లక్ష్యంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చేవెళ్ల, పోలీసులు ఫామ్‌హౌస్‌లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, చేవెళ్ల, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మొత్తం 47 ఫామ్‌హౌస్‌లలో సోదాలు చేపటా ్టరు. ఈ తనిఖీల్లో భాగంగా అక్టోబర్ 24 అర్ధరాత్రి ముడిమ్యాల్ గ్రామంలోని ఎలైట్ ఫామ్‌హౌస్‌లో అనుమతులు లేకుండా హుక్కా వినియోగిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు గుర్తించారు. ఫామ్‌హౌస్ యజమాని మహమ్మద్ అబ్దుల్ హకీమ్ హుక్కా వినియోగానికి సంబంధించి చెల్లుబాటు అయ్యే అనుమతులు లేదా లైసెన్స్‌ను సమర్పించలేక పోయినట్లు పోలీసులు తెలిపారు. దీంతో పోలీసులు అధికారుల సమక్షంలో రెండు హుక్కా పాట్స్‌తోపాటు వాటి పైపులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి, చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టారు. ఫామ్‌హౌస్ యజమానులు, నిర్వాహకులు తమ ప్రాంగణాల్లో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావివ్వకుండా, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు హెచ్చరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఫామ్‌హౌస్‌లలో ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

# రామంతాపూర్ చర్చ్ కాలనీలో భారీ పేలుడు

- స్క్రాప్ షాపులో లోహాన్ని కట్ చేస్తుండగా ప్రమాదం.. ఎగిసిపడిన మంటలు



**ఉప్పల్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** రామంతాపూర్ చర్చ్ కాలనీలో భారీ పేలుడు సంభవించడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. కాలనీలోని ఓ స్క్రాప్ షాపులో లోహాన్ని కట్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించి, ఆ వెంటనే మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో స్క్రాప్ డీలర్ పరశురామ్ తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ఆయన శరీరంలో సుమారు 70 శాతం కాలినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాలపాలైన పరశురామ్‌ను అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఘటనాస్థలానికి రెండు అగ్నిమాపక వాహనాలు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాయి.

**లోహాన్ని కట్ చేస్తుండగా పేలుడు**

రామంతాపూర్ చర్చ్ కాలనీలోని స్క్రాప్ షాపులో లోహాన్ని కట్ చేసే పనులు జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. పనులు జరుగుతుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో షాపులో ఉన్నవారు ఉలిక్కిపడ్డారు. పేలుడు అనంతరం మంటలు చెలరేగడంతో అక్కడి పరిస్థితి ఒక్కసారిగా ఆందోళనకరంగా మారింది. అసలు పేలుడు ఎలా సంభవించింది? లోహాన్ని కట్ చేస్తున్న సమయంలో ఏదైనా ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# అనుమానాస్పద స్థితిలో రాండ్ స్టడ్ మహిళా ఉద్యోగిని మృతి



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** అనుమానాస్పద స్థితిలో ఓ ప్రైవేట్ కంపెనీ మహిళా ఉద్యోగిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ మేరకు మాదాపూర్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్చన చౌదరి మాలిక్(29) మాదాపూర్ ఐటి కారిడార్ పరిధి మైండ్ స్పేస్ లో ఉన్న ర్యాండ్ స్టడ్ కంపెనీలో మహిళా ఉద్యోగిని గా పనిచేస్తూ చంద్ర నాయక్ తండాలోని 'ఎస్ఆర్ సద్గురు రెసిడెన్సీ' లో నివసిస్తున్నారు. ఆమె తన సహోద్యోగి అయిన ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన భండారి విమల్‌తో గత నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మధ్యకాలంలో వీరి ప్రేమ వ్యవహారం విమల్ కుటుంబానికి తెలియడంతో గత కొంతకాలంగా ఇంట్లో కుటుంబ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో విమల్ తన భార్య నుండి విడాకులు పొందే ప్రక్రియలో ఉన్నట్లు సమాచారం. కాగా ఊహించని విధంగా విమల్ కుటుంబంలోని కలహాల కారణంగానో, మరే ఇతర అంశాల ప్రభావము తెలియదు కానీ ఆదివారం తెల్లవారుజామున సుమారు 2:30 గంటల సమయంలో విమల్ తన తల్లితో కలిసి చెర్యాలలో ఒక కార్యక్రమానికి హాజరవుతుండగా, అర్చన అతనికి వీడియో కాల్ చేశారు. ఆ సమయంలో ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీని కట్టి, తనను వివాహం చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. ఆ తర్వాత విమల్ పదేపదే కాల్ చేసినప్పటికీ ఆమె స్పందించకపోవడంతో, ఆయన ఉదయం సుమారు 5:30 గంటలకు ఆమె ఫ్లాట్‌కు చేరుకున్నారు. అప్పటికే తలుపు లోపలి నుండి గడియపెట్టి ఉంది. అనుమానం వచ్చిన విమల్ వెంటనే డయల్ 112 కు సమాచారం అందించగా సిబ్బంది మరియు పెట్రోలింగ్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని, తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లగా, అర్చన సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించారు. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించి మృతదేహాన్ని ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# కళలతో సమాజంలో చైతన్యం



**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రావు భవన్ లో ఆదివారం నిర్వహించిన స్వర గానామృతం కార్యక్రమంలో జూనియర్ ఘంటసాల అలియాస్ బుర్రీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జ్ఞన సరస్వతి కళా వేదిక ద్వారా 111 పాటలను గాయని గాయకులు పాడి అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్, జైలు సూపరింటెండెంట్ సుధాకర్ రెడ్డి, విశ్రాంత అధ్యాపకులు హమీద్ ఖాన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు చిన్న శ్రీరాములు, భారత్ గ్యాస్ డీలర్ ఇరిగి కోటేశ్వరి, స్ప్రెడ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ దయానంద్ , బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం డాక్టర్ రామ్మూర్తి యాదవ్ మాట్లాడుతూ కళలు వల్లే విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుందని అన్నారు. అందరూ ఆస్వాదించాలని కళలను, కళాకారులను ప్రోత్సహిస్తూ గౌరవించడం సూర్యాపేట ఘనత అని, జ్ఞాన సరస్వతి కళా వేదిక ఏర్పాటు చేసే ఆనాటి పాటల ఆణిముత్యాలను ఇలాంటి కార్యక్రమాల ద్వారా వినడం సంతోషంగా ఉందని అన్నారు. షీల్డ్, సర్టిఫికెట్లతో అతిధుల చేతుల మీదుగా గాయని గాయకులకు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అబ్రహం, సత్యం, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తాం

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్
- రూ.200 కోట్లతో జగిత్యాల జిల్లా తాటిపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం
- 25 ఎకరాల్లో 2,500 మంది విద్యార్థులకు ఆధునిక వసతులతో విద్య



**జగిత్యాల బ్యూరో అక్టోబర్ 25(జనం సాక్షి) :** పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించి, వారి జీవితాల్లో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానం విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైందని తెలిపారు. పేద ప్రజలకు అందించగలిగే అత్యంత విలువైన సంపద విద్యేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన కులగణనలోనూ విద్య ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్న విషయం స్పష్టమైందని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ విద్య ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగారని, గురుకుల విద్యాసంస్థల్లో చదువుకున్న ఎంతోమంది నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రాష్ట్రంలోని 326 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని తెలిపారు. గురుకుల విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు పేర్కొన్నారు. గురుకులాలకు సంబంధించిన బిల్లులను గ్రీన్ ఛానల్ ద్వారా క్రమం తప్పకుండా చెల్లించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం**

ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పెట్టుబడి సాయం పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. 25 లక్షల మంది రైతులకు రూ.20 వేల కోట్ల మేర రుణమాఫీ చేశామని, రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా 75 వేల ఉద్యోగాల నియామకాలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

**సూపర్ ఎల్‌నినోను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాలి**

పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని, రాష్ట్రంలో కరువును ఎదుర్కొనేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రకృతి పరిస్థితులను రాజకీయాలకు ముడిపెట్టి విమర్శలు చేయడం సరికాదన్నారు. గతంలో కొండగట్టు బస్సు ప్రమాదం, కరోనా వంటి సంక్షోభాలు ఎదురైనప్పుడు తాము అప్పటి ప్రభుత్వాన్ని నిందించలేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రతి గ్రామంలో నీటి నిల్వలను పెంచేందుకు కుంటలు, వ్యవసాయ భూముల వద్ద పంట కుంటల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటూ భూగర్భ జలాల పెంపునకు కృషి చేస్తున్నట్లు వివరించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో విద్యారంగానికి భారీ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముందుకు సాగుతున్నారని తెలిపారు. జగిత్యాలలో ఇటీవల కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తాటిపల్లిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఇందారం నీటికుంటలో పడి ముగ్గురు మృతి

- వలస కూలీ కుటుంబంలో అంతులేని విషాదం
- నివాసం ఏర్పాటు చేసుకుని 24 గంటల్లో విషాదం







**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 25 (జనంసాక్షి) :** పొట్ట కూటి కోసం ఖమ్మం జిల్లా నుంచి మంచిర్యాల జిల్లాకు వచ్చిన ఓ వలస కూలి కుటుంబంలో అంతులేని విషాదం నెలకొంది. ఉపాధి కోసం ఇంట్లో వాడే వస్తువుల మరమ్మత్తులు (రిపేర్) చేయడానికి గాను వలస జీవితంలో భాగంగా ఒక్కరోజు ముందు శనివారం ఇందారంలో చిన్నపాటి డేరా వేసుకొని నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఖమ్మం జిల్లా మంగళగూడెం గ్రామపంచాయతీ పరిధికి చెందిన మోటం మెసయ్య, మనెమ్మ (24), మోటం కీర్తన (16), మదీనా కావ్య (9) తమ కుటుంబ సభ్యులతో కలిసి చిన్న గుడారం వేసుకొని ఉపాధి కోసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం లోని ఇందారం గ్రామ శివారులోని ఉన్న నీటికుంట వద్దకు తల్లి మనెమ్మ, పిల్లలు కీర్తన, కావ్య బట్టలు ఉతికేందుకు వెళ్లారని స్థానికులు తెలిపారు చిన్న కూతురు మదీనా కావ్య బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవ శాత్తు కుంటలోకి జారుతూ మునిగిపోతుండగా వెంటనే అలర్ట్ అయిన తల్లి మోటం మన్నెమ్మ, పెద్ద కూతురు కీర్తన, కావ్యను కాపాడే ప్రయత్నంలో భాగంగా తల్లి కూతురు సైతం కుంటలో మునిగిపోయారు. ఒకే కుటుంబానికి చెందిన తల్లి ఇద్దరు కూతుళ్లు ఇందారం కుంటలో మునిగిపోవడంతో ఇందారం గ్రామంలో విషాదం నెలకొంది. మనెమ్మ భర్త మెసయ్య అనారోగ్య కారణంగా చికిత్స కోసం మంచిర్యాల ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. తల్లి ఇద్దరు కూతుళ్లు బట్టలు ఉతకడానికి నీటి కుంట వద్దకు వెళ్లి ఎంతకు తిరిగి రాకపోవడంతో మిగతా కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. నీటి గుంట వద్దకు వెళ్లి పరిశీలించగా వారు నీటిలో పడి ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. వెంటనే స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న జైపూర్ పోలీసులు మృతదేహాలను వెలికి తీయించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై జైపూర్ ఎస్సై భూమేష్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది.





# ఏసీబీకి చిక్కిన జలమండలి జాయింట్ డైరెక్టర్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ జాయింట్ డైరెక్టర్ ఏ. శ్రీనివాస్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. కార్యాలయం నుంచి ఇంటికి అక్రమ నగదును తరలిస్తున్నారన్న సమాచారంతో అధికారులు దాడి చేసి, ఆయన వద్ద నుంచి రూ. 2.40 లక్షల లెక్కల్లో లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న జాయింట్ డైరెక్టర్ ఏ. శ్రీనివాస్ అక్రమంగా వసూలు చేసిన నగదుతో ఇంటికి బయలుదేరినట్లు ఏసీబీ సిటీ రేంజ్ 2 టీమ్ కు గుర్తుతెలియని వ్యక్తి నుంచి సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆయనపై రహస్య నిఘా పెట్టారు. శనివారం రాత్రి సుమారు 7:00 గంటల సమయంలో రాజ్ భవన్ రోడ్డులోని మెట్రో రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఆయన ప్రయాణిస్తున్న మారుతి స్విఫ్ట్ కారును ఏసీబీ అధికారులు అడ్డగించారు. అనంతరం వాహనంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో శ్రీనివాస్ వద్ద రూ. 2,40,000 (రెండు లక్షల నలభై వేల రూపాయల) నగదు పట్టుబడింది. విధులను ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ఇంత భారీ మొత్తం ఎక్కడిదని ప్రశ్నించగా.. ఆయన సరైన సమాధానం చెప్పలేకపోయారు. పైగా పొంతనలేని, విరుద్ధమైన సమాధానాలు ఇచ్చారు. నగదుకు ఎలాంటి లెక్కలు చూపించకపోవడంతో అధికారులు పంచనామా నిర్వహించి ఆ మొత్తాన్ని సీజ్ చేశారు. దీనిపై అవినీతి కోణంలో విచారణ జరుపుతున్నామని, తదుపరి చర్యల కోసం ఆదాయపు పన్ను శాఖకు కూడా సమాచారం అందిస్తున్నామని ఏసీబీ అధికారులు తెలిపారు.

# అండర్-17 క్రికెట్ పోటీలకు 8 మంది ఎంపిక

- చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీకి దక్కిన అరుదైన గుర్తింపు



**భద్రాచలం అక్టోబరు 25 (జనంసాక్షి)** తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అండర్--17 క్రికెట్ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భద్రాచలంలోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీకి చెందిన ఎనిమిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఒకే అకాడమీ నుంచి ఇంతమంది ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. ఈ విజయంతో అకాడమీకి మంచి గుర్తింపు లభించగా, క్రీడాకారుల తల్లిదండ్రులు, క్రికెట్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోచ్ శరన్ తేజ

**మార్గదర్శకత్వంలో శిక్షణ**

అకాడమీ కోచ్ శరన్ తేజ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందిస్తున్నారు. నిరంతర సాధనతో వారి ఆటతీరును మెరుగుపరుస్తూ పోటీలకు సిద్ధం చేస్తున్నారు. కోచ్ మార్గదర్శకత్వంలో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అకాడమీ శిక్షణా ప్రమాణాలకు నిదర్శనంగా నిలిచింది.

**ఎంపికైన క్రీడాకారులు**

చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ నుంచి రిషికేష్, ప్రసన్న కుమార్, ధీరజ్, కార్తికేయ, చేతన్య సాయి, నక్కా రిత్విక్, ఉజ్వల్ గణేష్, అభిరామ్ శ్రీచరణ్ ఎంపికయ్యారు. వీరిలో అభిరామ్ శ్రీచరణ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఎంపికైన క్రీడాకారులు పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జట్టుకు విజయాలు అందించాలని అకాడమీ తరపున అభినందనలు తెలిపారు. భద్రాచలం ప్రాంతానికి చెందిన యువ క్రికెటర్లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం స్థానిక క్రీడాకారులకు స్ఫూర్తినివ్వడంతో పాటు ఈ ప్రాంతంలో క్రికెట్ అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వామ్మో కొండెక్కిన కూరగాయల ధరలు

- కొనుగోలు చేయలేక అల్లాడుతున్న సామాన్యులు
- ఎల్‌నినో ప్రభావం...తగ్గిన సాగు విస్తీర్ణం
- కూరగాయల సాగుకు రైతులు ముందుకు రావాలి: ఉద్యానవన శాఖ అధికారులు
- జేబులో రూ.500 తీసుకెళ్లిన సరిపడ కొనలేని దుస్థితి



**బొంరాస్‌పేట, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** వామ్మో కొండెక్కిన కూరగాయల ధరలు మార్కెట్ కు వెళ్లిన ప్రతి ఒక్కరి నోట ఇదే మాట..రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు లేకపోవడంతో కూరగాయల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. రూ.500 తీసుకెళ్లిన సరిపడా కుటుంబానికి కూరగాయలు కొనలేని దుస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. సాధారణంగా ఈ సమయంలో వర్షాలు సమృద్ధిగా కురిసి భూగర్భ జలాలు పెరిగి ఉంటే పంటలు బాగా పండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకుండా పోయాయి. బొంరాస్ పేట, తుంకిమెట్ల గ్రామాలలో ఆదివారం జరిగిన వారాంతపు కూరగాయల సంతలో పచ్చిమిర్చి కేజీ రూ.100, టమాట రూ.60, వంకాయ రూ.60, క్యారెట్ రూ.80, ఆలుగడ్డ రూ.80, చిక్కుడుకాయ రూ.80, బీరకాయ రూ.80, దొండకాయ రూ.60, క్యాలీఫ్లవర్ 60, వరకు ధరలు మండిపోతున్నాయి. ఇటు కూరగాయల ధరలతో పాటు కిరాణా షాపులో నిత్యవసర సరుకుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దినసరి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించే ప్రజలు ఒక పూట తింటూ మరొక్క పూట పస్తులు ఉండే పరిస్థితులు రాబోయే కాలంలో రానున్నాయి. సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలని ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

**సామాన్యులకు అందుబాటులో ధరలు నియంత్రించాలి**



ఎల్ నినో ప్రభావం వల్ల కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోవడంతో రూ.500 తీసుకెళ్లిన కుటుంబానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. ధరలు చూస్తే ఏం కొనాలో అర్థం కాని పరిస్థితి.. ప్రభుత్వం చొరవ తీసుకుని సామాన్యులకు అందుబాటులో ఉండేలా ధరలను నియంత్రించాలి.

సద్దాం బొంరాస్ పేట

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370